# ప్రజాకళ

ప్రజాస్వామిక సాహిత్య పత్రిక

తపస్సు చెయ్యడానికి వెళ్ళవలసింది

హిమాలయాల్లోకి కాదు

జనం లోకి

పరిత్యజించవలసింది సంసారబంధం కాదు

స్వార్థాన్ని

ఓంకారం కాదు

ఆర్తనాదమే జీవికి అన్ని భాషల్లోనూ మిగిలే

అనివార్య అంతిమ శబ్దం

అక్టోబరు 2007 సంచిక

మీ రచనలు, అభిప్రాయాలు పంపించండి, నిర్మాణాత్మక చర్చలో పాల్గొనండి

Editor@Prajakala.org

సూచిక


## కవిత్వం:

కొయ్యగుర్రం - నగ్నముని........................................................................ 3

కలత - నందిని సిధారెడ్డి ......................................................................6

సముద్రం: - వరవరరావు........................................................................ 8

రాలిపోవాలని ...... - పసునూరి రవీందర్ ........................................................... 16

## ఇంటర్వ్యూ:

స్త్రీలు,దళితులు,మైనారిటీలు,బహుజనులు చరిత్రలో జరిగిన జరుగుతున్న అన్యాయానికి బదులు అడుగుతారు. - కొండేపూడి నిర్మల ఇంటర్వ్యూ ........................................................ 18

## వ్యాసాలు:

ప్రాణుల లక్షణాలు, మనుషుల భ్రమలు - డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్........................ 24

ఇబ్సన్ తిరుగుబాటు ధోరణి - రాజమన్నారు నాటికలు - దామరాజు లక్ష్మి........................ 31

నిర్దేశాత్మక వ్యాకరణం, ప్రాదేశిక భాషలు -జిలుకర శ్రీనివాస్, పసునూరి రవీందర్................ 39

వాకపల్లి: ఒక పరామర్శ -కె. బాలగోపాల్ ................................................ 46

## కథలు

ఒక రాణీ ఒక రాజా - పి. సత్యవతి........................................................ 49

అభిమాని - సత్యజిత్ రాయ్, అనువాదం: అసూర్యంపస్య.............. 57

## కొయ్యగుర్రం – నగ్నముని

జీవితం మిధ్య అనడం అబద్ధం
ఎంగిలి మెతుకులేరుకుని ఎలక్ట్రిక్ తీగల మీదా
ఇళ్ళ కప్పుల మీదా జంతు కళేబరాల మీదా
'అలగాజనం' పుళ్ళ మీదా పొడుచుకు తినడానికి చేరే కాకులు మాత్రమే
మిధ్య గూర్చి కావుకావుమంటూ ప్రవచించగలవు

మానవత్వం బతికి వుందనడం అబద్ధం
కప్పుకోవడానికి మేక చర్మాల కోసం తిరిగే
మెకాలు మాత్రమే నీతి వాక్యాలు వేదికల నుంచి
ఉపన్యసించగలవు

విశ్వశ్రేయం కావ్యం అని అరుస్తూ
ప్రబంధ నాయకి తొడల బంధనాల్లో
పాదాలకు పూసుకుని ఎగిరే లేపనాల్లో
అంటుకున్న కవిత్వం అబద్ధం

తపస్సు చెయ్యడానికి వెళ్ళవలసింది
హిమాలయాల్లోకి కాదు
జనం లోకి

పరిత్యజించవలసింది సంసారబంధం కాదు
స్వార్థాన్ని

ఓంకారం కాదు
ఆర్తనాదమే జీవికి అన్ని భాషల్లోనూ మిగిలే
అనివార్య అంతిమ శబ్దం

జీవితం సాంకేతికమై జ్ఞాననేత్రం తెరుస్తుందనడం
అబద్ధం

మనిషి శతాబ్దాలు గడిచేకొద్దీ నాగరీకుడవుతాడనడం

అబద్ధం

ఈ భూమిపై నిరంతరం జీవన ఘోషతో
రోడ్ల పక్కన పడి మూలుగుతూ దొర్లుతున్న
కొన వూపిరి నిజం
మృత్యువు నిజం.

మౌనాన్ని మిగిల్చి వెలిపోయిన శవం నిజం
దరిద్రం నిజం
దరిద్రం చిమ్మే చీకటి నిజం
సమస్త లోకాన్నీ బతికించే సంపద సృష్టించే వాడి రక్తం
విలువలేని ఖనిజం

జీవితం నాగలై
చర్మాన్ని దున్ని ముడతల చాళ్ళతో నింపుతుంది
అనుభవాల పంట బంగారం పండుతుంది
పండించిన వాడి నోటిలో మొలిచేది మాత్రం జిల్లేడు
కళ్ళలో కదిలేవి వెలుగు కిరణాలు కారు
కన్నీళ్ళు

అంతరిక్ష నౌక
చంద్రమండలం వేపు దూసుకు పెడుతుంది
దానిలోనే పొంచున్న ఓ దోమ శాస్త్రవిజ్ఞాన ప్రగతిని
పరిహసిస్తూ వ్యోమగానం చేస్తుంది.

2

కవిత్వం కాగితాలపై అక్షరాల్ని ఖననం చేసే
కాటికాపరి
కవి నుండి బయటపడ్డ ప్రతి అక్షరం
భావాన్ని భ్రూణహత్యచేసిమరీ
బయట పడుతుంది

కవిని హంతకుడిగా చిత్రిస్తుంది

అక్షరాల్ని నిత్యం శంకించి ఉపయోగించేవాడే
నిజమైన కవి

మనిషిలోని అన్ని అంగాలూ
జంతువులుగా మారడానికే
జీవితాంతం ప్రయత్నిస్తాయి

ప్రకృతిలోని అన్ని గ్రహాలూ
భూమిని ప్రభావితం చెయ్యడానికే
గిరగిరా తిరుగుతాయి

చివరకు మిగిలేది
గాయంగాని రక్తం మరకగాని కనబడని
హత్య మాత్రమే

………………

రచనా కాలం: నవంబరు 1977

## కలత - నందిని సిధారెడ్డి

తప్పిన అడుగుల్లో
తలలు నాటుతున్నాం

కంటున్న కల పూర్తికాకుండానే
దబుక్కున మెలకువొస్తుంది

ఇక్కడేదో హార్మోనియం పెట్టె పగలినట్టు
శృతి విరిగిపోయింది
జానపదగీతం వినేతందుకు
జన్మభూమి మొరాయిస్తున్నది
ఊగిసలాటలో ఉడుకుతున్న జీవితం
చావువాసన సంతరించుకుంటున్నది

వానజల్లులు జల్లులుగా కురిసినా
మునుపటి వలె నేల పులకించటం లేదు

పాతనవి మొక్కలు కాదు
రాతికనీలు
వసంతం అడుగిడినా అవి చిగురించవు

తప్పిన దారుల్లో
కలలు వెదజల్లుతున్నాం

అష్టభుజి సందడిలో
ఉన్నభూజాలు పోతాయి
నిర్వాసితుల కన్నీళ్ళు
కంప్యూటర్ ను చెమరించలేవు
నిండు సభలో
మనిషి శిరచ్ఛేదాన్ని ఆపెతందుకు
ఎవరూ ముందుకు రారు

అందరిదీ ఒకే తల
నమ్రంగా నాలుక తిప్పటమే ఇ-కళ

దూప తీరకముందే
నది అదృశ్యం
ఎక్కక ముందే కొండ అదృశ్యం

విషాదాలు మోసెతందుకయినా
తలలుండాలె
విపేచన చేసెతందుకయినా
తలలుండాలె
ఎవల భుజాల మీద
వాళ్ళ తలలే ఉండాలె

సౌజన్యం: తెలుగు పలుకు

## సముద్రం: - వరవరరావు

నేను చూసివచ్చిన సముద్రం ఊసేమని చెప్పనూ
నా టెలివిజన్ కన్నుల్లో విను
నా మనసు మీద చెవి పెట్టి చూడు
నేనే క్యాసెట్‌నై రికార్డ్ చేసుకొని వచ్చిన
సముద్రం సంభాషణను విను

నా రక్తం ప్రతిధ్వనిస్తున్న
సముద్ర నిశ్వాసాన్నీ
నా ఊపిర్లు ప్రతిస్పందిస్తున్న
సముద్ర విశ్వాసాన్నీ విను

నా పాటయే మనిషయి ప్రతిఫలిస్తున్న
సముద్రం నిన్నూ నన్నూ ఆవహించనీ
ఎంత దూరం నుంచి నడచి వచ్చానో
సముద్రాన్ని చూడాలని.
అడవినై
ఆకుపచ్చ సముద్రం కోసం ఆక్రోశించాను.
గుహనై సముద్రం చీకటి లోతులలో
వెతకడానికి
నెత్తుటిలోని వెలుగునంతా
కళ్ళల్లోకి తెచ్చుకున్నాను.
కొండనై తల ఎత్తిచూసి
నదినై పరుగెత్తికొచ్చాను.

ఎన్ని యుగాలనుంచి ఎన్ని తరాలనుంచి
ఎన్ని దశలు ఎన్ని అవస్థలు, ఎన్ని వ్యవస్థలు
పడిలేస్తూ నడకలు, పరుగులుగా
సముద్రం నన్ను చూడాలని

సీమాంతాలనుంచో
చీకటి చెల్లిన చోటునుంచో
సముద్రం మొదలైన చోటునుంచో
నడచివచ్చిందో
అలలు అలలుగా
తెరలు తెరలుగా
తరగలు తరగలుగా
ఎగసిపడి కెరటమై వచ్చిందో
చీకటి సముద్రం, నల్లటి సముద్రం
నీలం సముద్రం, ఆకుపచ్చని సముద్రం
మెత్తని తెల్లని
నురుగులాంటి చిరునవ్వుతో నన్ను తాకి ంది
అన్ని సముద్రాలలో తానై
తనలో ఆన్ని సముద్రాలై
నా కాలివేళ్ళలో మునివేళ్ళు పోనిచ్చి పిలిచింది.
వేళ్ళ సందులలో నీళ్ళు నింపుతూ సముద్రం
విభజించబడ్డ భూభాగాన్ని
కలుపుతూ సముద్రం
నిలచిన గులకరాళ్ళను అరగదీస్తూ
నా నిలచిన పాదాలకింద
నీళ్ళ చక్రాలు తిప్పుతూ
సముద్రం రైలు,
సముద్రం బయలు, సముద్రం మెయిలు
సముద్రం జీవితం స్టయిలు

ఏమున్నది సముద్రం
నీళ్ళూ, ఉప్పెనా తప్ప
ఏమున్నది జీవితం మాత్రం
కన్నీళ్ళూ, తిప్పలూ తప్ప

సముద్రం సెత్తురు

నీళ్ళైన మాట నిజమే
సముద్రం కన్నీరు పెట్టిన మాట నిజమే
సముద్రం కన్నీళ్ళు
విరహకవి దు:ఖంలా మధురవేదన కాదు
నీ, నా కన్నీళ్ళవలె
ఉప్పగానే వున్నాయి

కాని సముద్రం కన్నీళ్ళై కరగలేదు.
సముద్రం కన్నీళ్ళలో మురగలేదు
సముద్రం ముంచెత్తింది గాని
తాను మునగలేదు

సముద్రం ఉన్నది
సముద్రం తానన్నది
నడచి, నడచి, నడచి
గడచి, గడచి, గడచి
పడిలేస్తూ అలలు అలలుగా
తానొస్తున్నానని అన్నది

రక్తంలో ప్రతిధ్వనిస్తూ సముద్రం
నా పాటలో ప్రతిఫలిస్తున్న సముద్రం

బతుకు పోరును
సముద్రం హెూరులో విన్నాను
బతుకు లోతును
సముద్ర కెరటంలో
బతుకురీతిని
పరుచుకున్న సముద్ర వైవిధ్యంలో
చదువుకున్నాను.

ఏమున్నది సముద్రం
నీళ్ళూ, ఉప్పూ

ఉప్పెనా తప్ప

ఏమున్నది జీవితం
చీమూ నెత్తురూ
పోరాటం తప్ప.

2

సముద్రం మళ్ళీ నా దగ్గరికి ఏదో చెప్పాలని వచ్చింది
సముద్రం దగ్గరికి మళ్ళీ వినాలని నేనే వెళ్ళాను
సముద్రాన్ని వెతుకుతూ వెళ్ళాను

తలాపున సముద్రం పెట్టుకొని
నీళ్ళకొరకు వెతికినట్లు
చుట్టూ పరుచుకున్న సముద్రాన్ని
కనుచూపు మేర సముద్రాన్ని
చూపు ఆగినచోటకూడా ఆగని సముద్రాన్ని
చూస్తే తప్ప పోల్చుకోలేవు

పై నురుగుల్నీ చూడాలి
నురుగుల మరుగునదాగిన లోతుల్నీ చూడాలి
నేల అంచులకు పయనించగా
నీలాల సముద్రాన్ని చూడాలి

ఏ పేరూ లేని నీరును
ఏ గడ్డన నిలబడితే ఆ పేరుతో పిలిచే మనిషికి
ఘోష తప్ప భాష లేని సముద్రం
ఏ రహస్యాలు వినిపిస్తుందో

ఒక్క క్షణం నిలవనీని నిరంతర ఘోష
ఒక్క క్షణం ఆగని నిరంతర చలనం
చీకటి ఆడుగుపై వెలుగు కెరటం
విరిగిన కెరటం అంచున దాగిన సముద్రగర్భం

సముద్రం గురించి ఎంతో చెప్పాలనుకొని
చెదరిపడిన నా అక్షరాల్లాగ-
వాటి అడుగున దాగిన నా మనస్సులాగ

సముద్రం తప్ప సముద్రాన్ని
కవిత్వం ఏం కళ్ళకు కట్టగలదు
పోరాటం తప్ప జీవితాన్ని
ఏ చీకటి- వెలుగులు వివరించగలవు

తనను చూడమని చెప్పింది సముద్రం
జీవించి పోరమని చెప్పింది సముద్రం
హోరుమని చెప్పింది సముద్రం

కెరటాలపై ఈదినవానితో
చెర లాడి
సముద్రగర్భం తాకిన వానికి
సవాళ్ళు విసిరి
ఊరక ఉప్పనీళ్ళ రుచి చెప్పినవాణ్ణి
ఒడ్డుకు విసిరికొట్టింది సముద్రం

ఇసుక పునాదుల్ని
ఒళ్ళు జలదరించేలా తొలిచేసి
నీటిలో నిప్పులను సృష్టించి
చూపుకు వెలుగు భూమికలను
అమర్చింది సముద్రం

సముద్రం సమాధానంలోని సమస్య
ప్రశ్నలోని జవాబు.
సముద్రం వైరుధ్యాలపుట్ట
సముద్రం వైరుధ్యాల పరిష్కారం
సముద్రం వైవిధ్యాల గుట్టు
ఐక్యతకు గుట్ట.

సరిహద్దుల్ని చెరిపేసే
పరసీమ సముద్రం

సముద్రం ముందు నిలబడితే
సముద్రం నా ముందు కెరటమై నిలబడితే
సముద్రం తప్ప క ళ్ళముందు మరేమీ వుండదు
మనసు సందులో
సముద్రం తప్ప మరేదీ దూరదు

గదిలో కూర్చొని సముద్రాన్ని రాయబోతే
కాళ్ళకింద నీళ్ళు
సముద్రపు మంటలాగ
కళ్ళలో నీళ్ళు
ప్రజాసముద్రపు బాధల్లాగ.
గుండెలో సముద్రధ్వని
శ్రీకాకుళాన్ని నెమరేసే కరీంనగర్ లాగ

కలంలోంచి సముద్రం
నా బతుకు పొరల్లో, స్మృతి తెరల్లో
కలల్లో దాచుకున్న విలువైన ఊహవలె
ఉరికి వస్తుంది గానీ
దాన్ని నిలపడం ఎట్లా
దానికి అక్షరాల అంగీలు తొడగడం
ఎట్లా?

చప్పన్నారు దేశాలను చప్పరించి
ఉప్పనగా ఉన్నాయని తేల్చేసిన సముద్రాన్ని
భూమినంతా ఒక చుట్టుచుట్టి
భూగోళం తిరుగుతోందని తేల్చేసిన
సముద్రాన్ని కాగితంపై నిలబెట్టడమెట్లా!

ప్రవాహాన్ని మనసుకు ఆవాహన చేసుకోవాల్సిందే తప్ప

ఏ బిందువుదగ్గర ఆపి దాని స్వరూపాన్ని వివరించగలం!

చూపుకు ఎత్తైన కెరటం
పాదాల అడుగున నీ పాదమెంతో అంతే
రూపుకు రవ్వల జడి
ఆచి విసిరిన విద్యుత్ఖడ్గం
అనంత రోచిర్నివహం
నాలుక చివరన నిలువని ఉప్పన.
ఎక్క డ మొదలయిందో
ఎంత ఉద్వేగంతో ఉధృతంతో
ఉరకలు వేసి వచ్చిందో
భయం గొలిపే మహదాకారం
ఆకాశాన్నీ భూమినీ ఆవరించిన సముద్రం
ఇసుక రేణువులముందు తలవొంచి
నీ పాదాలదగ్గర
నువు సాదుకున్న గుర్రంలా
నిన్ను స్పృషిస్తూ నిలిచిపోతుంది.
నీ పాదాలదగ్గర జారిపోతుంది

ఏదో చెప్పాలనివచ్చి చెప్పకుండానే
నీ చూపులలోనూ స్మృతిలోనూ
నిలచిపోతుంది
అగాధ సముద్రం.

***

3

సముద్రం సంక్షోభపడుతున్నదని తెలిసి
సముదాయిద్దామని దగ్గరికి వెళ్ళాను

ద్రవం ఉన్నచోట ఉపద్రవం వుంటుంది
ఉప్పన్నచోట ఉప్పెన తప్పదు
నెత్తురు ప్రవహించే నరాలు చిట్లినపుడు

గాయమూ చీమూ తప్పవు

నీళ్ళున్నచోట కన్నీళ్ళేకాదు

కాంతిపుంజాలు వెతుక్కోవాలని

చెప్పడానికి వెళ్ళాను.

ఏం చెప్పడానికి వెళ్ళానో గాని

సముద్రతీరాన నిలబడ్డాను

సముద్రతీరమై నిలబడ్డాను

సముద్రం చెలియలి

కట్టపై కట్టుబడిపోయాను.

సముద్రం ఘోష నన్ను తాకి

కన్నీటితో కడిగింది

నా ముందు తాను నురుగై కరిగిపోయింది

కెరటమై విరిగిపోయింది

కెరలి కెరలి తిరిగిపోయింది

అలలు అలలుగా తిరిగివచ్చి

నా మనసులో ప్రవహించి

సముద్రం నన్ను స్నేహంలో ముంచెత్తింది.

……………..

సౌజన్యం:

http://www.varavararao.org
Youtube

## రాలిపోవాలని ...... - పసునూరి రవీందర్

నాయిన

ఎద్దుల బండి పోయిందని కాదు,

నాయినే పోయిండని

ఈ బాధ.

లాభం జరిగినోనికి

మోసం కూడ

రంజుగ, పసందుగనే తోస్తది.

కానీ......

పూటకొక్క మెట్టు

దిగజారుతున్నోడికే ఎరుక

కుట్రెంత బేజార్ చేస్తదో,

మోసమెంత మొదలారుస్తదో!

దుక్కి దున్నిన

నాగలి కర్రుకు ఉరితాడు పేనిందెవడు?

తిండిగింజలొదిలి

వ్యాపార పంటల ఆశరేపిందెవడూ?

అయినా...,

మనుషుల్ని మాయంజేసినోడికి

మట్టిని మాయంజేసుడొక లెక్కా!

ఊళ్ళు ఖాళీ చేసి,

శ్మశానాల్ని

అభివృద్ధి చేయడం వాడి కల.

పాణాల్ని పాతరేసినోడు

ఇయ్యాల భూమ్మీద కన్నేసిండు.

కనురెప్పలు మూయకుండనే

కాళ్ళ కింది నేలను

ఖతం చేస్తున్నడు.

వాడికి చరిత్ర తెలియదుగానీ,

కూసున్న కొమ్మను

నరుకున్నోడెవడైనా ....

కూలిపోతాడని,

రాలిపోతాడని......

## స్త్రీలు,దళితులు,మైనారిటీలు,బహుజనులు చరిత్రలో జరిగిన జరుగుతున్న అన్యాయానికి బదులు అడుగుతారు. - కొండేపూడి నిర్మల ఇంటర్వ్యూ



కొండేపూడి నిర్మల ప్రముఖ స్త్రీవాద కవయిత్రి,రచయిత్రి. 1980 దశకంలో తెలుగు సాహిత్యంలోకి ఉవ్వెత్తున ఎగిసిపడుతూ వచ్చి చేరిన స్త్రీవాదం ఎంతోమందిని ప్రభావితం చేసింది. అప్పటివరకూ అంటరానివిగా మిగిలిపోయిన ఎన్నో కొత్త వస్తువులను స్వీకరించి,స్త్రీవాద స్పృహ తో, స్త్రీల దృష్టి కోణంతో కవిత్వం రాసిన వారిలో కొండేపూడి నిర్మలను ప్రముఖంగా పేర్కొనాలి. ముఖ్యంగా నిర్మల రాసిన "లేబర్రూం" కవిత పురుష విమర్శకులకు దిమ్మ తిరిగేలా చేసింది. ప్రసవసమయంలో స్త్రీ పడే వేదనని "రైలు పట్టాలమీద నాణెం విస్తరించినంత బాధ" అంటుంది. నిర్మల తెలుగు సాహిత్యంలో స్త్రీవాద గొంతును బలంగా,తీవ్రంగా,సూటిగా వినిపించడంలో అగ్రభాగాన ఉన్నదనడంలో అతిశయోక్తి ఎంత మాత్రమూ లేదు.

నేటి సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పట్ల ఒక కవయిత్రిగా స్పందించి, స్పష్టమైన భావాలతో, సరళమైన భాషలో, భావోద్వేగం తో కవిత్వం రాస్తారు, కొండేపూడి నిర్మల. జనం మాటలలో, స్వచ్ఛమైన తెలంగాణ పల్లె మాండలికం లో కవిత్వాన్ని అల్లుతారు. "ఎన్ని మందుల సల్లినా సేను కొరికే పురుగు బతుకుతాంది, ఎన్ని ఎలచ్చన్లు మారినా దేశం కొరికే సర్కారు బతుకుతాంది" అని ధిక్కారంగా, ధైర్యంగా కఠిన వాస్తవాలను చెబుతారు.ఇప్పటిదాకా సంధిగ్ధ సంధ్య (1988), నడిచే గాయాలు (1989), బాధ సెప్త నాది (1994) , మల్టీనేషనల్ ముద్దు (2001) అనే కవితా సంకలనాలు మరియు శత్రు స్పర్శ (1998) అనే కధా సంకలనం రాసారు.

### కుటుంబ జీవనం-

మూడూ సాదా సీదా విషయాలే. సాధారణ మధ్యతరగతిలో పుట్టాను. అమ్మానాన్నా, అయిదుగురు పిల్లలం, మేనత్తలు, బాబాయిలు, బామ్మ, తాత లాంటి ఒక ఉమ్మడి కుటుంబంలో నా బాల్యం గడిచింది. డిగ్రీ వరకూ విజయవాడలో చదువుకుని జర్నలిజం అంటే వున్న ఆసక్తి వల్ల ఆంధ్రజ్యోతి లో చేరాను. చేరిన ఏడాది గడిచే లోగా పెళ్ళీ పిల్లలూ లాంటి కుటుంబ బంధాలలో చిక్కుకున్నాను. దాదాపు కరీంనగర్

లోని ప్రతి గ్రామాన్ని చూశాను. పది సంవత్సరాల పాటు ఒక స్పందించే మనిషిగా అక్కడి గ్రామీణ పేదరికం, వెట్టి చాకిరి, మూఢాచారాల మధ్య నలుగుతున్న స్త్రీలను చూశాను.

ప్రభావితం చేసిన విషయాలు, ఇంతవరకూ చేసిన రచనలు;
బాగా చిన్నప్పటినుంచీ కథలంటే ఇష్టం.చేతికి దొరికిన ప్రతి పత్రికా చదివేదాన్ని. ఆ పాత్రల్లాంటి మనుషులు నా చుట్టూ ఎవరెవరు వున్నారో కనిపెట్టడం చాలా సరదాగా వుండేది. రచయిత/రచయిత్రి రాసిన ముగింపు మార్చి నేను ఇంకోలా రాయడం, ఎత్తుగడ ఇంకోలా వుంటే ఎలా వుంటుందా అని ఆలోచించడం నాలో జరుగుతూ వుండేవి. అశోకుడు కళింగ యుద్ధానికి బయలు దేరి దారి మధ్యలో గాఢమైన ప్రేమలో పడితే ఎంత బావుంటుందో ఊహిస్తూ పరీక్షల్లో జవాబు రాస్తే మార్కులు సున్నాలు వచ్చినా గాని తోటి వాళ్ళ ముందు చాలా గొప్పగా వుండేది. అందరికంటే భిన్నంగా నా పైత్యం, తాపత్రయం తరవాత రచనలకు కొంచెం పనికొచ్చి వుండచ్చు. ఇప్పటివరకూ నాలుగు కవితా సంకలనాలు, ( సంధిగ్ధ సంధ్య, నడిచే గాయాలు, బాధ సెప్త నాది, మల్టీ నేషనల్ ముద్దు), ఒక కథా సంకలనం ( శత్రు స్పర్శ ) ప్రచురించాను. ఉద్యోగరీత్యా అనేక వ్యాసాలు, కాలమ్స్ అచ్చయ్యాయి.

రచనలు చేయడం అభిరుచా? జీవన విధానమా? భావోద్వేగమా?
ఈ మూడూ ఒకదానికొకటి కొనసాగింపు అవుతుంది. రచన చేయకుండా వుండలేను. ఎందుకంటే అది జీవితం గా మారిపోయింది. అప్పుడప్పుడు నా అంతట నేనే నిశ్శబ్దం గానో, భావ రహితంగానో వుండచ్చు. ఆ దశలో చాలా హింస పడతాను. ఎందుకంటే రచన చేయడం సామాజిక బాధ్యత అని నమ్ముతాను. ప్రారంభంలో అందరిలానే ఇది మాట్లాడటం కంటే ఎక్కువగా దూరానికి తీసుకెళ్ళ గల వ్యక్తీకరణ కు మార్గం అనుకున్నాను. రాస్తున్న సమస్యను బట్టీ దాంతో మనం మమేకం అయిన తీరుని బట్టీ కొన్నిసార్లు ఉద్వేగపడటం, కొన్ని సార్లు గంభీరంగా వుండటం జరుగుతుంది. ఉద్వేగం వుంది కాబట్టీ రచన చెయ్యలేం.

కవితా వస్తువు,శిల్పాల వెనక వుండే ఆలోచనా స్రవంతి;
ఎక్కువగా స్త్రీల సమస్యల మీద స్పందించి రాసిన మాట నిజమే. అది నా అస్తిత్వం. పురుషుల వైపునుంచి రాసినవి లేకపోలేదు. ఇల్లు మారినప్పుడు, వచ్చీరాని వయసు. ద్రౌపది నవ్వు (కథ) లాంటి కవితలు వున్నాయి. అప్పుడది సహానుభూతి మాత్రమే అయిందేమో తెలీదు. అందులో నిర్మల కనిపించలేక పోయింది.
అయినా ప్రపంచం నిండా కిటకిట లాడే పురుషుల ఆలోచనలు ,కోరికలు, ఆశలు, నోములు నోచి మరీ దక్కించుకోవాల్సిన సుఖశాంతులు, విలువలు, నమ్మకాలు, సామాజిక అంశాలు, వీరచరిత్రలు,సాంకేతిక అంశాలే వున్నాయి. చివరకు దేశభక్తి గీతంలోనూ అవే అవే వుంటాయి. మరి అతడు కాని ప్రాణి ఒకరున్నారు. ఆమె స్త్రీ ఒకరి నీడ గానో ,గోడా గానో , సగము గానో పావు గానో బతుకుతున్న స్త్రీ. సహజం

గానే నేనయినా ఇంకొకరయినా ఆ వస్తువును తీసుకోవాలి. ఆమె ప్రమేయం లేని సమసమాజ స్థాపన లోనూ నాగరికతలోనూ మనం అంతా వున్నాం. ఇందుకు భిన్నంగా రాయాలను కున్నాను.రాస్తున్నాను.

ప్రపంచీకరణ, అస్థిత్వ ఉద్యమాల నేపధ్యం లో కవిత్వ పరిణామం ,వస్తువు, శిల్పం లో మార్పులు;
ప్రపంచీకరణ ప్రధానంగా వ్యాపారానికి సంబంధించినది. వాణిజ్యరంగంలో చాలా మార్పులు వచ్చాయి. మనది కాని, అవసరం లేని వస్తువు,సంస్కృతి,విలువలు,రాజకీయాలలో చోటు చేసుకున్నాయి. ఇవాళ ప్రభుత్వానికి ప్రత్యామ్నాయంగా కొన్ని కంపెనీలు ప్రజల్ని నడిపిస్తున్నాయి. కొన్ని వ్యాపారసంస్థలు, గూండా మనుషులు కవిత్వాన్ని పోషిస్తునాయి. 'సింకింగు' అనే కవితలో నేను రాసినట్టు జానపద కళలన్నీ వస్తువుల్ని అమ్మి పెట్టే సాధనాలయ్యాయి. మనిషి, అతని స్పర్శ,చెమట,సంతోషం, చివరికి శృంగారానికి కూడా వస్తు ప్రేరకాలు కావ్య శృంగారం వస్తువు కింద పడి నలిగి పోతున్నాయి.

అస్థిత్వ ఉద్యమాలు వేరు. అవి సహజ పరిణామంలో వచ్చాయి. స్త్రీలు,దళితులు,మైనారిటీలు,బహు జనులయినా వారి సమస్యల మీద మాట్లాడతారు. చరిత్ర లో జరిగిన జరుగుతున్న అన్యాయానికి బదులు అడుగుతారు. ఇవాళ వాకపల్లి గిరిజన మహిళల గురించి వేదిక మీదికి వచ్చిందంటే అది అస్థిత్వ ఉద్యమాల ఫలితమే. ఉద్యమం ఏదయినా కొత్త వెలుగుకి చోటిస్తుంది. ప్రపంచీకరణ మూలంగానే అస్థిత్వ ఉద్యమాలు దెబ్బ తింటున్నాయి. వస్తువులోనూ శిల్పం లోనూ ఎన్నదగిన మార్పు వచ్చింది. అది సాహిత్యంలోనూ ,కళా రూపాల్లో నూ కనిపిస్తోంది. అయితే అమ్మబలుకు సాహిత్యం బాగా పుట్టింది. సాధారణ పత్రికలలో అచ్చవడానికి కూడా పనికి రాని కవిత్వం, కథ తెలుగు సాహిత్యం పేరుతో దేశ దేశాలకు పోతోంది.

భావ కవిత్వం గురించి సరిగా అంచనా వెయ్యలేదని అంటున్నారు....;
నా దృష్టిలో భావ కవిత్వానికి వచ్చినంత ప్రచారం మరి దేనికీ రాలేదు.

విప్లవ కవిత్వ పరిణామం;
విప్లవ కవిత్వం తనవంతు పాత్ర అది పోషిస్తోంది. అభ్యంతరకర పరిణామం ఏదీ కనిపించలేదు. మిగిలిన అన్నింటా వున్నటువంటి ఆధిపత్య సంగ్రహణలు, చీలికలూ వుంటే వుండచ్చు. వ్యక్తులు స్వతంత్రమవుతున్నకొద్దీ, కార్యాచరణ లో మార్పు కనిపిస్తుంది. మార్పు సహజమే కూడా కదా.

కవిత్వం లో శిల్పం బలహీనంగా వుందనే వెల్చేరు గారి అభిప్రాయంపై....వ్యాఖ్య;
ఇప్పుడు వస్తున్న కవిత్వాన్ని నా లాంటి కవిత్వాభిమానులే పూర్తి స్థాయిలో సేకరించి చదవలేక పోతున్నారు. ఎప్పుడో ఒకసారి వచ్చి, వెళ్ళే వెల్చేరు నారాయణ గారికి ఏది దొరుకుతుంది. తను

చదివిన,ఎవరైనా చదివించిన కవిత్వమే సమగ్ర రూపం కాకపోవచ్చు. వ్యక్తి అభిప్రాయాల్ని బట్టి చరిత్రని నిర్ణయించడం మానుకుంటే మంచిది.

రాజకీయ కవి కాని వాడు లేడు అంటున్నారు, దీన్ని ప్రాచీన కవుల దృక్పథం నుండి వివరిస్తారా?
ప్రాచీన కవులు రాజ పోషకులు. అంటే ఇప్పటి ప్రభుత్వ కవులు లాంటి వారు. మనం రేడియో లోనూ, టి.వీ.లోనూ ప్రభుత్వాల గురించి లోపాల్ని గురించి రాయలేనట్టే ,వాల్ల బాధలు వాళ్ల కుండేవి. అయినా పరోక్షంగా రాసినవి వుండేవి. పోతన,వేమనలాంటి వాళ్ళ పద్యాలు చదివితే అప్పటి రాజకీయమే కాదు. అన్ని కాలాలనీ ప్రతిబింబించే వాక్యాలు, విమర్శలు కనిపిస్తాయి.

కవులు ఒక పంథాను అనుసరించి కవిత్వం రాస్తున్నారు. స్త్రీవాద కవులు స్త్రీవాద కవిత్వాన్ని,దళిత కవులు దళితవాద కవిత్వాన్ని రాస్తున్నారు, మంచిదే. కాని మరి విస్తృత దృక్పథంతో ఇతర కోణాల్లో కవిత్వం రాయడం అవసరమ కాదంటారా?
ఏ వాదమూ లేనిది, ఏ గొంతుకూ ప్రాతినిధ్యము లేనిది ప్రధాన స్రవంతి కవిత్వమని మనం నమ్ముకున్నాం. స్త్రీలు,దళితులు,మైనారిటీలు గొంతు విప్పాక అనేక కొత్త వెలుగులు మిరుమిట్లు గొలుపుతూ కనిపిస్తున్నాయి. అస్థిత్వవాద ఉద్యమాలు కవిత్వానికి ఒక మంచి కూర్పు అవుతాయే తప్ప, చీలిక కాదు, పక్కదారి అంత కంటే కాదు. ఇంకా చాలా రావాల్సి వుంది. భవిష్యత్తు మీద నాకు చాలా ఆశలున్నాయి. ఇతర సామాజిక కోణాల్లో వాళ్ళే రాయగలరు. రాస్తున్నారు కూడా.

తెలుగు కవిత్వంలో విప్లవ రచయితల సంఘం పాత్రను ఎలా అంచనా వేస్తారు? ఇంకా ఎలాంటి మార్పులు ఆశిస్తున్నారు?
తెలుగు కవిత్వంలో విరసం పాత్ర చాలా వుంది. సాహిత్యం కార్యాచరణ సంబంధాలకి దారి చూపింది. అక్షరం కార్యకర్త అయింది. పాట ప్రభుత్వంతో మాట్లాడింది. సాహిత్యం సామాజిక ప్రయోజనానికే అన్న మాట అక్షరాలా నిరూపితమయింది. ఇప్పుడు మనకు కనిపిస్తున్న మార్పు ఏదయినా వుంటే దాన్ని గురించి మాట్లాడే బాధ్యత అందులో వున్న వారే చెబితే బావుంటుంది. గట్టున కూర్చుని వ్యాఖ్యానించడం పట్ల నాకు సదాభిప్రాయం లేదు.

సాహిత్య రంగంలో ఏర్పడిన సంస్కృతీకరణనూ,బ్రాహ్మణ భావ జాలాన్నీకవిత్వం ఎలా ఎదుర్కొంది?ఉత్పత్తిలో భాగమైన శ్రమ జీవుల జీవన గాధలను సరిగ్గా చిత్రించగలిగిందా?
కవిత్వం చేసిన మొదటి పని అదే. ప్రధాన స్రవంతి కవిత్వం లో కనిపించే అలక్షణాలని అస్థిత్వవాద కవిత్వం బాగానే తిప్పి కొట్టింది. రాయలసీమ, తెలంగాణా కథ, కవిత్వం శ్రమజీవుల్ని గురించి మాట్లాడింది.

అమెరికాలోని బీట పొయిట్రీలో గాని,ఇతర ఇంగ్లీషు పొయెట్రీలో గాని బజారుభాష (స్ట్రీటు పొయెట్రీ) పదాలు బాగావాడారు,. ఆసంస్కృతిలో అదో భాగమై పోయింది? తెలుగు లో అలాంటి ప్రయోగాలు చెయ్యాలన్నా భయపడతారు....

తెలుగు లో దళితులు గాని అంతకు ముందు, దిగంబరులు ఆ ప్రయోగం బాగానే చేశారు కదా. సహజంగా ప్రయోగాలకు వుండే మిశ్రమ స్పందన దానికీ వుంది.

యువ ప్రాయంలో రక్తం మరిగిన కాలానికీ ,ఇప్పటి కవిత్వానికి తేడా ఏమిటి?

కవిత్వంలో అయినా జీవితంలో అయినా ప్రవాహ వేగం యువ ప్రాయంలో ఎక్కువగా వుంటుంది. తరవాత బాలన్సు మొదలవుతుంది. ఆలోచన, వివేచన మొదలవుతుంది. అప్పుడు మరింత సమర్ధవంతమయిన కవిత్వం వస్తుంది.

రైతుల ఆత్మహత్యలతో పల్లెలు వల్లకాడవుతున్నాయి. ఒక కవిగా మీరు ఎలా స్పందిస్తారు.

రైతులు ఆత్మ హత్యలు చేసుకోవడమే కాదు. అలా చేసుకోవడం కూడా నష్ట పరిహారాల కోసమని స్వయంగా మన ముఖ్యమంత్రే అనడం హేయం. అప్పుడు నేను ఒక పత్రికలో జర్నలిస్టుగా కొందర్ని ఇంటర్వ్యూ చేసి రాసిన కవిత "కాటిసుంకం"...

సంపేటోడికి సచ్చేటోడు లోకువ గద అన్నా!
వాడట్టనే గొనుగుతడు
నేతలంటే గోడలెనక కుర్సీలెనక దాగేటోడని మాకానాడే తలవ పట్టె
సత్తాలేని సర్కారోడికి మాలాంటి సన్నాసోడే లోకువ గద అన్నా!
మా అడవులల్ల కట్టె మాది కాకపొయ్యె
మా వాగులల్ల ఇసక మాది కాక పొయ్యె
మా మార్కెట్టుల సరుకు మాది కాక పొయ్యె
సేనుల్ల పురుగు పాకి బతుకులల్ల పురుగు మందు పాకి, మడిసి మడిసెక్కా ఒక్క తీరున సచ్చిపోతే ,
కన్నోల్లకీ కట్టుకున్న దానికీ కడుపు సెరుపైన గోస గా దళారోడు ఎంగిలి సేసిన కాటిసుంకంతో తీరుద్దా?
ఎన్ని మందుల సల్లినా సేను కొరికే పురుగు బతుకుతాంది,
ఎన్ని ఎలచ్చన్లు మారినా దేశం కొరికే సర్కారు బతుకుతాంది."

ఈ కవిత హిందీలోకి కూడా అనువదించారు.

తస్లీమా, హుస్సేను మీద జరిగిన దాడులు..

మనిషైన ప్రతివాడు ఖండించాల్సిన దాడులు అవి. భావ వ్యక్తీకరణను హింసించడమంటే మనది ప్రజాస్వామిక ప్రభుత్వమేనా అనే అనుమానం రావాలి. నాకు అక్షరాల్లో ఇమడనంత కోపం వచ్చింది.

తెలుగు నేల మీద మాట్లాడుతున్న మాండలీకాలు కవిత్వాన్ని ఎలా ప్రభావితం చేస్తాయి?
మాండలీకాలకు సాహిత్యంలో పాత్ర వుండాలని పెద్ద ఉద్యమాలే జరుగుతున్నాయి.ఇంకా జరగాలి.అందరిదీ తెలుగు భాషే అయితే అందరి భౌగోళిక వాస్తవాలను, ప్రాంతీయతలో ఇమిడిన సంపదని అందరు చదవాలి. కవిత్వం మీద మాండలీకాల ప్రభావం చాలా వుంది.

తెలుగు కవయిత్రుల కవిత్వాన్ని చారిత్రాత్మకంగా ఎలా అంచనా వేస్తారు/
కవయిత్రుల కవిత్వం కొత్తగా ప్రారంభం కాలేదు. ప్రధాన స్రవంతిలోనూ వుంది. అయితే 1770 ల నుంచీ సూచన పరంగాను 1985 నుంచీ సంఖ్యా పరంగానూ బాగా పెరిగింది. స్త్రీల సమస్యలను వేరుగా చూడటం వల్లను, కవిత్వం అంచనా వేసే పడికట్టు రాళ్ళు మారక పోవడం వల్ల ఈ ఆలస్యం జరిగింది.

తెలుగు లో వచ్చిన స్త్రీవాద సాహిత్యం సగటు మహిళ పైన పెద్దగా ప్రభావం చూపించలేదు. సమాచార సాంకేతికరంగం అభివృద్ధి వల్ల మధ్యతరగతి మహిళలు ఆర్ధిక స్వతంత్రం పొందినట్టు కనిపిస్తోంది. అంతిమంగా మహిళల జీవితాలను ప్రభావితం చేస్తున్నది ఆర్ధిక పరిస్థితి యే కానీ సాహిత్యం కాదు. ఇలాంటి అంచనా సమంజసమంటారా?
సాంస్కృతిక ఉద్యమాల్లో ఫలితాలు వెంటనే కంటికి కనిపించవు. సబ్బులాగా,టీ పొడరు ప్రకటన లాగా తక్షణం ముందడుగు వేయించడం ఎంత కష్టమో మీకు చెప్పనక్కరలేదు. అయినా మిగిలిన ఉద్యమాలతో పోల్చితే ఫెమినిస్టు/ స్త్రీవాద ఉద్యమం చూపిన విజయాలు చాలా వున్నాయి. సాహిత్యంలో భాష శుభ్ర పడింది. భాష కొక దృక్పధం వుంటుందని తెలిసింది. కొత్త వస్తువులతో, సమస్యల వ్యక్తీకరణతో సాహిత్యానికి కొత్త చూపు వచ్చింది.
మధ్యతరగతి మహిళకి / గ్రామీణ మహిళకి ఇవాళ జెండరు ఒక సిలబసుగా చదువుకుంటోంది. ఇంటికి దీపం ఇల్లాలు లాంటి వాక్యాలు ఇవాళ ఎవరూ నమ్మరు. అయితే నేరాలు పెరగలేదా, బాధితులు లేరా? బాల్య వివాహాలు లేవా? అంటే వున్నాయి. అది ప్రభుత్వం బాధ్యత. ప్రభుత్వ సేవలు ఉపయోగించుకునేలా చెయ్యడానికి కూడా స్త్రీవాదం అవసరమవుతుంది. సమానత్వ భావన స్త్రీవాదమ వల్లనే బలపడింది. స్త్రీవాద కవితలు కథలు ఇవాళ గ్రామీణ మహిళలు కేసుస్టడీలు గా చదువుకుంటున్నారు. పాటలుగా పాడుకుంటున్నారు.
స్త్రీవాదం అనే పేరుతో కాకపోయినా మహిళకు వ్యతిరేకంగా పైకి మాట్లాడ్డం నేరమనే స్పృహ ఒకటి వచ్చింది. దళితుల్ని ఆ పేరుతో తిట్టినందుకు కేసు పెట్టడమే ఒక ఉదాహరణ. తెలుగు లో స్త్రీవాదం వేసిన పునాది తర్వాత ఉద్యమాలకు పనికొచ్చింది.

## ప్రాణుల లక్షణాలు, మనుషుల భ్రమలు - డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్



మనుష్యులు తక్కిన జంతువులతో పోలిస్తే అసాధారణ జీవులే. మనుష్యుల ప్రత్యేక లక్షణాలకు వారి మెదడూ, బాగా పరిణతి చెందిన నాడీ వ్యవస్థా ముఖ్యకారణాలు. ఈ ప్రత్యేక లక్షణాల్లోనే కొన్ని తప్పుడు నమ్మకాలకూ, భ్రమలకూ కూడా దారితీస్తున్నాయి.

ప్రకృతిలో ఒక భాగంగా కాక, తనను ప్రత్యేక సృష్టిగా, మొత్తం ప్రాణికోటికి పరాకాష్ఠగా భావించే మనిషి అసలు ఎలా పరిణామం చెందాడో తెలిస్తే జీవరాశిని గురించిన సరైన అవగాహన ఏర్పడుతుంది. ఎందుకంటే ఆధ్యాత్మిక వివరణలను పట్టించుకోకుండా, సహజవిషయాల గురించి సైతం ఉన్నవీ లేనివీ కల్పించుకుని గందరగోళపడకుండా జీవించడం చాలామందికి అసాధ్యం అనిపిస్తుంది.

'జీవసృష్టి'ని అర్థంచేసుకోవడం కష్టమేమీ కాదు. మొదట ఏకకణజీవుల రూపంలో భూమిమీద ఉద్భవించిన జీవరాశి క్రమంగా బహుకణ సముదాయాలతో కూడిన ప్రాణుల ఆవిర్భావానికి దారి తీసింది. ఇదంతా సముద్రజలాల్లో వందల కోట్ల సంవత్సరాల తరబడి జరిగిన పరిణామం. రకరకాల వింత జంతువులతో లుకలుకలాడిన ఆనాటి సముద్రాలనుంచీ, బురదతో నిండిన జలాశయాలనుంచీ, జలచరాలూ, ఉభయచరాలూ పుట్టుకొచ్చాయి. మారుతున్న భౌగోళిక, వాతావరణ పరిస్థితుల్లో అంతకంతకూ పోటీ పెరిగి, బైటి మార్పులకు తట్టుకోగలిగిన శారీరక లక్షణాలు కలిగిన ప్రాణులు మాత్రమే బతకగలిగాయి. వీటిలో కొన్ని చిత్రవిచిత్రమైన రూపాలను సంతరించుకున్నాయి. భౌతిక కారణాలూ, ప్రేరణలూ లేకుండా ఏ మార్పూ జరగలేదు. "దైవశాసనాలు" అమలైనట్టు దాఖలాలు ఏవీ లేవు. చిన్నచిన్న విషయాల్లో కూడా ఇది స్పష్టమౌతుంది. పైనున్న వీపు భాగం ముదురు రంగుతోనూ, కింది పొట్ట తేలిక రంగుతోనూ అనేక రకాల చేపలు కనబడతాయి. ఇలా జరగడం వల్ల పైన ఎగిరే పక్షులకు వాటిని గుర్తించడం కష్టం. అలాగే వాటికి ఎర అయ్యే చిన్నచేపలకూ కింద ఈదుతున్నప్పుడు వాటిని గుర్తించడం కష్టమే. తమను అపాయంనుంచి కాపాడుకుంటూ, తమకు అవసరమైన ఆహారాన్ని తేలికగా

సంపాదించుకుంటూ బతకడానికి అవసరమైన రంగులు ఆ చేపలకు దక్కాయి. ఇలాంటి మార్పులు చెందలేని చేపలు అంతరించిపోయాయి.

ఎవరో ఎంపిక చేసినట్టుగా అనిపించే ప్రాణుల లక్షణాలన్నీ యాంత్రికంగా, జీవపరిణామపు పోటీలో ఏరివేత ద్వారా మిగిలినవేనని చాలామంది గుర్తించరు. దీనికి తోడుగా మనుషులకు 'మహిమ' ల గురించి సహజంగా కలిగే భ్రమలు కొన్ని ఉంటాయి. ఏ వంకాయనో అడ్డంగా కోసినప్పుడు అందులోని గింజలు ఓం అనే ఆకారంలో కనబడగానే కొందరు పరవశించిపోతారు. దాని వివరాలూ, ఫోటోలూ పత్రికల కెక్కుతాయి. అదే కాయను మరొక దిశలో కోసి ఉంటే గింజల ఏర్పాటులో ఇటువంటి 'మహత్తు' కనబడి ఉండేది కాదని వారికి తట్టదు.

పూలమొక్క రెమ్మల్లో 'ఓం'

ఒక పూలమొక్క రెమ్మల్లో ఒక ఫోటోగ్రాఫర్ ఓం స్వరూపాన్ని గుర్తించాడు. మన దేశపు ఒక పక్షి కృష్ణా అని అరుస్తుందట.

తేనెపట్టులో అల్లా పేరు



సిలువ ఆకారంలో వెలుగు



ఇటువంటి అపోహలు అన్ని మతాల్లోనూ కనిపిస్తాయి. కొన్ని చెట్ల గుంపులనో, తేనెపట్టు స్వరూపాన్నో చూసినప్పుడు అందులో అల్లా అనే అరబిక్ అక్షరాలు కనబడిన దాఖలాలతో ఫొటోలున్నాయి. కొందరికి దీపాల కాంతుల్లో సిలువ వెలుగుతున్నట్టుగా కనిపించి, ఆశ్చర్యానందాలు కలుగుతాయి. మానవ సమాజాలు శైశవదశలో ఉన్నప్పుడు వారి మనస్తత్వం చిన్నపిల్లలను పోలి ఉండేదని చారిత్రక విజ్ఞాన పరిశోధనలు తెలుపుతున్నాయి. ఆ స్థితి ఈనాటికీ కొనసాగుతోందనడానికి ఈ ఉదాహరణలు చాలు.

వంగ గింజలైనా, తేనెపట్లయినా తలవనితలంపుగా వాటిలో కనబడుతున్న సహజరేఖలు ఏవో కొన్ని లిపుల్లో అర్థవంతమైన మాటలుగా కనబడినంత మాత్రాన వాటికి ఎటువంటి ప్రాముఖ్యతా కలగదు. ఈమధ్య తలెత్తిన 'రామ సేతువు ' రభసలో సముద్రాల్లో సహజంగా జరిగే పరిణామాలను గురించిన ప్రస్తావన వచ్చింది. కొందరు ప్రబుద్ధులు 'చూడగలిగినవాళ్ళకి భగవంతుడి మహిమలు ఎల్లెడలా కనిపించగలవు' అన్ని ప్రవచిస్తూ ఉంటారు. కొన్నేళ్ళ క్రితం ఒక ప్రముఖ వారపత్రిక 'తిరుపతి నిదర్శనాలు' అనే శీర్షికను ప్రతి వారం ప్రచురించేది. బుద్ధిపూర్వకంగా భ్రమలను ప్రోత్సహించడమే అందులోని ఉద్దేశం.

'రాముడి' సేతువు



కశ్మీర్ ప్రాంతపు అమర్‌నాథ్ శివలింగం సహజంగా మంచువల్ల రూపొందిన ఆకారం. స్టాలగ్మైట్ అనబడే ఇటువంటి సున్నపురాతి ఆకారాలు ప్రకృతిసిద్ధంగా గుహల్లో ఏర్పడతాయి. ఎన్నో శతాబ్దాల కిందట ప్రజల మనస్సును చలింపజేసిన ఇటువంటి 'వింతలు' ఈనాటికీ తమ 'ఆధ్యాత్మిక' శక్తితో యాత్రాస్థలాలుగా కొనసాగుతున్నాయి.

అమర్‌నాథ్ శివలింగం



కొన్ని సంఘటనల్లో ఇలాంటి మార్పులకు మనిషి ప్రమేయం కూడా ఉంటుందని చెపుతూ కార్ల్ సేగన్ మరొక విషయం ప్రస్తావించాడు. జపాన్ దీవుల్లో ఒక చోట వీపు మీద సామురాయ్ యోధుల మొహాల డిజైన్ కలిగిన ఎండ్రకాయలు విరివిగా దొరుకుతాయట.

సామురాయ్ పీత, సామురాయ్ సంప్రదాయక చిత్రం





సాముురాయ్ యోధులంటే అక్కడివారికి ఎంతో గౌరవం కనక అలాంటివి దొరికినప్పుడు జాలర్లు వాటిని చంపకుండా మళ్ళీ సముద్రంలో వదులుతారట. ఎండ్రకాయల వీపు మీద ఉండే మచ్చలు జన్యువుల నిర్మాణాన్ని బట్టి రకరకాలుగా రూపుదిద్దుకుంటాయి. వాటిలో కొన్నిటికి యాదృచ్ఛికంగా సాముురాయ్ యోధుల మొహాల డిజైన్ ఏర్పడడంతో వాటి ప్రాణాలు దక్కాయి. ఇతర డిజైన్లున్న పీతలన్నీ ఆహారం అయిపోయాయి. ఆ విధంగా శతాబ్దాలుగా ఈ మార్కు పీతల జనాభా ఎక్కువగా పెరిగి ఆ లక్షణాలు బలపడే అవకాశం కలిగింది. ప్రకృతిలో ఈ మచ్చల రూపం అనేక రకాలుగా మారుతూ ఉంటుంది. మనిషి తన స్థానిక సంస్కృతిని బట్టి మంచీ, చెడూ అనుకుంటూ ఆ మార్పుల్లో జోక్యం కలిగించుకున్నాడన్నమాట. అయితే ప్రస్తుత పరిస్థితిని బట్టి అదేదో పవిత్రస్థలం, అవన్నీ పవిత్రమైన పీతలు అనే అపోహ మాత్రం తప్పక కలుగుతుంది.

ఇంగ్లండ్‌లో పారిశ్రామిక యుగం మొదలు కానప్పుడు తెల్లని బెరడున్న చెట్లమీద తెల్లని సీతాకోకచిలకలు వాలుతూ ఉండేవట. వాటిని తినే పక్షులకు వాటిని గుర్తించడం కష్టం అయేది. బొగ్గు, ఆవిరియంత్రాలు రావడంతో త్వరలోనే ఇంగ్లండ్ పరిసరాలన్నీ మసిబారడం, చెట్లన్నీ నల్లబడడం జరిగిందట. ఈ విప్లవంవల్ల ఎవరికి మేలు జరిగినా తెల్లని సీతాకోకచిలకలన్నీ పక్షులకు బలైపోయాయి. ఇక మిగిలినవి నల్లనివి మాత్రమే. తెల్లనివాటి స్థానంలో నల్లనివి ప్రత్యక్షం కావడం ఆనాటి శాస్త్రవేత్తలు కళ్ళారా చూసి పరిణామవాదాన్ని అర్థం చేసుకోగలిగారు. ఎటొచ్చీ ఇందులో మరికొన్ని అంశాలు కూడా ఉండవచ్చని ఆధునిక పరిశీలకులంటున్నారుగాని డార్విన్ ప్రతిపాదనకు ఢోకా లేదు.

చెట్లమీద సీతాకోకచిలకలు

 

ఈనాటి అపోహలకు ఎన్నో రూపాలున్నాయి; వీటిలో కొన్ని జెనెటిక్ పరిశోధనలకు సంబంధించినవి. ఇందులో వ్యాపారదృష్టి లేకపోలేదుగాని సైన్సు విషయాలను కూడా గుర్తించాలి. మనిషి జంతువులని మచ్చిక చేసుకోవడమూ, వ్యవసాయమూ మొదలుపెట్టాక ప్రకృతిలో జోక్యం చేసుకోవడం మొదలయింది. ప్రకృతిలో పెరిగే ధాన్యాలూ, కాయగూరల్లో యాదృచ్ఛికంగా జన్యువుల్లో తలెత్తే మ్యుటేషన్లవల్ల చేదువీ, పనికిరానివీ, గిడసబారినవీ కూడా ఉంటాయి. అలా కాకుండా మనుషులు ప్రకృతికి విరుద్ధమైన పనులు ఏనాడో మొదలుపెట్టారు. ఈనాడు క్లోనింగ్, జన్యుపరంగా ఆహార పదార్థాల్లో మార్పులు వగైరాల గురించి ఆందోళన పడి హడావిడి చేస్తున్నవారు ఈ విషయాలు మరవరాదు. మొదట కుక్కలనూ, తరవాత మేకలూ, పశువులనూ మచ్చిక చేసుకున్న ఆది మానవులు వాటిలో మంచివీ, సౌమ్యంగా ఉండే జాతులను ఎంచుకున్నారు. పొగరుబోతులనూ, "తిరుగుబాటు" లక్షణాలనూ కలిగినవాటినీ చంపేస్తూ వచ్చారు. మిగిలినవాటి సంతతికి అవే లక్షణాలు వచ్చాయి. ఈ విధంగా మనుష్యులకు అనువైనవీ, పనికివచ్చేవీ మాత్రమే పెంపుడు జంతువు లయాయి. వ్యవసాయానికి ముందు ఏరుకుతినే దశలో మైదానాల్లో మొలిచే గింజలనే మనుష్యులు తిన్నారు. వ్యవసాయం మొదలయాక వాటిలో మంచివాటిని ఎంపికచేసి "నారు" పొయ్యడం ప్రారంభమైంది. ధాన్యాలేకాదు, కూరగాయలూ, తినడానికి పనికొచ్చే జంతువులూ అన్నీ ఎంపిక చెయ్యబడ్డాయి. దీనికీ, క్లోనింగ్‌కూ పెద్దగా తేడా లేదనుకోవాలి. ఈ ఉదాహరణలన్నీ ప్రకృతిలో జరిగే పోటీలకు మనుష్యులు అడ్డుపడిన సంఘటనలే.

ఎన్ని కోట్ల సంవత్సరాల క్రితమైనా ప్రాణుల శారీరక లక్షణాలు ఇటువంటి పోటీ తత్వం వల్లనే మార్పులు చెందుతూ వచ్చాయి. వీటికి మూలకారణాలు బాహ్యపరిస్థితులే. కొన్ని వేల సంవత్సరాల కొకసారి వచ్చే హిమయుగాలూ, అకస్మాత్తుగా ఎగిసిపడే అగ్నిపర్వతాలూ స్థానికంగా ఎంతో ఉత్పాతాన్ని కలిగించాయి. ఉష్ణోగ్రతలోనూ, తేమలోనూ కొద్దిపాటి మార్పులు జరిగినా తట్టుకోలేని చిన్న జీవాలూ, క్రిమికీటకాలూ

ఎన్నో. వాటిని తింటూనో, వాటిమీద ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అధారపడే పెద్ద జంతువులు అంతరించిపోయే ప్రమాదం ఎల్లప్పుడూ ఉండేది. ప్రకృతితోనూ, ఇతర ప్రాణులతోనూ ఎప్పటికప్పుడు పోటీ పడుతూ తట్టుకోవడానికి అనుగుణమైన లక్షణాలున్న జీవాలు బతికాయి. ఇది చెట్ల విషయంలోనూ కనబడుతుంది. పెద్ద చెట్టు ఏ తుఫానువల్లనో పడిపోయాక దాని నీడలో ఇంతకాలమూ ఎదగలేని గడ్డీ, పిచ్చి మొక్కలూ ఎండ తగిలి ఏపుగా పెరుగుతాయి. మొక్కలు మనిషితోనూ పోటీపడగలవు. వాడకుండా పాడుపెట్టేసిన ఇళ్ళలోకి మొక్కలూ, తీగలూ పెరిగి అల్లుకోవడం మనకు తెలిసినదే.

ప్రాచీనయుగంలో భూమిమీద ప్రాణులు ఎలాంటి పరిణామాలకు లోనయాయి? దీనికి స్పష్టమైన సమాధానం లేదు. ఉన్నదల్లా శిలాజాల సాక్ష్యమే. ఉదాహరణకు మొప్పలున్న చేపల గురించి బోలెడు సమాచారముంది. అలాగే కాళ్ళున్న తొండలవంటి ఉభయచరాల గురించీ తెలిసింది. మరి బురద నీరు ఎండిపోవడంతో తప్పనిసరి అయి నేలమీద అడుగు పెట్టిన మొదటి కాళ్ళున్న చేప మాట ఏమిటి? అరుదైన దాని శిలాజం ఈ మధ్యనే దొరికిందట. ఈ దశ త్వరలోనే పూర్తయి ఉండాలి. అందుకనే అలాంటి జీవాల సాక్ష్యాలు దొరకటంలేదు. జలప్రపంచంలో చాలా కాలం ''రాజ్యం'' చేసిన జీవరాశి ఒకసారి నేల మీద కాలు మోపగానే మొప్పల స్థానంలో గాలిని పీల్చగలిగిన ఊపిరితిత్తులు సంపాదించుకుని వృద్ధి చెంది ఉంటుంది. ఆ ప్రస్థానానికి ఇక తిరుగులేదు. నీటి ఎద్దడి లేని ప్రాంతాల్లో జలచరాలు కొనసాగాయి, అభివృద్ధి కూడా చెందాయి.

రకరకాల ప్రాంతాల్లో జరిగిన మార్పుల కారణంగా జంతుప్రపంచంలో వైవిధ్యం పెరిగింది; అంతే. ఎప్పుడైనా, ఎక్కడైనా ఎన్ని వింత ఆకారాలతో, ఎన్ని రంగులతో ఎటువంటి ప్రాణి (లేదా దాని అవశేషాలు) కనిపించినా శాస్త్రవేత్తలు దాని పుట్టు పూర్వోత్తరాలనూ, జన్యుస్థాయి దగ్గర్నుంచీ దాని శరీరనిర్మాణాన్నీ వివరించగలిగిన పరిస్థితిలో ఉన్నారు. అయినప్పటికీ ఎక్కువమంది 'ఏ పుట్టలో ఏ పాముందో' అనే పద్ధతిలో అలోచిస్తూ, మహిమల కోసం వెతుకుతూ ఉంటారు. వింత ప్రాణులనో, తలవని తలంపుగా ప్రకృతిలో తలెత్తి, మనకు పరిచితమైన సంకేతాలుగా అనిపించే విశేషాలనో చూసి ఉలిక్కిపడడం, నోరు వెళ్ళబెట్టి భగవంతుడి లీలలను గురించి అలోచించడం ఆధునికులు చెయ్యదగిన పనులు కావు.

## ఇబ్సెన్ తిరుగుబాటు ధోరణి - రాజమన్నారు నాటికలు - దామరాజు లక్ష్మి

సంప్రదాయసిద్ధంగా వస్తున్న నాటకరంగ సూత్రాలకు విరుద్ధంగా తెలుగు నాటికలలో తిరుగుబాటు ధోరణులను ప్రవేశపెట్టిన తొలి తెలుగు రచయితలపై నార్వే దేశీయుడైన హెన్రిక్ ఇబ్సెన్ (1828-1906) ప్రభావం చాలా ఉంది. నాటక సూత్రాలను ఎదిరించిన ప్రథముడుగా స్థానం సంపాదించుకొన్నాడు ఇబ్సెన్. అతడు సృష్టించిన నాటకరంగాన్ని 'థియేటర్ ఆఫ్ రివోల్ట్,' అన్నారు విమర్శకులు.

రివోల్టు మూడు రకాలు అన్నాడు రాబర్ట్ బ్రాస్టన్- 1) మెస్సియానిక్, 2) సోషల్, 3) ఎగ్జిస్టెన్షియల్.
మెస్సియానిక్ రివోల్ట్: దేవుని మీద, మతం మీద తిరుగుబాటు. ఆధునిక రూపకాల ప్రారంభదశ ఇది.
సోషల్ రివోల్ట్: సంఘం మీద తిరుగుబాటుకు చెందిన రూపకాలు. ముఖ్యంగా సాంఘిక రూపకాలన్నమాట. ఎక్కువ ప్రసిద్ధి కెక్కినవి. సమకాలీన సంఘాన్ని చిత్రించటం, మధ్యతరగతికి చెందిన ప్రజలను పాత్రలుగా చేయటం వీటిలోని ప్రత్యేకత.

ఎగ్జిస్టెన్షియల్ రివోల్ట్: మొత్తం జీవితం మీదనే తిరుగుబాటు ఇది. మానవుని దర్భర జీవితాన్ని గురించిన ఆవేదన ఇందులో వ్యక్తమవుతుంది.
మొత్తం మీద మెస్సియానిక్ తిరుగుబాటు పాత్రలను మానవతీతులుగా చిత్రిస్తే, ఎగ్జిస్టెన్షియల్ తిరుగుబాటు పాత్రలను అధములుగా చిత్రిస్తుంది. అంటే మొదటిది మానవుని స్వేచ్ఛను అతిశయోక్తిగా చిత్రిస్తే, రెండవది మానవుని బానిస జీవితాన్ని స్పష్టం చేస్తుందని చెప్పవచ్చు. ఈ రెండింటి మధ్యేమార్గం సోషియల్ తిరుగుబాటు. ఇందులో పాత్రల స్వభావాదులను యథాతథంగా చిత్రించటానికి ప్రయత్నం జరుగుతుంది.

ఇబ్సెన్ ప్రసిద్ధికి రూపక నిర్మాణ శిల్పంలో అతడు సాధించిన విశిష్టత కంటే అతడు చేపట్టిన సాంఘిక సమస్యల విశిష్టత ప్రధాన హేతువు. అతనికి నీతి నియమాల మీద చాలా ఆసక్తి ఉంది. సమకాలీన సంఘాన్ని ప్రభావితం చేస్తున్న దుష్ట / శిష్ట సంప్రదాయాలను, ఆచారాలను నిశితంగా పరిశీలించాడు. వాటిని తన రూపకాలకు చైతన్యవంతమైన ఇతివృత్తాలుగా మలచుకొన్నాడు. ప్రేక్షకులలో మార్పు తీసుకొని రావాలన్న ప్రయత్నం కంటే, వారిలో ఆలోచనలను రేకెత్తించాలన్నదే అతని లక్ష్యంగా కనిపిస్తుంది. డాంబికత్వం మీది జుగుప్స, వీటన్నిటితోపాటు కవిత్వప్రాయమైన శైలి- ఇవి ఇబ్సెన్‌లోని విశిష్ట గుణాలు. దేశ బహిష్కరణ పొంది రోమ్‌లోను, జర్మనీలోను ప్రవాసం కూడా చేశాడు.

1850లో రచించిన తొలి రూపకం కాటలీనా నుంచి వరుసగా అనేక రూపకాలు రచించాడు. 1) లేడీ ఇంగెర్ ఆఫ్ ఆస్ట్రెట్, 2) ది ప్రిటెండర్స్, 3) లవ్స్ కామెడీ, 4) బ్రాండ్, 5) ది లీగ్ ఆఫ్ యూత్, 6) పిల్లర్స్ ఆఫ్ సొసైటీ, 7) ఎ డాల్స్ హౌస్, 8) ఘోస్ట్స్, 9) ది వైల్డ్ డక్, 10) హెడ్డాగేబ్లర్, 11) వెన్ వియ్ డెడ్ అవేకెన్.

వీటిలో- క్రమక్రమంగా రచనలో జిగి, విరుద్ధ స్వభావాలు గల పాత్రల శీలచిత్రణ, వ్యక్తికి సంఘ వ్యవస్థకు మధ్య పోరాటం, రాజకీయ విమర్శ, వ్యక్తుల సంక్లిష్ట స్వభావాలు- మనోవిశ్లేషణ, వాటి పర్యవసానాలు- నిశితంగా రూపొందాయి. (అయినప్పటికీ, ఇబ్సన్ తన చివరిదశలో జీవిత పరమావధి ఏమిటి అన్న మీమాంసలో పడినట్లు విమర్శకులు భావించారు.)

ప్రపంచ సాహిత్యాన్న పరిశీలించిన కొందరు తెలుగు యువ రచయితలపై ఇబ్సన్ ప్రభావం బాగా కనిపిస్తుంది. ఇబ్సన్,బ ఎర్నార్డ్ షా, ఆస్కార్‌వైల్డ్ మొదలైన నాటకకర్తల ప్రభావం గురించి చెబుతూ గోపీచంద్‌గారు, ''ఆ నాటకకర్తలతో ఏదో ఒక విధంగా సన్నిహితత్వం ప్రదర్శించుకోవటం ఆనాడు ఫ్యాషన్‌గా ఉండేది... ఆ రోజుల్లో మాకు వ్యాస వాల్మీకి, కాళిదాసాదుల వంటి సంస్కృత కవులుగానీ, రవీంద్రుని వంటి ఆధునికులుగానీ ఏమాత్రం నచ్చేవారుకాదు. ఎవ్వరైనా షేక్స్‌పియర్‌తోపాటు కాళిదాసుని చేర్చినా, బెర్నార్డ్‌షాతో పాటు రవీంద్రుని కలిపినా మాకు హాస్యాస్పదంగా ఉండేది... పాత సంప్రదాయాల మీద నమ్మకాలు చెడిన రోజులవి. అప్పుడు ఆ నమ్మకాలను అపహాస్యం చేసి, కవ్వించి నవ్వించే రచయితలు మనస్సులను వశం చేసుకోగలగటం సహజం. పైగా బొమ్మకు ఒకవైపే ఉంటుందనుకొనే రోజుల్లో, అకస్మాత్తుగా దాని రెండవవైపుని చూపినపుడు, ఆ చూపినవారి ప్రజ్ఞను కొనియాడబుద్ధి అవటం కూడా సహజమే. వారి ప్రతిభను చూచి ఆ విధంగానే చకితులం అయ్యాం, భ్రమించాం అని ఇటీవల అనిపిస్తూ ఉంది, '' అన్నారు, తత్త్వమసి నాటికల సంపుటి పరిచయంలో.

1927లో పొణకా పిచ్చిరెడ్డిగారు, ది బ్రాండ్ అనే ఇబ్సన్ రూపకాన్ని భీష్ముడు అను పేర ఇంచుమించుగా వచనంలోకి అనువదించి ప్రకటించారు. బహుశా ఇదే మొదటి ఇబ్సన్ రూపకానువాదం కావచ్చు.
1928లో ఇబ్సన్ శతసంవత్సర జన్మదినోత్సవం ప్రపంచమంతటా జరుగగా- మద్రాసులో కూడా ఇబ్సన్ సొసైటీ ఒకటి వెలిసింది. ఆరోజులలో ఇబ్సన్ ప్రభావానికి గురైన మిత్రబృందం కూర్మ వేణుగోపాలస్వామిగారు, పి.వి. రాజమన్నారుగారు, పి.వి.రంగారామ్‌గారు, బళ్ళారి రాఘవాచార్యులుగారు- నాటకరంగంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకొన్నారు.

1930లో వెలువడిన పి.వి. రాజమన్నారుగారి (1901) మూడంకెల సాంఘిక వచన రూపకం తప్పెవరిదితో తెలుగు నాటకరంగంలో ఒక కొత్త అధ్యాయం ప్రారంభమైంది. మొదటి భార్య చనిపోయిన ఒక వృద్ధుడు ఒక యువతిని వివాహం చేసుకొంటాడు. ఆమె అతని ప్రథమ భార్య కొడుకుని ప్రేమిస్తుంది. వృద్ధుడు పశ్చాత్తప్తుడై ఆత్మహత్య చేసుకొంటాడు. చిత్రాంగి సారంగధరుల కథతో దీనికి పోలిక ఉన్నప్పటికీ శిల్పంలోనూ, పర్యవసానంలోనూ ఇబ్సన్ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. బళ్ళారి రాఘవాచార్యులుగారు దీనిని విజయవంతంగా ప్రదర్శించారు. దీనితో వచన రూపక రచయితలకు, కొత్త పోకడల నటులకు కొత్త దారులు చూపించారు పాకాల వెంకట రాజమన్నారుగారు.

తరువాత రాజమన్నారుగారు అధికంగా ఏకాంకికలనే రచించారు. వీటిలో పదిహేను రచనలను రాజమన్నారు నాటికలు పేర 1958లో దేశి కవితామండలివారు ప్రచురించారు. మరో ఆరింటిని సర్దారు పాపడు అనే పేర ఎమ్. శేషాచలం కంపెనీవారు 1972లో ప్రచురించారు. రాజమన్నారు నాటికలు పదిహేనింటిలోనూ విముక్తి చాలా పెద్దది. ఐదు రంగాలున్నాయి. తరువాతిది దెయ్యాల లంక. రెండు రంగాలున్నాయి.

ఏదో ఒక సమస్యను గ్రహించి, ఆ సమస్యను ఒక సన్నివేశంగా ఊహించి, దానికి రూపకల్పన చేసి, సృష్టించిన పాత్రలను దాని చుట్టూ చిత్రించటం రాజమన్నారుగారి రచనా విధానమని చెప్పవచ్చు. కేవలం ఏదో ఒక సందేశం ఇవ్వటంలో కంటే, సమస్యను ప్రతిపాదించటంలో, రచనా వైశిష్ట్యం సాధించటంలో వారికి దృష్టి ఎక్కువ. పతితులను, ప్రేక్షకులను సన్మార్గవర్తులను చేయాలన్న ఆకాంక్ష కంటే సంఘంలోని సత్యాసత్యాలను, అందులోని సంప్రదాయాదుల వల్ల జీవన వికాసం సంకుచితమైపోతూ ఉండటాన్ని చిత్రించటమే వారి ధ్యేయం. ఎక్కడికక్కడ కొత్త మలుపులు తిప్పుతూ, చివరి వరకూ ప్రేక్షకులను ఆకట్టుకొనే శక్తి వారి కథా నిర్మాణానికి ఉంది. కొన్నింటిని చూద్దాం వివరంగా.

ఏమి మగవాళ్ళు

ఇది వీరి మొదటి రచన. సుందరం పంతులుగారికి 50 సంవత్సరాల వయస్సు. 25 ఏళ్ళున్న సుందరమ్మ వారి ద్వితీయ కళత్రం. కృష్ణమూర్తి పంతులుగారి తమ్ముడు- సుందరమ్మ సమవయస్కుడు, బ్రహ్మచారి. వేణుగోపాల్ పంతులుగారి అన్న కొడుకు- వయస్సు 30 సంవత్సరాలు. కనకాంగి వేశ్యకులంలో పుట్టి, ఆ వృత్తిలో కొంతకాలం ఉండి, నటి అయింది. వేణు ఆమెను పెళ్ళి చేసుకొన్నాడు. ఆమె వేణుకు సమవయస్కురాలు. పదేండ్ల నిర్మల పంతులుగారి మొదటి భార్య కూతురు. శంకరశాస్త్రి పంతులుగారి ఆప్తవర్గంలోని వాడు, రసికుడు. కనకాంగిని చిన్నప్పటి నుంచి ఎరిగినవాడు. వీరు ఈ ఏకాంకికలోని పాత్రలు. కనకాంగి మాటల్లో చెప్పాలంటే- ముసలివాణ్ణి కట్టుకొన్న సుందరమ్మకు మరిది కృష్ణమూర్తి మీద మరులు. ఆ పిచ్చి బ్రహ్మచారి అందమైన పిల్ల (కనకాంగి) కనబడగానే అవకతవకగా ప్రవర్తించాడు. అందుకు సుందరమ్మ కోపగించుకొంది. 50 ఏళ్ళ ముసలివాడు, ధర్మశాస్త్రాలు తలకిందులుగా చదవగలిగినవాడు సుందరం పంతులుగారు ఒంటరిగా ఉన్న కనకాంగిని చూసి, దగ్గర చేరి, వావీవరస లేకుండా ఆమె తొడ మీద చెయ్యి వేస్తాడు. ఎప్పుడో కాకినాడలో తమ ఇంటిపక్క ఉన్న శంకరశాస్త్రితో ఈ విషయాలన్నీ చెప్పి కనకాంగి నవ్వుతుంది. ఒక్కొక్క మెట్టుగా అనుమానం పెరుగుతూ వచ్చిన వేణు అసహనంతో, 'వెనుకటి బుద్ధి ఎక్కడికి పోతుంది...' అని కనకాంగిని నిందిస్తాడు. 'వెర్రికుక్కల్లాగ వాళ్ళు పైనబడినారు,' అని ఆమె మొత్తుకొంటే, 'ఛస్, నోరుముయ్యి,' అన్నాడు. కనకాంగి కళ్ళనీళ్ళు తుడుచుకొని, నిరసనభావంతో పెదవి విరచి, మంగళసూత్రం చేతితో తెంపి పారవేసి, 'ఛీ ఛీ! ఏమి మగవాళ్ళు,' అనుకొంటూ వీథిగుమ్మం వైపు వెడుతుంది.

ఇందులో సందేశం కంటే అందమైన ఆడది ఒంటరిగా తటస్థపడితే పైకి శ్రీరంగనీతులు చెప్పే మగవాళ్ళు వెర్రికుక్కల్లాగ అయిపోతారన్న చిత్రణయే ముఖ్యం. ఇబ్సన్ రచించిన డాల్స్‌హౌస్‌లోని నోరా వలె కనకాంగి కూడా భగ్నప్రణయిని. నోరా వలెనే అన్ని బంధాలు తెంచుకొని వెళ్ళిపోయింది. రెండింటిలోను భర్తల అనుమానమే విషాదానికి దారితీసింది. తెలుగు సాహిత్యంలో ఇదొక విషయం. అయితే నోరా సహజంగా కులస్త్రీ కాగా, కనకాంగి కులస్త్రీగా మారిన వేశ్య. కాగా, నోరా విషయంలో కంటే కనకాంగి విషయంలో అనుమానానికి కొంత అవకాశం ఉంది. సహజంగా కులస్త్రీ అయిన భార్య చేత మంగళసూత్రం తెంపి పార వేయించటానికి రాజమన్నారుగారు మరి సాహసించలేదేమో!

నిష్ఫలం

ఇందులో కూడా ప్రధాన పాత్ర అయిన చిత్రరేఖ వేశ్యయే- పెళ్ళి చేసుకొన్నది మాత్రం కాదు. అయితే తన సర్వస్వాన్ని- ధన, మన: ప్రాణాలను తాను నమ్మిన జమీందారురంగారావుకు అర్పించుకొన్న నిర్మలమూర్తి. తనను ఎప్పుడూ విడిచిపోడని ఆమె నమ్మకం. జమీందారు భార్య సీతయ్యమ్మ అభిజాత్యం కరుడుగట్టిన మూర్తి. రంగారావు మాటల్లో చెప్పాలంటే, దేవాలయానికి తప్ప ఇంకొకచోటికి వెళ్ళదు. అటువంటి సీతయ్యమ్మ చిత్రరేఖ ఇంటికి స్వయంగా వస్తున్నట్లు కబురంది, వచ్చింది. అప్పుడు చిత్రరేఖ వద్దనే ఉన్న రంగారావు పక్కగదిలో దాగుంటాడు. రంగారావు చేసిన అప్పులు తీర్చటానికి చిత్రరేఖ నగలు అడిగి తీసుకొని వెడదామని వచ్చింది సీతయ్యమ్మ. కాని చిత్రరేఖ నగలు అదివరకే రంగారావు అప్పులు తీర్చడానికి చెల్లుబడి అయిపోయాయనీ, ఆమె వంటి మీద ఉన్నవి నకిలీవనీ, సంవత్సరాలుగా రంగారావు ఆమెకు ఏమీ ఇవ్వలేదనీ తెలుసుకొన్న సీతయ్యమ్మ పరాభవం పొందింది. అయినా పై చెయ్యిగా, ‘మీ సౌందర్యానికి వెలలేదూ? అమ్మితే కొనుక్కోవడానికి సిద్ధంగా ఉన్నవారు లేరూ?’ అంటుంది. చిత్రరేఖ తోక తొక్కిన తాచు అయింది. రంగారావు చటుక్కున ముందుకు వచ్చి, ‘నేను ఈ ఊరికి మళ్ళీ రాను,’ అంటూ సీతయ్యమ్మతో నిష్క్రమిస్తాడు, తానే సర్వస్వంగా ప్రేమిస్తున్న చిత్రరేఖను వదిలి. జీవచ్ఛమే అయింది చిత్రరేఖ.

జమీందారుగారిని వదిలేయమని తన్ను అడగడానికి జమీందారిణి వస్తోందనుకొన్న చిత్రరేఖని జమీందారే విడిచి వెళ్ళిపోవడం- ముగింపు ఎంత చిత్రంగా మలిచారు రాజమన్నారుగారు! ఇందులోని ప్రతి వాక్యం కథ ముందుకు సాగటానికో, పాత్ర శీలం వ్యక్తం కావటానికో తోడ్పడిందనే చెప్పాలి. సంవాదం అంత శిల్ప సమ్మతంగా నిర్వహించారు. అందుచేతనే దీనిని ఉత్తమ రచనగా విమర్శకులు పేర్కొంటున్నారు. అత్యాధునికమైన ఈ రచన ప్రాచీన సంస్కృత నాటికా లక్షణాలకు కూడా బాగా సరిపోతున్నదని ఆచార్య సాళ్వ కృష్ణమూర్తిగారు చక్కగా నిరూపించారు.

వృథాయాసం

వీరభద్రరావు కళాశాలలో ఉపన్యాసకుడు. ఇందిర అనే విద్యార్థిని అతని ప్రియురాలు. విషయం తెలుసుకొన్న భార్య పార్వతి, భర్త నిద్ర నుంచి లేచిన తరువాత పీకి పాకం పట్టడానికి తయారు అవుతూ ఉంటే, భర్త ఈ లోకాన్ని విడిచిపెట్టి నిద్రపోయినట్లుగా సూచిస్తారు రాజమన్నారుగారు. ఆమె ప్రయత్నమంతా వృథాయాసమన్నది సూచన. అయితే ఇందిర ఉత్తరం ఆమెకు తిరిగి ఇచ్చివేయటంలో పార్వతిలో కొంత ఔన్నత్యం కనబడుతుంది.

సంకల్పం - పర్యవసానం

43, 44 సంవత్సరాలున్న సోమసుందరంగారు విధురుడు. 23 ఏళ్ళున్న ధనవంతురాలు, అందగత్తె అయిన గిరిజను పెళ్ళి చేసుకోవాలనుకొంటాడు. సాహసించి, ఆమెతో మాట్లాడాలనుకొని, తన ఇంటికి ఆమెను ఆహ్వానించిన రోజు ఆ ఇంట్లోనే ఆయన తమ్ముడు విశ్వనాథం, గిరిజను అంతకుముందే ప్రేమించిన వాడు, సోమసుందరంగారి ఆశీస్సులతో ఆమె ప్రాణిగ్రహణం చేస్తాడు. సంకల్పం ఒకటీ, పర్యవసానం ఇంకోటీ అయిన సోమసుందరంగారు తొట్రుపడలేదు. '... ఎంత పొరబాటు చేయబోయాను... జరిగిందేయుక్తం,' అంటూ లోపల జేబులోంచి గిరిజ బొమ్మ తీసి చూసి, నిట్టూర్చి ముక్కలు ముక్కలుగా చింపివేస్తారు సోమసుందరంగారు. ఆదిలో సోమసుందరంగారు మానవ సహజమైన దౌర్బల్యానికి లోనైనా నిగ్రహించుకోవటంతో వారి పాత్రకు ఉదాత్తత చేకూరింది.

మాతృప్రేమ

వేణుగోపాలరావు, సత్యనారాయణ రామలక్ష్మమ్మ కొడుకులు. శారద వేణు భార్య. వేణు దీర్ఘరోగ పీడితుడైనాడు. అహర్నిశలు తనకు సేవచేసి కృశిస్తున్న శారదకు కొంత ఆనందాన్ని చూర్చాలన్న దృష్టితో సెలవులకు ఇంటికి వచ్చిన తమ్ముడితో సినిమాలు వగైరాలకు బలవంతపెట్టి పంపిస్తాడు. కాని చివరికి వారి పరిచయం ముదిరి, శారద గర్భవతి కావటం, ఆమె వేణుగోపాల్‌ను పట్టించుకోకపోవటం వరకు వచ్చింది. దుఃఖిస్తున్న వేణుగోపాల్‌కు నిద్రమందు పొరపాటున ఎక్కువగా ఇచ్చి తల్లి వాని బాధను మాన్పుతుంది. ఏది ఏమైనా తల్లి ఇట్లా చేయటం భారతీయ సంస్కృతికి విరుద్ధం. కాని ఘోస్ట్స్ అన్న రూపకంలో ఇబ్సన్ ఇటువంటి సన్నివేశాన్నే కల్పించాడు. కొడుకుకు తల్లి విషమిచ్చినట్లుగా అందులో సూచన ఉంది. రాజమన్నారుగారు ఆ విషయాన్ని స్పష్టం చేశారు. ఇద్దరు కొడుకులు విధవరాలైన ఆ తల్లికి రెండు కళ్ళు. మాతృప్రేమ మూర్తీభవించిన తల్లి ఆ విషమ పరిస్థితులలో ఇంకేం చేస్తుంది?

విముక్తి

దీనిలో రెండు మలుపులున్నాయి. చిన్నతనంలోనే భర్తృహీనయై, కాలుజారి గర్భవతి అయిన రాధను రక్షించడానికి మనసారా ముందుకువచ్చాడు సత్యనారాయణ. అతని తల్లి కనికరం కలదే, కాని ఆ ఇంటి వాతావరణంలో ఆమె ఏమీ చెయ్యలేకపోయింది. అందుచేత గర్భవతి అయిన రాధను తీసుకొని వేరే వెళ్ళిపోతాడు సత్యనారాయణ. ఇది మొదటి మలుపు- అయ్యో అనుకొటాము. తిండికి గడవక చాలా

అవస్థ పడుతుంటారు వాళ్ళు. తన వల్ల సత్యనారాయణకు ఇంత అవస్థ వచ్చిందని రాధ కుమిలిపోతూ ఉంటుంది. ఇంతలో తండ్రికి సుస్తీగా ఉన్నదనీ, తన్ను చూడగోరుతున్నాడని తెలిసి సత్యనారాయణ ఇంటికి వస్తాడు. పశ్చాత్తప్తుడైన తండ్రి రాధను కోడలుగా స్వీకరించటానికి అంగీకరించాడు. సత్యనారాయణతో పాటు మనం కూడా సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అవుతాం. ఇది రెండో మలుపు. అయితే సత్యనారాయణ పడుతున్న కష్టాలు చూడలేని, ఈ కొత్త మార్పు తెలియని రాధ సత్యనారాయణ తిరిగి వచ్చేటప్పటికి నూతిలో పడి ప్రాణం తీసుకొంటుంది. ఇది సత్యనారాయణకే కాక మనకు కూడా అనుకోని విషాద పరిణామం. 'అమ్మా! కోడల్ని తీసుకొని వచ్చానమ్మా. అయితే తానే స్వయంగా వచ్చి నీకు నమస్కారం చేయగల స్థితిలో లేదమ్మా!' అంటూ సత్యనారాయణ తల్లి ఒడిలో తల దాచుకొని ఏడుస్తాడు. 'ఈ లోకం ఒక బోను వంటిది. మనకు మిగిలేది బాధే...' అంటూ కొడుకు తల నిమురుతూ ఉన్న తల్లి కన్నీళ్ళు ధారలుగా కారిపోతూ ఉంటాయి. భర్తృహీన అయి, కాలుజారి గర్భవతిగా ఉన్న స్త్రీని భార్యగా సత్యనారాయణ గ్రహించటమే గొప్ప విషయం. ఆ బాంధవ్యాన్ని ఆలస్యంగా అయినా తండ్రి హర్షించటం ఇంకా గొప్ప విషయం. అయినా పర్యవసానం విషాదమే. మరి మానవజాతి ఇంకా అజ్ఞానదశలోనే ఉంది!

దెయ్యాల లంక

ఇది తనకు బాగా నచ్చిన నాటిక అని రాజమన్నారుగారన్నారు. ఇందులోని రెండు రంగాలలోనూ ఒక రంగం ఊరిలోని ఇంటిగదిలో, రెండవది దెయ్యాల లంకలోని ఇసకతిప్ప మీద జరిగాయి. నిష్ఫలంలోలానే ఇందులో కూడా సంవాదం చాలా జిగిగా సాగింది. 'కావ్యత్వం బాగా పొదువుకొన్న కళాఖండమే నాటిక,' అని ఆచార్య యస్వీ జోగారావుగారు దీనిని పొగిడారు. రాధ వలెనే ఇందులోని సుధ కూడా బాల వితంతువు. సంస్కృతం కూడా చదువుకొంది. ఛలోక్తులు విసరటంలో జాణ. పెదతండ్రి ఇంట్లో ఉంటున్నది. పెదతండ్రి కూతురు లక్ష్మీకాంతమ్మ, ఆమె భర్త చలపతిరావు. లక్ష్మీకాంతమ్మకు ఉడుకుబోతుతనం ఎక్కువ. సుధ పువ్వులు పెట్టుకొన్నా భరించలేదు. చలపతికి సుధ అంటే సరదా. కాని సుధకు చలపతి అంటే ప్రేమ. వీళ్లు ముగ్గురూ, లక్ష్మీకాంతమ్మ తండ్రి అచ్యుతరామయ్య, మేనమామ రంగయ్యమామ గోదారిలో బోటు షికారుకు వెళతారు. అది తలకిందులు కాగా అంతా దెయ్యాలలంక చేరతారు. 'ఊరులో అందరూ దెయ్యాలు... ఈ దెయ్యాల్లంకే నాకు ఆనందంగా ఉంది,' అన్న సుధ, ఆ వెన్నెల రాత్రి చలపతితో ఆడుతూ, పాడుతూ తిరిగి చివరికి గోదావరిలో కలిసిపోతుంది. లక్ష్మీకాంతమ్మ, '... ఈ పాడులంక బలి తీసుకొంది. దెయ్యాలు హతం చేసేశాయి,' అని గుండెలు బాదుకొంటూ ఉంటే చలపతి కఠినంగా, 'ఛీ, నోరుముయ్యి! దెయ్యాలా? ఎవరు దెయ్యాలు?' అంటాడు. తెలివైన బాల వితంతువుకు తోటి స్త్రీయే దెయ్యమన్నమాట.

వైకుంఠాచార్యులు

విముక్తిలో వలెనే కొత్త మలుపులు గలది ఇది. వైకుంఠం నుంచి తాళపత్ర లేఖలు తెప్పిస్తున్నానని చెప్పి అమాయక ప్రజలను దోచుకొంటున్న వైకుంఠాచార్యుల్ని, అదే ఉపాయంతో ఇరుకున పెట్టారు పట్టణం నుంచి వచ్చిన ఇద్దరు యువకులు. వైకుంఠాచార్యులు ఆట కట్టిందని మనం సంతోషించే సమయంలో వైకుంఠాచార్యుల శిష్యుడు మళ్ళీ అదే పన్నుగడ పన్ని, అమాయకులైన ఆ ఊరి ప్రజల చేత ఆ ఇద్దరిని తరిమి వేయిస్తాడు. ఇది అనుకోని ముగింపు. వీటినే పతాక, ప్రతి పతాక దశలు అన్నారు డాక్టర్ శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు.

పరకీయలో ప్రేమ, కామం మధ్యగల భేదాన్ని గూర్చిన చర్చ, విచిత్రమైన కల్పన, మనోవిశ్లేషణ ఉన్నాయి. నందినిలో మతోన్మాదులైన సోదరులు చెల్లెలి భర్తను హత్యచేసి, ఆమె ఆత్మహత్యకు కారకులౌతారు. చారిత్రక వాతావరణంలో చిత్రితమైన ఈ రచనలో, 'ప్రేమరాజ్య స్థాపనకు ఈ మానవ ప్రపంచం ఇంకా సిద్ధం కాలేదు, అన్న నందిని ఆర్తనాదం ఎన్ని శతాబ్దాలు గడిచినా ఇంకా వినిపిస్తూనే ఉంది లోకంలో,' అంటూ వ్యాఖ్యానించారు రాజమన్నారుగారు.

బంధాలులో వరుసకు అన్నాచెల్లెళ్ళయినా, నిజం తెలియక ప్రేమకు, పెళ్ళికి సిద్ధపడి, చివరికి తల్లి మాటకు కట్టుబడటం చిత్రితమైంది. భార్యభర్తలు అన్న రచనలో చంచల మనస్కులైన ఇద్దరు పురుషులకు వారి భార్యలు మెత్తగా బుద్ధి చెప్పటం చిత్రితమైంది.
నాగుబాము బౌద్ధమత వాతావరణంలో చిత్రితమైంది. నాగసుందరుడనే బౌద్ధ శిల్పిని ప్రేమించిన ఆంధ్ర రాజకుమారి జయశ్రీ భగ్నప్రేమిక అయినప్పటికీ, తెల్ల నాగుబాము కాటుకు గురి అయిన నాగసుందరుని ప్రాణం రక్షించి, తన ప్రాణం కోల్పోయి, నిజమైన ప్రేమకు ఆత్మత్యాగమే ఫలమని చాటి చెప్పింది.
కఠినమార్గంలో భగవంతుని దయకు పాత్రం కావాలంటే స్వార్థం ఏమీ పనికిరాదన్న విషయం స్పష్టం చేయబడింది. బైబిల్ కథ ఆధారమైనదిది.
శ్రీరామనవమి ఒక విచిత్రమైన కల్పన. ప్రత్యక్షం కాని భగవంతుని కోసం అర్రులు చాచటం, నిజంగా ప్రత్యక్షమైతే గుర్తించలేకపోవటం, భగవద్దర్శనం పొందటానికి నిర్మలమైన మనస్సు కావాలన్న సత్యం నిశితంగా నిర్వచించారు.

మీనాక్షి సుందరంలో ఇద్దరు అక్కాచెల్లెళ్ళ దాంపత్య జీవితాలు, అక్క చనిపోవటం, మరదలు బావ సాన్నిహిత్యం కోరటం, బావ మృదువుగా బుద్ధి చెప్పటం- చిత్రమైన ముగింపు దీనిలో ఓ ప్రత్యేకత.
లవంగి చారిత్రాత్మక రచన. మనసారా ప్రేమించుకొన్న జంట క్రూరమైన మరణానికి గురయ్యారు. ఇందులోని నాయకుడికి ఆవేశమే కాని ఆలోచన తక్కువ.
వంకాయకూరలో ఎప్పుడో చిన్నప్పుడు పారిపోయి ఇప్పుడు పెద్ద అంతస్తులో ఉన్న జి. పాల్ (గోపాల్) తన కింది ఉద్యోగస్తుని ఇంటిలో అవస్థలు పడుతున్న తల్లిని గుర్తించి తన వెంట తీసుకొనిపోతాడు. మాతృదేవోభవ సందేశం ఇది.

పడుపువృత్తిలో నిరుపమను ఉద్ధరించి ఆదర్శకార్యం చేసిన తృప్తి పొందాడు శ్రీపతి. కానీ ఆమెను భార్యగా చూడలేకపోయాడు. విసిగిపోయిన ఆమె మంగళసూత్రం తీసేసి మళ్ళీ పడుపువృత్తిలోకి వెళ్ళిపోతుంది.

సింహగిరి చారిత్రాత్మకమైన రచన. తానే వైశ్వానరావతారమని విర్రవీగిన కాశ్యపుని పతనం నిరూపిస్తుంది. మొత్తం మీద స్త్రీ పాత్రచిత్రణలో, మానవ మనోవిశ్లేషణలో, సన్నివేశ ప్రకల్పనంలో, లైంగిక సంబంధ స్ఫోరకములైన ఇతివృత్తాలలో సంప్రదాయ ధోరణులకు ప్రతితీర్పులనిస్తూ రసవత్తరమైన నాటికలను సృష్టించి ఆంధ్ర నాటకరంగంలో ప్రత్యేక స్థానానిన సంపాదించుకొన్నారు రాజమన్నారుగారు. వృత్తిపరంగా న్యాయశాస్త్ర ప్రవీణులు (మద్రాసు హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా రిటైరైనారు), ప్రవృత్తి పరంగా నాటక కళాపోషకులు.

సౌజన్యం: తెలుగు పలుకు

## నిర్దేశాత్మక వ్యాకరణం, ప్రాదేశిక భాషలు - జిలుకర శ్రీనివాస్, పసునూరి రవీందర్

'వ్యాకరణం' మానవీయ శాస్త్రాలకు అత్యంత ప్రాధమిక అంశమూ కీలక అంశమూ అని విశ్వసించిన కాలం నుంచి వ్యాకరణశాస్త్ర అభ్యాసం, బోధన రెండూ అవసరమా అన్న విచికిత్స కొనసాగుతున్న సందర్భంలో తెలుగు వ్యాకరణాలను పునస్సమీక్షించుకొంటున్నాం.

వ్యాకరణం ప్రాభవం క్షీణించి భాషాశాస్త్రం వెలుగులో విశ్వవిద్యాలయాల్లోని తెలుగు శాఖలు నూత్న మార్గాలు అన్వేషిస్తున్న వర్తమానం యిది. తెలుగు భాషా సాహిత్యాలను పునరు మూల్యాంకనం చేస్తూ వున్న సమకాలీన సాహిత్య సందర్భంలోనూ మనం వ్యాకరణం గురించి సంభాషించుకొంటున్నాం. భాషా రాజకీయాలు నిర్దిష్టతను సంతరించుకున్న అనుభవం మనకుంది. తత్వశాస్త్రమైనా వ్యాకరణమైనా సాహిత్యమైనా స్థలకాలాలకు అతీతమైన అమూర్త విషయాలు కావు. సమాజం, సంస్కృతి, భాష ఇత్యాది విషయాలను వివేచించే క్రమంలో ప్రాదేశికత (స్థలం), కాలిక స్పృహ అన్న ద్విధాకృత సంబంధాలను విస్మరించలేం. తెలుగు భాషాజాతీయోద్యమం విజయం సాధించి తెలంగాణ జాతీయోద్యమం కొనసాగుతున్న కాలంలో భాషాసాహిత్యాల పునర్ మూల్యాంకనం తప్పకుండా ఒక రాజకీయ పఠనానికి దారితీస్తుంది.
ఈ పత్రంలో మాండలికాలు అన్న పదబంధం బదులు ప్రాదేశిక భాషలు అన్న పారిభాషిక పదబంధం ఎదురవుతూ వుంటుంది. మాండలికం అన్న భావనలో ఒక విధమైన హైన్యత వ్యక్తం అవుతుంది. ఆధునిక విలువల కారణంగా భాష ఆత్మగౌరవ విషయమని గుర్తిస్తున్నాం. మాండలికాలను భాషలు అనడం పట్ల భాషావేత్తలకు భిన్న అభ్యంతరాలున్నాయి. సాంప్రదాయిక నిర్వచనాల పరిధిలో ప్రాదేశిక వ్యవహారాలు భాషలు కాకపోవచ్చు. భాష పునర్ నిర్వచించబడడమే దానికి మార్గం. నిర్మాణవాద భాషాశాస్త్రవేత్త ఫెర్డినాండ్ డి. ససూర్ ప్రకారం సంజ్ఞల వ్యవస్థ భాష. సంజ్ఞలు నిర్దిష్ట సమాజంలోని సంస్కృతి ఉత్పత్తులు. అందువల్ల వాటి విభిన్నత ఆయా సంస్కృతుల మీద ప్రాదేశికతల మీద ఆధారపడి వుంటుంది. భిన్న ప్రాదేశిక సంస్కృతులున్న చోట ప్రామాణిక భాష ఒక సౌకర్యమే తప్ప పరిష్కారం కాదు. మాండలికాలు ఒక భాష యొక్క ఉపాంగమని భావిస్తే మాండలికాలు అర్థం కావాలి. తెలంగాణ, రాయలసీమ భాషల్లో వున్న రచనలు అర్థం కాకపోవడం వల్ల వాటికి అనువాదాలు అవసరం అవుతున్న దృష్ట్యా అవి 'భాషలు' అవుతున్నాయి. ఆకారణంగా మేము ప్రాదేశిక భాషలని వ్యవహరిస్తున్నాం.

రచయిత కేంద్రంగా కావ్య పఠనం తెలుగు పాఠక ప్రపంచానికి నవీనమైనది కాదు. రచన, పాఠకుడు యిద్దరే పఠనక్రియలో మిగలాలని నవ్యసంప్రదాయవాదులు, ఆధునికానంతర వాదులు చేసిన సూచన కన్న ముందే చిన్నయసూరి బాలవ్యాకరణం అధ్యయనంలో సూత్రకేంద్ర వివేచన ఆది నుంచీ ప్రవర్ధితమైంది. వ్యాకరణ గ్రంథాలు అన్నీ కొన్ని మినహాయింపులతో సూత్ర ప్రధాన చర్చ, పఠనం జరిగింది. యిది ఎంతో

నవీనమైన అంశం. బాల ప్రౌఢవ్యాకరణాల గురించి సుదీర్ఘ వివేచన జరగడం వ్యాకరణ విశిష్టతను వ్యక్తం చేయడమే కాదు అవి బహుళ పఠన సంభావ్యతకు ఆకరాలు అన్న సారాన్ని ప్రకటిస్తున్నాయి. అందువల్ల, వ్యాకరణాలను పునఃసమీక్షించడమంటే వాటిని నిర్దిష్ట సందర్భంలో కొత్త దృక్పథాల నుంచి పరిశీలించడమని అర్థం. భాష, వ్యాకరణం అన్న రెండు ముఖ్యమైన విషయాలు అమూర్త విషయాలు కావన్న ఎరుక అందరికీ వుంది. తెలంగాణ ప్రాదేశిక దృష్టి నుంచి వ్యాకరణశాస్త్రాన్ని అవగాహన చేసుకోవడానికి చేసిన ప్రయత్నమే ఈ పత్రం.

వ్యాకరణాలు సాధారణంగా నిర్దేశాత్మక వ్యాకరణాలు. అంటే ఉచ్చారణ, పదసంయోజనం, వాక్యవిన్యాసం వంటివాటిని నిర్దేసిస్తాయి. అందుకు భిన్నమైన వ్యవహారాన్ని వ్యాకరణ దోషాలుగా పరిగణిస్తాయి. ఒక విధమైన భాషానియతివాదమే నిర్దేశాత్మక వ్యాకరణం.

వ్యాకరణానికి వస్తువు కావ్య భాష. భాషాశాస్త్రానికి వస్తువు ప్రామాణిక భాష. ప్రాదేశిక భాషలైన తెలంగాణ, రాయలసీమ, కోస్తాంధ్రలను 'మాండలికాలు' కేటగిరిలో చేర్చి అనుషంగిక విషయాలుగానే పరిగణించారు. మాండలికాల పరిశీలనలోనూ వృత్తిపదాలదే సింహభాగం. వ్యాకరణం వ్యాకరించిన కావ్య భాషలో కూడా కవిత్రయం వాడిన భాష తప్ప ఆధునిక వ్యవహారం కాదు. ఆధునిక కాలంలో రచించిన బాలవ్యాకరణంలో పరిశీలనాంశం వేయేండ్ల కాలం నాటి భాష కావడం దాని ప్రాసంగికత రాహిత్యానికి హేతువు. కావ్య భాష పఠనానికి వ్యాకరణం ఉపయుక్తం అవుతుందని విశ్వసించినా అనేక కావ్యాలలోని మాండలికాల ప్రయోగాలు యిప్పటికీ పరిశీలనకు నోచుకోకపోవడం వల్ల ప్రాదేశికవాదం వ్యాకరణాలను అనుమాన దృష్టితో పరిశీలించే పరిస్థితి ఏర్పడింది.

వ్యాకరణశాస్త్రం ఆవిర్భావం ఎలా జరిగిందో పరిశీలించడం వల్ల ఎంతో ఉపయోగం వుంది. వేద పఠనం, మంత్రపఠనం పవిత్రమైనవీ, దివ్యమైనవీ అన్న అధిభౌతిక భావన వుంది. వాటి ఉచ్చారణలోనూ, యజ్ఞాల నిర్వహణలోనూ తప్పు జరిగితే ప్రమాదం. అది ఉచ్చరించిన వారి మీదే ప్రతికూలంగా పని చేసే అవకాశం ఉందని భయం వుండేది. ఆ అవసరం నుంచి ఆరు వేదాంగాలు రూపొందాయి. అవి: శిక్ష, జ్యోతిషము, కల్పము, నిరుక్తము, ఛందస్సు, వ్యాకరణము. ''వ్యాక్రియతే అనేనేతి వ్యాకరణమ్ -దీనిచే శబ్దములు వ్యాకరింపబడును. ప్రకృతి, ధాతు, ప్రత్యయ విభాగము నిరూపింపబడును. శబ్ద స్వరూపము స్పష్టపరుచబడును'' (రామచంద్రుడు 1974ః ృ) అని ఆచార్య పుల్లెల రామచంద్రుడు వివరించారు. వేదాలు, మంత్రాలు ఉచ్చరించే సమయంలో తప్పు దొర్లకుండా సంస్కృత శబ్ద స్వరూపం, ధాతు, ప్రత్యయం, విభక్తి వంటివి తెలుసుకోవడం అవసరం. అంటే ఒక నిర్దేశిత ఉచ్చారణ లేదా ప్రామాణిక ఉచ్చారణ అన్నది ఏర్పడడానికి వ్యాకరణం ఉద్భవించింది. అదే శిష్ట వ్యవహారంగా ఆ తరువాత పరిణామం చెందింది. సంస్కృత వ్యాకరణకర్తలు భాషకు పరిణామ స్వభావం వుంటుందని అంగీకరించారు. పాణిని నుంచి వరరుచి వరకు జరిగిన భాషా పరిణామాన్ని పతంజలి పరిగణించాడు. ఆ తరువాత వచ్చిన చాలా మంది

వైయ్యాకరణులు భాషలో నిరంతరం సంభవించే మార్పుల్ని పరిశీలనకు స్వీకరించారు. బాలవ్యాకరణ కర్త దృష్టిలో మాత్రం భాష స్థిరమైంది. కవిత్రయం వారి భాషాయనకు ప్రమాణం. అందుకు భిన్నమైన ప్రయోగాలు ఆయన దృష్టిలో దోషాలు. ప్రామాణిక భాషపట్ల కూడా ఆయనకు ఆదరణ వుండేది కాదు. అది కేవలం గ్రామ్యము. అంటే గ్రామీణ వ్యవహారమని అర్థం.

వ్యాకరణం శ్రీశ్రీ మాటల్లో చెప్పాలంటే ట్రాఫిక్ పోలీస్ వంటిది. ట్రాఫిక్ పోలిసింగ్ లాంటిదే భాషాపోలీసింగ్. ఒక సారి పోలీసింగ్ ఆరంభమైనదీ అంటే అది అన్నింటిని నియంత్రించడమే కాదు సెన్సార్ కూడా చేస్తుంది. అందుకే వ్యాకరణ సూత్రాల రచనకు ప్రాదేశిక భాషలు అనర్హం అన్న నిషేధాన్ని భాషా పర్యవేక్షణ (లింగ్విస్టిక్ పోలీసింగ్) చేస్తూ వచ్చింది. అది ఉచ్చారణ సరిదిద్దడమన్న సదాశయంతో మొదలై ప్రాదేశిక యాసల్ని రద్దు చేసే దిశగా పయనించింది. యాస కూడా భాషే అన్న కాళోజి నిర్వచనం వ్యాకరణశాస్త్రం యొక్క ఎజెండాకు వ్యతిరేకమైంది. అయినా వ్యాకరణ రాజకీయాలు పరిశీలించాలంటే ఈ కింది శ్లోకం చూద్దాం.

యద్యపి బహు నాధీషే
తథాపి పఠ పుత్ర వ్యాకరణమ్
స్వజన: శ్వజనో మాభూత్
సకలం శకలం సకృత్ శకృత్

అన్న సంస్కృత శ్లోకం కూడా ఉచ్చారణ ప్రాధాన్యతను బోధిస్తుంది. దీని గురించి ఆచార్య రవ్వా శ్రీహరి '' వ్యాకరణం చదవకపోతే శబ్ద స్వరూపం సరిగా తెలియదనీ, అందువల్ల ఉచ్చారణాదుల్లో పొరపాట్లు చేసే అవకాశముందనీ అలాంటి పొరపాట్లు చేయకుండా ఉండడానికి ప్రతి విద్యార్థీ తప్పకుండా వ్యాకరణం చదవాలనీ దీనిసారాంశం'' (శ్రీహరి 1996ః ృఒ) అని వివరించారు. ఉచ్చారణలో క్రమశిక్షణను ఈ శ్లోకం సంకేతిస్తుంది. అయితే ప్రామాణిక వ్యవహారాన్ని కూడా అది నిర్బంధం చేస్తుంది. ప్రాదేశిక భాషలలో కొన్ని వర్ణాలు, ధ్వనులు వుండవు. ఉదాహరణకు తెలంగాణ భాషలో 'ల' మాత్రమే వుంటుంది. 'ళ' వుండదు. 'ఎవరు! రా?' అన్న ప్రామాణిక వాక్యాన్ని తెలంగాణలో 'ఎవల్లుల్లా?' అంటారు. దీనికి పదమధ్యమంలోనూ పదాంతంలోనూ రకారం లకారంగా మారడం తెలంగాణలో కనిపిస్తుంది. ప్రామణిక వ్యవహారమే సరైనదని విశ్వసిస్తే తెలంగాణ ఉచ్చారణలన్నీ తప్పులుగా తోస్తాయి. ఆకారణంగా తెలంగాణ ఉచ్చారణను తరగతి గదుల్లో సరిదిద్దే కార్యక్రమం మొదలైంది. తెలంగాణ విద్యార్థులు క్రమంగా మాతృభాష ఉచ్చారణను పరిత్యజించి ఆంధ్ర ఉచ్చారణను అలవర్చుకొన్నారు. యిది వ్యాకరణ రాజకీయాల ఫలితాలలో ఒకటి.

చారిత్రకంగా పరిశీలిస్తే ఉచ్చారణ స్పష్టత వల్ల బహుళ ప్రయోజనం వుంది. వేదాలు పొరపాటుగా ఉచ్చరించ కూడదన్న దైవిక భావన ప్రాధమికం. అది పారమార్ధిక ప్రయోజనం. లౌకిక ప్రయోజనాలు అనేకం వున్నాయి. ఉచ్చారణ ప్రాధాన్యత, భాష మీద సాధికారికత ప్రాచ్య పాశ్చ్య దేశాలలో చారిత్రక పాత్ర

పోషించింది. అందమైన, స్పష్టమైన ఉచ్చారణ కులీన వర్గాల ఆదరణకు కారణమైంది. వేద మంత్రాలు, సంస్కృతం అధ్యయనం చేసిన వ్యక్తి ఉచ్చారణ విశిష్టమైంది. అది పాలకులను పాలితులను మంత్ర ముగ్ధుల్ని చేస్తుంది. ఉచ్చారణ విశిష్టత, భాష మీద సాధికారికత ద్వారా కులీన వర్గాల ఆదరణ పొందవచ్చని మధ్య యుగాల కాలం నాటి బ్రిటన్లు విశ్వసించేవారు. ఆధునిక కాలంలో ఇంగ్లీషు మీద ప్రభుత సాధించి ఉన్నతావకాశాలు పొందవచ్చని అమెరికాలోని మధ్యతరగతి పంథొమ్మిదో శతాబ్దంలో నమ్మేవారని కర్ల్ డబ్ల్యూ. డికేమా వివరించారు. అందుకే వ్యాకరణం పాఠ్యాంశాల్లో విధిగా చేర్చాలన్న డిమాండు ఆ సమాజాల్లో వుండేది. ప్రధానంగా మధ్యతరగతి ఆవిర్భావం వ్యాకరణం వికసించడానికి ఇంగ్లీషు భాషా సమాజాల్లో కారణమైంది. వారికి వ్యాకరణం ఒక అభివృద్ధి సాధనమైంది.

భాష కేవలం భావ వ్యక్తీకరణ సాధనమే కాదు. అది అణచివేత సాధనం కూడా అన్న ఎరుక ఆధునికానంతరవాదం అందించింది. అయితే అది ఆధిపత్య సాధనమే కాదు ఊర్ధ్వముఖ చలనానికి కూడా తోడ్పడుతుందని యూరోపియన్లు, భారతీయులు గుర్తించారు. అందుకే సంస్కృతం విముక్తి (మోక్షం) కలిగిస్తుందని విశ్వసించిన వారే దాన్ని యితరులు చదవకుండా నిషేదించారు. అందువల్ల భాష కేవలం భావవ్యక్తీకరణ

మాధ్యమం అన్న నిర్వచనం నిర్వికల్ప భావన మాత్రమే. అయితే సంస్కృతం, ప్రాకృతం వంటి భాషల్లో ప్రభుత కలిగివుండడం పాలకుల ఆశ్రయం పొందడానికి ఉపయోగపడడం చరిత్రలో మనం ఎరుగుదుము. గ్రాంధికంలో రాయని, మాట్లాడని వారిని చిన్నచూపు చూడడం మన సారస్వతంలో నమోదైవుంది. గ్రాంధికమే కావ్య భాషని నమ్మినవారూ వున్నారు. నమ్మకం విశ్వాసంగా కూడా మారిందని డికేమా అమెరికన్ల నుద్దేశించి చేసిన వ్యాఖ్య మనకూ వర్తిస్తుంది. నేడు మన సమాజంలో ఇంగ్లీషు వస్తే సదావకాశాలు ఉపలబ్దం అవుతాయని అనుకుంటున్న వాస్తవం వుంది. వ్యాకరణంలోనూ సంస్కృతంలోనూ పట్టుసాధించని వారికి విద్యారంగంలో ఎటువంటి అగౌరవం అనుభవమౌతుందో అందరికీ ఎరుకే.

తెలుగులో చిన్నయసూరి వ్యాకరణం రాయడానికి కూడా యిలాంటి ఒక చారిత్రక కారణం వుంది. వైయ్యాకరణుడు, లాక్షణికుడు, కవి, అనువాదకుడు అయిన చిన్నయసూరి బాలవ్యాకరణం రాయడానికి ముందు తెలుగులో వ్యాకరణాలు వున్నప్పటికీ అవి సమగ్రమైనవి కావు. చిన్నయ సూరి కవిత్రయం వారి ప్రయోగాలను పరిశీలించి సంస్కృత వ్యాకరణాల వెలుగులో సూత్రరచన చేశారు. బాలవ్యాకరణం ఉద్దేశం కావ్య భాష పరిశీలన, కావ్యపఠనంలో పొరపాట్లు జరగకుండా చూడడం వరకే. ఉచ్చారణ పొరపాట్ల పట్ల బాలవ్యాకరణానికి ఆసక్తి లేదు. అప్పటికే సంస్కృత భాషాపఠనం వల్ల కొన్ని వర్గాలు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమాజం మీద ఆధిపత్యం వహించి వున్నాయి. చిన్నయసూరికి సంస్కృత వ్యాకరణం ఎంత ప్రేరణ కలిగించాయో ఆంగ్లేయుల పాలనలో ఇంగ్లీషు ప్రభావం అంతే కీలకంగా ఆయన మీద పని చేసింది. ఇంగ్లీషు చదివిన వారికి విశేష గౌరవం, అపారమైన ఉద్యోగావకాశాలు దొరుకడం వారి అనుభవంలో వుంది.

సంస్కృతం, తెలుగు చదివన వారికి కూడా అవకాశాలున్నాయి. అయితే మద్రాసు ప్రెసిడెన్సీలోని మద్రాసు యూనివర్శిటిలో ఇంగ్లీషు బోధనామాధ్యమంగా వుండేది. తెలుగు బోధించడానికి అనువైన భాష ఏదీ అన్న చర్చ నుంచే గ్రాంధిక వ్యవహారిక భాషా సంఘర్షణ ఆవిర్భవించింది.

సూరి కావ్య భాషకు రాసిన వ్యాకరణం ఆ తరువాత బోధనారంగంలో తిరుగులేని ఆధిక్యతను సాధించింది. వ్యాకరణం అధ్యయనం మధ్యతరగతి బ్రాహ్మణుల్ని విశేషంగా ఆకర్షించింది. కావ్య రచన చేయని వారికి పండితులుగా గుర్తింపు లేని కాలమది. ప్రతివ్యక్తి విద్యాసంపన్నుడు అని గుర్తించబడాలంటే వ్యాకరణం, ఛందస్సు తప్పని సరి. అందువల్ల, కావ్య రచనలో వ్యాకరణ దోషాలు లేకుండా వుండడానికి, గణబద్ధంగా కవిత్వం చెప్పడానికి వ్యాకరణం, ఛందస్సు అనివార్యమైనవి. ఆంగ్లవిద్య గడించి ఉన్నతావకాశాలు పొందగలిగే అవకాశం వున్నప్పటికీ అందుకు తగినన్ని కళాశాలలు, బడులు ఉండేవి కావు. 1857 తరువాత మద్రాసు, బొంబాయి ప్రెసిడెన్సీల్లో తక్కువ సంఖ్యలో పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేశారు. ఆ తరువాత జరిగిన పరిణామాల్లో మద్రాసు ప్రెసిడెన్సీలో తెలుగు పాఠశాలలు మున్సిపాలిటీ స్థాయిలో ఆవిర్భవించాయి. వాటిలో స్థానిక భాషల్లోనే విద్యాబోధన జరిగేది. అందువల్ల మధ్యతరగతి నుంచి విద్యావంతులుగా ఎదిగినవారు ఆ సంస్థల్లో అధ్యాపకులుగా చేరడానికి ఆసక్తి కనబరిచేవారు. వాటిలో నియుక్తం కావడానికి సంస్కృత భాషా సాహిత్యాలు నేర్చుకొని వుండడం అర్హత. అందువల్ల చిన్నయసూరి బాల వ్యాకరణం విద్యారంగంలో ఆధికార స్థానం పొందింది. రామాయణం, భారతం, పురాణాలు వంటి వాటిల్లో ప్రవేశం వుండడ మొక్కటే సరిపోయేది కాదు. వ్యాకరణం సమగ్రంగా తెలిసినవారినే పండితుడని గౌరవించేవారు.

తెలంగాణ భాషా వ్యవహర్తలకు బాలవ్యాకరణం అధ్యయనం చేయడం ద్వారా లేదా తెలుగు అధ్యయనం చేయడం వల్ల రాజ్యం ద్వారా ప్రయోజనం ఒకనగూర లేదు. తెలంగాణా హైదరాబాదు రాజ్యంలో వుండేది. యిక్కడ ఉర్దూ మాధ్యమిక భాష. పాఠశాలలు, కళాశాలలు అన్నీ ఉర్దూ మాధ్యమంతో నడిచేవి. యిక్కడి ప్రజల భాష తెలంగాణ. అయితే తెలంగాణ మీద ఉర్దూ, పార్శీ, మరాఠీ భాషల ప్రభావం వుంది. అధ్యయన భాషగా ఆంధ్ర భాషను తెలుగు భాష పేరుతో స్వీకరించడానికి గొప్ప పోరాటం చేయాల్సి వచ్చింది. గ్రంథాలయోద్యమం అందులో కీలకమైంది. గురజాడ, గిడుగులు వ్యవహారిక భాషోద్యమం సాగిస్తున్న కాలంలో కూడా ఈ ప్రాంతంలో ఉర్దూ అధికార భాష. అధ్యయన భాషకూడా. అందువల్ల భాషోద్యమం రాజ్య వ్యతిరేక పోరాట రూపంలో 1940 తరువాత గానీ రాలేదు. వ్యవహారిక భాషోద్యమం, గ్రాంధిక భాషోద్యమం వల్ల లబ్దిపొందింది మద్రాసు ప్రెసిడెన్సీలోని కోస్తాంధ్రులే. తెలంగాణవారికి వాటివల్ల కలిగిన ప్రయోజనం స్వల్పం.

తెలంగాణ ప్రాంతంలోని ఆధునిక కవులకు సంస్కృతంతో అనుబంధం ఉంది. అందువల్ల తెలంగాణ ప్రాంతంలోని బ్రాహ్మణులు, యితర అగ్రవర్ణాలు రాయలసీమ (ఆంధ్రలో భాగం)లోనూ ఆంధ్రలోనూ మద్రాసులోనూ చదువుకునేవారు. వారే కవిత్వం రాసేవారు. గోలకొండ కవుల సంచిక అందుకు ప్రబల

ఉదాహరణ. తెలుగు భాష, కావ్యభాష రెండూ కోస్తాంధ్రా సాహిత్యకారుల వికాసానికి ఎంతో తోడ్పడ్డాయి. ఆ ప్రాంతవాసులు సాంస్కృతికంగా ఆధికులై విరాట్ రూపం ప్రదర్శిస్తున్న కాలంలో తెలుగు కోసం తెలంగాణవాసులు పోరాటం చేయాల్సి వచ్చింది.

ఆంధ్ర రాష్ట్రం అవతరించిన తరువాత తెలుగు విద్యారంగంలో వ్యాకరణం
మరింత ఆధిక్యత సాధించింది. వ్యాకరణం ప్రామాణిక భాషను తెలంగాణ మీద రుద్దింది. విద్యార్థులకు ఉదాహరణలుగా బోధించిన అనేక శబ్దరూపాలు తెలంగాణా వాసులకు అపరిచితమైనవి. తెలంగాణ విద్యార్థులు మాతృభాషను కోల్పోవడానికి ఉచ్చారణను సరిదిద్దే కర్తవ్యం వ్యాకరణకర్తలు స్వీకరించడం ఒక కారణం.
వ్యాకరణ గ్రంథాలు ఆంధ్ర ప్రాంతంలోని రెండు జిల్లాల వ్యవహారానికి రూపసాధన చేసి చూపించాయి. రెండు మండలాల వారి భాషకు సూత్ర రచన జరిగింది. యితర ప్రాదేశిక భాషలకు సూత్ర రచన జరగలేదు. దానిక కారణాలు రెండు: ఒకటి ప్రాదేశిక వ్యవహారాలను మాండలికాలని నిమ్నీకరించడం. రెండు, ఆయా ప్రాంతాల నుంచి వైయ్యాకరణులు లేకపోవడం, వున్నా వారికి సంస్కృత వ్యాకరణం మీద తప్ప మిగతా వాటి మీద గౌరవం లేకపోవడం. ప్రధాన స్రవంతి వ్యాకరణాలు ప్రాదేశిక శబ్దరూపాలను వ్యాకరణ బాహ్యాలుగానూ కొన్ని అపవాదులకు నిదర్శనాలుగానూ వినియోగించుకుంది. వ్యాకరణ గౌరవం వాటికి దక్కకపోవడం రాజకయ క్రమంలో ఒక భాగమని అంటే అభ్యంతర పెట్టక్కర్లేదు.
వ్యాకరణం నేర్చుకోవడం అంటే భాషను గురించిన విశేషాలను నేర్చుకోవడమని అర్థం. వ్యవహర్త తన సొంత భాష గురించి నేర్చుకోవడానికి వ్యాకరణం తోడ్పడాలి. ప్రాదేశిక భాషా వ్యవహర్తలకు మాత్రం వ్యాకరణం ఆ విధంగా సహకరించడం లేదు. అందుకు అది పరాయి భాషకు సంబంధించింది కావడమే. ప్రాదేశిక భాషల శబ్దస్వరూపం, ధాతు, ప్రత్యయ విభజన, నియమం, రూఢీ, వ్యవహారం, జాతీయాలు ప్రత్యేకమైనవీ ప్రామాణిక భాషకూ కావ్యభాషకూ సంపూర్ణంగా విభిన్నమైనవి కావడం వల్లనే ప్రాదేశిక భాషా సాహిత్యాల అర్థం ప్రామాణిక భాషావ్యవహర్తలకు బోధపడడం లేదు. ఉత్తరాంధ్ర భాషలో వున్న సాహిత్యం యితర భాషావ్యవహర్తలకు అర్థం కాకపోవడానికి ఉచ్చారణ భేదం ఒక్కటే కారణం కాదు. రాయలసీమ భాషలో వున్న 'మాదిగోడు' కతలు కూడా యితర భాషా వ్యవహర్తలకు అర్థం కాలేదు. అదేవిధంగా తెలంగాణా భాషలో వున్న 'కక్క', 'సిద్ధి' 'సూర', 'పురుడు' వంటి నవలలు యితర భాషా వ్యవహర్తలకు అర్థం కాకపోవడానికి ఉచ్చారణ, యాస ఒక్కటే హేతువు కాదు. ప్రాదేశిక భాషల స్వరూప స్వభావాల్ని వివరించే విస్తృతి వ్యాకరణం సాధించకపోవడమే వ్యాకరణశాస్త్రం పరిమితి.

సమాజమూ, భాష నిరంతరం చలనంలో వుంటాయనీ, అందుకు అనుగుణంగా వాటి పరిశీలనాపద్ధతులు కూడా మారాలని తెలంగాణా ప్రాదేశికవాదం కోరుతుంది. ప్రామాణిక భాషను సైతం గ్రామ్యమని చిన్నబుచ్చే బాలవ్యాకరణం తెలంగాణ భాషకు తావివ్వదని గుర్తిస్తూ వ్యాకరణం యొక్క సర్వాధిపత్యాన్ని

నిరాకరిస్తుంది. ప్రాదేశిక భాషలకు బాల వ్యాకరణం స్థాయిలో ఆధునిక వ్యాకరణ సూత్రరచన చేయడానికి వ్యాకరణాలను పునస్సమీక్షించడం అవసరమని గుర్తిస్తుంది. భాషాశాస్త్రం కూడా ప్రాదేశిక భాషల పట్ల తగినంత శ్రద్ధ కనబరచలేదన్నది గుర్తిస్తూనే వ్యాకరణశాస్త్రాన్ని విస్తరింప చేసుకోవడం ద్వారా మాత్రమే ప్రాదేశిక భాషాశాస్త్రాల్ని అభివృద్ధి చేసుకోగలమని, తద్వారా భాషా స్వరూపాన్ని మరింత సమగ్రంగా తెలుసుకోవడం వీలవుతుందని ప్రాదేశిక వాదం బలంగా విశ్వసిస్తోంది.

ఉపయుక్త గ్రంథాలు:

1. రామచంద్రుడు పుల్లేల (అను) (1996) ముందుమాట వాక్యపదీయం, ప్రథమ భాగం, హైదరాబాదు; తెలుగు అకాడమీ

2. గోపాలకృష్ణమూర్తి బూరుగల (1996) వ్యాకరణాదర్శము హైదరాబాదు నీల్‌కమల్ పబ్లికేషన్స్

3. Dykema Karl W. (1944 ) 'Do We Need to Teach Grammer ' The School Review, vol.52, No.8 (oct,pp 470-476)

('తెలుగు వ్యాకరణములు - పునస్సమీక్ష' అన్న అంశం మీద హైదరాబాదు విశ్వవిద్యాలయం నిర్వహించిన జాతీయ సదస్సు (సెప్టెంబరు, 2007)లో సమర్పించిన పత్రం.)

## వాకపల్లి: ఒక పరామర్శ - కె. బాలగోపాల్

విచిత్రం ఏమిటంటే భూతలం మీదనున్న అన్ని విషయాల గురించీ ఆందోళన చేస్తున్న సిపిఎం వారు వాకపల్లి ఆందోళననుండి నెమ్మదిగా నిష్క్రమించారు. తెలుగుదేశంవారు కనిపించీ కనిపించకుండా పాల్గొంటున్నారు. దళిత సంఘాలన్నీ మిన్నకున్నాయి. ఆదివాసీ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారని పేరుబడ్డ స్వచ్ఛంద సంస్థలేవీ ఆ దాపులకు రావడం లేదు.

వాకపల్లి అత్యాచారం ఉదంతం అనేక రకాలుగా బాధాకరం. ఘటన సరే, దాని తరువాత జరిగిన ఒక్కొక్క విషయమూ ఆందోళన కలిగించింది. ఒకటి అప్పుడే పలువురి నిరసన ప్రకటనలకు దారితీసింది. అది డిజిపి, హోంమంత్రి ఏవిచారణా జరపకుండా 'ఇది మావోయిస్టులను కాపాడడానికి కల్పించిన కథ' అని ప్రకటించడం. బాధితురాళ్ళు ఆదివాసీలు కాక వేరే ఎవరై ఉన్నా అంత లేమిగా మాట్లాడి ఉందురా అని చాలామంది ఆరోజు ప్రశ్నించారు. ఈ ప్రశ్న మొత్తం ఉదంతానికి వర్తిస్తుంది.

వాళ్ళు ఆదివాసీ మహిళలు కాకపోతే వారిచ్చిన ఎఫ్ఐఆర్ నమో దు చేసికూడా ఇన్నాళ్ళు కనీస విచారణ జరపకుండా ఉందురా? కనీసం బాధితురాళ్ళ వాంగ్మూలాల నమోదు చేసుకోకుండా ఉం దురా? హైకోర్టు వేరే ఏ ఆదేశం కాకున్నా ఈ మేరకు నేరపరిశోధన తనడ్యూటీ నిర్వహించాలని వెనువెంటనే ఆదేశించకుండా ఉండు నా? రాష్ట్ర మానవహక్కుల కమిషన్ అంతే నిశ్చేష్టంగా ఉండునా? పోలీసులు చేసే నేరాలు వేరు, పౌరులు చేసే నేరాలు వేరు అనే వైఖరికి భారత రాజ్యాంగంలో ఎక్కడా చోటు లేదు. అంతర్జాతీయ మానవహక్కుల చట్టాలలోనూ లేదు. కానీ పోలీసు యంత్రాంగం లోనూ, న్యాయవ్యవస్థలోనూ ఈ వైఖరి క్రమంగా స్థిరపడి పోతున్నది.

పాలనా యంత్రాంగం విషయంలో ఆశ్చర్య పోయేదేమీ లేదుగానీ న్యాయవ్యవస్థ ఈ వైఖరి అవలంబించడం ఆశ్చర్యం కలిగించే విషయం కాకున్నా ఆందోళన కలిగించే విషయం. వేరే వాళ్ళ మీద నేర అభియోగాలు వస్తే కేసు నమోదు చేసి నేరపరిశోధన జరుపుతారు. కానీ పోలీసుల మీద వచ్చిన అభియోగాలు తిరుగులేనంత బలంగా ఉండాలి. స్వతంత్రమైన సాక్ష్యాలూ మెడికల్ రిపోర్టులూ వగైరా ఉండాలి. ఆపైన హైకోర్టులోనో, సుప్రీంకోర్టులోనో బాధితులు కేసు వేసి ఇవన్నీ చూపించాలి. వారు అన్నీ పరిశీలించి వెనకా ముందూ ఆలోచించి 'కేసు నమోదు చేయండి' అని ఆదేశించాలి. కేసు అప్పుడు నమోదవుతుంది.

బాధితులు అంత శ్రమ తీసుకోకపోతే కేసు ఉండదు. ఆదివాసులు అంత శ్రమ తీసుకోలేరు. అయినా నేరానికి ఆధారాలు నేరపరిశోధనలో తేలాలి. దానికి కావలసిన నైపుణ ్యం నేరపరిశోధకులకు

తర్ఫీదులో ఇస్తారు. బాధితులు తాము చూసిందీ, అనుభవించిందీ చెప్పగలరు. దాని ఆధారంగా కేసు కట్టి నిపుణులయిన వారు నిజాయితీగా నేరపరిశోధన చేసి ఆధారాలు సేకరిస్తారని నేరస్మ-ృతి భావిస్తుంది.

అంతే తప్ప బాధితులే నేరపరిశోధన జరిపి నేరం నిజంగానే జరిగిందనీ పలానా వాళ్ళు చేశారనీ సగం రుజువు చేసినట్టయితేనే తర్ఫీదు పొందిన పరిశోధకులు రంగంలోకి దిగుతారనేది చట్టమూ కాదు, న్యాయమూకాదు. పైగా, నైపుణ్యం సంగతీ, తర్ఫీదు సంగతీ అట్లా ఉంచి వాకపల్లి నేరానికి బాధ్యులయిన వారెవరో గ్రేహౌండ్స్ అధికారులకు తెలు సు. వారికి మాత్రమే తెలుసు. ఎందుకంటే గ్రేహౌండ్స్ సిబ్బంది పేర్లూ, వారికి డ్యూటీ వేసిన ఊర్లూ వేరెవరికీ తెలీవు. ఏదైనా ఒక సమాచారం ఒకరికి మాత్రమే అందుబాట్లో ఉంటే దానిని ఉపయోగించుకొనే బాధ్యత ఎవరికైనా ఉంటుందనేది కామన్‌సెన్స్ దృక్పథమేకాక భారత సాక్ష్యాలచట్టంలోని నియమంకూడా.

కాబ ట్టి ఆ ఉదయం వాకపల్లి వైపు పోయిందెవరు అన్నది విశాఖ ఏజెన్సీలోని గ్రేహౌండ్స్ బలగాల అధినేత ప్రకటించాలి. అది వారి బాధ్యత. ప్రకటించిన తరువాత వారినందరినీ వాకపల్లి బాధితురాళ్ళ ముందు ప్రవేశపెట్టాలి. వారు ఎవరెవరిని గుర్తుపడతారో ఆ సిబ్బందిని పోలీసులు దోషులుగా ప్రాథమికంగా గుర్తిం చి నేరపరిశోధన కొనసాగాలి. తమ వారి తోలు కాపాడే కర్తవ్యం మీద వేసుకున్న పోలీసు పెద్దలకివన్నీ తోచకపోవచ్చునుగానీ హై కోర్టు కూ రాష్ట్ర మానవహక్కుల కమిషన్‌కూ తోచకపోవడాన్ని ఏమ నాలి? ఆ సంస్థలకు చట్టం తెలియకపోలేదు.

మరి ఎందుకు ఆలో చన చేయలేదనుకోవాలి? ఎందుకు తదనుగుణమైన ఆదేశం ఇవ్వ లేదనుకోవాలి? కోందు గిరిజనులేకదా, వెంటనే కేసుల కట్టెయ్యక పోతే, ఏం మునిగిపోయిందిలే అన్న వైఖరే కారణమా? తెలుగుదేశంపార్టీకి చెందిన మాజీమంత్రులు రాష్ట్రమంతటా చేస్తున్న వీరంగం చూస్తున్నాం. పోలీసులు వాళ్ళనప్పుడప్పుడు అటకాయించినా అరెస్టు చేసినా మర్యాద తప్పడం లేదు. ఎప్పుడ యినా కొంచెం తప్పినా చంద్రబాబునాయుడు, వారి అభిమా నులయినవారు నానాయాగీ చేస్తుండటం చూస్తున్నాం. మరి పాడే రు ఏజెన్సీలో తెలుగుదేశంకు చెందిన మాజీమంత్రి మణికుమారి వాకపల్లి బాధితులకు మద్దతుగా ఉన్నందుకు కాల్చేస్తామని బెది రించిన సంగతి మీరెవ్వరయినా ఎక్కడైనా చదివారా? టీవీల్లో చూశారా? చదివి ఉండరు, చూసి ఉండరు.

నాయకురాలయినా, మాజీమంత్రి అయినా, ఆదివాసీయే కదా ఆమె కూడా? మావోయిస్టులకు మేలు చేయడానికి ఆ స్త్రీలు అబద్ధపు ఆరో పణ చేసారని నమ్మేందుకు సిద్ధంగా ఉన్నవాళ్లు సమాజంలో లేక పోలేదు. అయితే వేరే ఎవరి మేలు కోసమో తాము లైంగిక అత్యా చారానికి గురయ్యామన్న నిందవేస్తే వారికొచ్చే కష్టాలు పత్రికల లో అందరూ చదివారు. వారి భర్తలు వారిని కొంతకాలం వెలి వేసి సంప్రదాయం ప్రకారం జరగవలసిన తంతు జరిగిత తరు వాతే ఇంట్లోకి రానిచ్చారు. ఒకవేళ రేప్ ఆరోపణ నాటకమైతే

వారి భర్తల చర్యకూడ నాటకమే అయి ఉండాలి. ఆదివాసీ తెగలవారి లో అతి వెనుకబడిన వారైన కోందులు మావోయిస్టుల మేలు కోసం ఇంత పెద్ద నాటకం ఆడుతున్నారని నమ్మగలమా?

ఈ స్క్రిప్టు ఎవరు రాసారనీ దర్శకత్వం ఎవరు నెరపారనీ అనుకోవాలి?
ప్రభుత్వం వైఖరిలో ఏ కదలికా రాకపోయేసరికి చివరికి ఆ పద కొండుమందిస్త్రీలు పాడేరులో ఆమరణ నిరాహారదీక్షకు కూర్చు న్నారు. నాటకం చాలాదూరం పోయినట్టే మరి. వారిపైన అత్యా చారం చేసినవారు సురక్షితంగా, కనీసం పేరు కూడా బయటకు పొక్కకుండా ఉండిపోగా, బాధితురాళ్లు తిండిమానుకుని నిరసన దీక్షకు కూర్చున్నారు. అయినప్పటికీ జిల్లా కలెక్టరుతో సహా ఏ అధికారీ వారి దగ్గరకు పోలేదు, వారిని పలకరించలేదు.

విచిత్రం ఏమిటంటే భూతలం మీదనున్న అన్ని విషయాల గురించీ ఆం దోళన చేస్తున్న సిపిఐ(ఎం) వారు వాకపల్లి ఆందోళననుండి నెమ్మ దిగా నిష్క్రమించారు. తెలుగుదేశంవారు కనిపించీ కనిపించకుం డా పాల్గొంటున్నారు. దళితసంఘాలన్నీ మిన్నకున్నాయి. ఆదివా సీ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నాయని పేరుబడ్డ స్వచ్ఛంద సంస్థలేవీ ఆ దాపులకు రావడం లేదు. ఒక సామాజిక వర్గానికి జరిగితే అన్యాయం, వేరొకరికి జరిగితే వార్త మాత్రమేననేది సంకుచిత వైఖరి. సామాజికవర్గాలుగా చీలి పోయి ఎవరి న్యాయం కోసం వారు పోరాడుకుంటున్న రాజకీయ వాతావరణం దీనికి దారితీసింది. ఆ 'పోరాటాలు' విజయవంతం కావడానికి వైయస్ ప్రాపకం అవసరంఅనుకుంటున్నవారు, కొన్నా ళ్లు పోయాక వాకపల్లి బాధితులనే తప్పుపట్టినా ఆశ్చర్య పోలేము.

ముదిగొండ కాల్పుల తరువాత బియస్పీ, మాలమహానాడు, మా దిగ దండోరాలు సిపిఐ(ఎం)నే ఎక్కువ తప్పుపట్టడం చూడలేదా! వాకపల్లి ఆందోళన ఉధృతమయ్యే కొద్దీ పాడేరు ఎమ్మెల్యే రాజా రావుకే ప్రయోజనం ఎక్కువ అనే కుళ్లుబోతుతనం కొన్ని పార్టీలు మౌనంగా ఉండడానికి కారణమా? ఈ సందేహం నిజమైతే అది చాలా బాధాకరం. అయితే ఈ రకమైన కుళ్ళుబోతుతనానికి లోబ డ్డవారు గుర్తించవలసిన సత్యం ఒకటుంది. లకే రాజారావు ఆందో ళనకారుడిగానే ఎమ్మెల్యే అయ్యాడు. అతని దగ్గర పైసలు లేవు. బలమైన పార్టీలేదు, కండ బలంలేదు. ఆదివాసీగా పుట్టి ఆదివా సీ ల మేలుకోసం శ్రమించి ఎమ్మెల్యే అయ్యాడు. ఆ మార్గంలో అత నిని ఓడించడం నిజమైన రాజకీయ స్పర్ధ అవుతుందిగానీ, కుళ్లు పోతుతనంతో ఉద్యమాలను దెబ్బతీసేది విధ్వంసక రాజకీయం అవుతుంది.

సౌజన్యం: ఆంధ్రజ్యోతి
సెప్టెంబరు28,2007

అమెరికాలో ఉంటున్న అరుణతో ఛాటింగ్ చేస్తూ విరగబడి నవ్వుతోంది వసంత. పక్కన మ్యూజిక్ సిస్టంలో నుంచి వచ్చే పాట భూమిని అదరగొడుతోంది.

"అరగంట నుంచీ పిలుస్తున్నా... వినపడటంలా!" అని అరుస్తూ వచ్చి మ్యూజిక్ ఆపేసి, "పద... దోసెలు తిందువుగాని. అప్పడే పదయింది. ఇంకెప్పుడు? ఆదివారమయితే అన్ని పన్లూ ఆపడమేనా?" అని కూతుర్ని కసిరింది వసుంధర.

"జస్ట్ హాఫెనవర్ మమ్మీ," అంది వసంత.

"హాఫూ లేదు, అవరూ లేదు. పదపద అందరిదీ అయిపోయింది. నీకు పోసేసి ఆవిడ వంట మొదలేసుకుంటుంది. ఇవ్వాళ మీ నాన్నకి పెరుగు వడల మీద మనసైంది. నీకేం కావాలో మరి లంచ్‌లోకి త్వరగా చెప్పేస్తే ఓ పనైపోతుంది."

"ఏదో ఒకటి చేయించు మమ్మీ," అంటూ వచ్చి టేబిల్ ముందు కూర్చుంది వసంత.

వంటావిడ వసంత ముందు ప్లేటూ పచ్చడీ పొగలు కక్కే సాంబారూ పెట్టి, దోసె పోసుకు రావటానికి వంటింట్లోకి పరిగెత్తింది. అయిదు నిమిషాల్లో అట్లకాడ మీదే దోసె పట్టుకొచ్చి, "తినమ్మా అదయినాక ఇంకొకటి వేస్తా," అని మళ్ళీ స్టౌ దగ్గర నిలబడింది.

వసుంధర వచ్చి కూతురు ఎదురుగా కూర్చుని, "నీకు గురు వారం పెళ్ళిచూపులు ఫిక్స్ చేశాం. బుధవారం సాయంత్రం ఆరుగం టలకి, 'ఊర్వశి' బ్యూటీక్లినిక్‌లో అపాయింట్‌మెంట్ తీసుకున్నాను, ఫేషియల్ కోసం. ఆఫీసు నుంచి డైరెక్టుగా అటే వెళ్ళు. డ్రెస్సులేం ఉన్నాయో ఇప్పడే చూసి పెట్టుకో. చీరె వద్దులే... డ్రెస్ వేసుకో. కాస్త మంచిది చూడు. విన్నావా? మళ్ళీ మరచిపోయా నంటావా? నీకు నెలరోజులుగా చెబు తున్నా, ఈ నెలలో ఒక సెలవు అడిగి పెట్టుకోమని."

అమ్మకి అడ్డు చెప్పటమూ, సవరణలు చెయ్యటమూ అసంభవం. ఆవిడవన్నీ ఆజ్ఞలే.

"సరే మమ్మీ."

"పద బీరువాలో మంచి డ్రెస్సులేం ఉన్నాయో చూద్దాం. లేకపోతే సాయం త్రం ఒకటి కొనుక్కొద్దాం. అప్పడే లేవకు, ఇంకో దోసె వేసుకొస్తోంది ఉండు," అని, "మళ్ళీ కంప్యూటర్ దగ్గర కూచోకు. తినంగానే బీరువా

దగ్గరికి పద. చెవులకి ఏం పెట్టుకోవాలో, మెడలో ఏం వేసుకోవాలో, గాజులేం బావుంటాయో చూద్దాం,'' అని - దోసె పళ్ళెం తీసెయ్య మని పనిపిల్లకీ, ఫ్రిజ్‌లో నుంచి బత్తాయి రసం తీసి వసంతకివ్వమని వంటావిడకీ ఒకేసారి ఆజ్ఞలు జారీచేసింది వసుంధర.

వంటావిడ తెచ్చిచ్చిన బత్తాయి రసం గడగడ తాగేసి, 'ఇకపోనా?' అన్నట్టు చూసింది వసంత.

''పద... బీరువా దగ్గరికి,'' అని కూతుర్ని దాదాపు లాక్కుపోయి, చెవు లకీ, మెడలోకీ ఏం వేసుకోవాలో తనే ఎంపిక చేసిపెట్టి, ఒక డ్రెస్సు కూడా బయటికి తీసి, ''దాన్ని బయటుంచు. మరోసారి ఇస్త్రీ చేయిస్తా,'' అంటూ, ''ఇక పో,'' అని ఆమెని విడుదల చేసింది.

అమ్మ లంచ్‌కి పిలిచేదాకా హాయిగా కబుర్లు చెప్పకోవచ్చు. లంచ్‌కి అరగంట ముందు స్నానానికి పరుగెత్తి, ఆ పని కాస్తా ముగించి, భోజనం కానిస్తే, సాయంత్రం టీ దాకా మళ్ళీ అమ్మ కదిలించదు. ఆదివారం కదా వదిలేస్తుంది... అనుకుంటూ వసంత మళ్ళీ కంప్యూటర్ దగ్గర కూర్చొని అరుణతో, రవితో, నిర్మలతో ఛాటింగ్ మొదలుపెట్టింది.

అంతలో వసుంధర వచ్చి ఒక పసుప్పచ్చ కాగితం మీద, 'బుధవారం సాయంత్రం అయిదింటికి బ్యూటీపార్లర్, గురువారం పొద్దున పదింటికి పెళ్ళిచూపులు,' అని రాసి కంప్యూటర్ ఎదురుగా అతికించి వెళ్ళింది. వసంతకి పదిరోజులనాడే ఇరవై మూడో ఏడొచ్చింది. నాలుగు నెలలనాడు ఉద్యోగం వచ్చింది. మూడు నెలల కిందట ఇంజినీరింగ్ డిగ్రీ వచ్చింది. నాలుగు నెలలనాడు ఉద్యోగం రావటం అంటే డిగ్రీ పాస్ అవకముందే క్యాంపస్ ఇంటర్వ్యూలోనన్నమాట. ఇప్పుడు పెళ్ళి సంబంధం వచ్చింది. అమ్మ దృష్టిలో చాలా 'యోగ్యమైన సంబంధం.'

''మీ అమ్మకి నచ్చిందంటే ఇక తిరుగే లేదు,'' అన్నాడు నాన్న.

ఫోటోలో కుర్రవాడు బాగానే ఉన్నాడు.

ఏ ఏ ఏ

''ఇదుగో... ఈ నాలుగు ఫోటోలూ చూడు. అందులో ఏది నచ్చిందో చూడు,'' అంది అమ్మ.

''వాళ్ళకీ ఒక్కతే పిల్ల. చాలా బ్రిలియంట్. నీకులాగానే చిన్నప్పటినించీ ఇంగ్లీష్ మీడియం స్కూలు చదువు... ఆపైన ఇంజినీరింగ్ ఎంట్రెన్స్‌లో మంచి ర్యాంకు... క్యాంపస్ ఇంటర్వ్యూలోనే ఉద్యోగం... మొహంలో మంచి స్పార్క్ ఉంది. మాకయితే ఈ సంబంధం బాగా నచ్చింది,'' ఏకకంఠంతో అమ్మానాన్నా ఒకే అమ్మాయికి ఓటేశారు.

“అవును. వాళ్ళకీ ఊళ్ళో ఇల్లుంది. ఆవిడే పిల్లని చదివించాలని వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుందిట. ఆయనది పెన్షనబుల్ జాబే… బాగానే సెటిల్ అయ్యారు. మనకీ కట్నం అక్కర్లేదు. పెళ్ళి గ్రాండ్‌గా చేస్తే చాలు. ఏమంటావ్?” అన్నాడు నాన్న.

సతీష్‌కి ఏం మాట్లాడాలో తెలీలేదు.

‘నీకు బైపీసీ వద్దు… నువ్వు చదవలేవు. ఎంపీసికి అప్లికేషన్ తెచ్చా… ఫిల్ చేశా కూడా… చూడు,’ అని నాన్న అంటే, ‘నాకు డాక్టరవాలని ఉంది నాన్నా,’ అనాలనుకుని, ‘పోన్లే అందులో సీటు రాకపోతే నాన్నకి కోపం వస్తుంది,’ అనుకుని ఎంపీసిలోనే చేరాడు సతీష్.

‘మాథ్స్‌కి నీకు నరసింహంగారి దగ్గర ఎక్స్‌ట్రా ట్యూషన్ పెట్టాను, వెళ్ళు,’ అంటే, సరేనన్నాడు.

“మీ అబ్బాయికి ఐఐటిలో సీటు వచ్చిందిటగా?” అని బంధువులు ప్రశంసిస్తే -

“మొదటినుంచీ గైడెన్స్ అంతా నాదే,” అన్నాడు నాన్న. ఒకటో క్లాసు దగ్గర్నుంచీ ఎం.ఎస్. దాకా తనదే గైడెన్స్. ఇక అమ్మేమో చదువుకునే పిల్లలు ఏం తినాలో… ఏం ఎక్సర్‌సైజులు చేయాలో… ఇలా ఎప్పుడూ చెబుతూనే ఉంటుంది. ఐఐటిలో చేరినా… అమెరికా వెళ్ళినా… అమ్మానాన్నా - చెవిలో ఇల్లు కట్టుకునే ఉండేవాళ్ళు.

ఒక్కగానొక్క కొడుకు కదా! వాళ్ళని ఏ విషయంలోనూ నొప్పించటం సతీష్‌కి ఇష్టం ఉండదు. వాళ్ళు ఏం చెప్పినా తన మంచికే గదా! ఇప్పుడు తనింత మంచి పొజిషన్‌లో ఉండటం వాళ్ళ చలవ కాదూ! సరే, ఆ పిల్లనే చూద్దాం. ఇరవై మూడేళ్ళట. ఫోటోలో చూస్తే పదోక్లాసు చదివే కాన్వెంటు పిల్లలా ఉంది.

ఏ ఏ ఏ

“కట్నానిదేముందండీ వసుంధరగారూ… ఈ చేత్తో పట్టుకుంటే ఆ చేత్తో పోతుంది. అదేం వద్దు. మంచి మ్యారేజి హాల్ బుక్ చేయండి. ఏసీ తప్పనిసరిగా ఉండాలి. క్యాటరింగ్‌కి నంబర్ వన్ వాళ్ళని చూడండి. సరే, మీకు చెప్పేదేముంది… లాంఛనాలవీ ఏముంటాయో మీకు తెలుసు కదా… మా మర్యాదకి భంగం కాకుండా చూడండి.”

ఏ ఏ ఏ

అర్ధరాత్రి ఫోన్ మోగుతుంటే కంగారుగా రిసీవర్ ఎత్తింది వసుంధర.

“ఏంటండీ! మీ అమ్మాయికంత పొగరు. అసలు ఒక్క మాట కూడా అర్థం చేసుకోదు. పనిరాదు సరికదా... నేర్చుకుందాం అని కూడా లేదు. నావల్ల కాదు... మూడు రోజుల నుంచీ అలిగి కూర్చుంది. ఇండియా పంపటం అంటే మద్రాసుకీ హైదరాబాదుకీ తిరగటమా?” సతీష్ గట్టిగా అంటుంటే, నిద్రమత్తు వదిలిపోయింది.

“దానికి ఫోనివ్వు, నే మాట్లాడతా,” అంది.

ఫోన్లో ఏడుపు, వెక్కిళ్ళు. ఏమైందో ఏమిటో!

ఈ మగపిల్లలు పైకి బాగానే ఉంటారు. లోపల ఉత్త మేడిపళ్ళు. ఏం బాధలు పెట్టాడో ఏమిటో... పదిలక్షలు వదిల్చారు, కట్నం వద్దువద్దు అంటూ.

అవతల ఫోన్‌లో వింటాడేమో ఏమన్నా అడిగితే.

“ఇప్పుడెంతయిందే టైము?” అంటూ, “సతీష్ ఆఫీసుకి వెళ్ళాక ఫోన్ చెయ్యి,” అని చెప్పింది. అలాగే చేసింది వసంత.

“ఏం చేసినా నచ్చదమ్మా. వాళ్ళమ్మ చేసినట్టు ఉండదట. పక్కలు దులప లేదంటాడు... కౌంటర్ తుడవలేదంటాడు... నన్నే బట్టలు మెషీన్‌లో వెయ్యమంటాడు... ఫ్రెండ్స్‌ని పార్టీలకి పిలుస్తాడు... వంటలు వండమంటాడు. హాయిగా ఇరవై వేలు తెచ్చుకుంటూ ఉండేదాన్ని... ఇట్లా అమెరికా తోలేశావు గదా! డ్రైవింగ్ లైసెన్స్ లేదు... పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ లేదు. జైలు మమ్మీ... జైలు.”

“అదేంటీ... అరుణ లేదూ అక్కడ, స్రవంతి లేదూ, ప్రమీల లేదూ - నువ్వొక్కదానివే ఉద్యోగం మానుకుపోయావా? మరి ఇంట్లో కాస్త పని చేయకపోతే ఎట్లా? అలవాటు చేసుకో?”

“నువ్వెప్పుడన్నా నాచేత కాఫీ పెట్టించావా? ‘అడ్జెస్ట్ చేసుకో - అలవాటు చేసుకో,’ అని కొత్త మాటలు చెప్తావేంటి మమ్మీ. మీరంతా నాకే అడ్జెస్టయిపోయేవాళ్ళు కదా?”

వసుంధర బుర్ర తిరిగిపోయింది. వెంటనే వియ్యపురాలికి ఫోన్ చేసింది.

ఆవిడ తన కొడుక్కి ఫోన్ చేసి, “ఆ పిల్లకి కాస్త పనిలో సాయం చెయ్యరా నాయనా... అమెరికాలో అంతా చేస్తారటగా?” అంది.

“నావల్ల కాదు మమ్మీ... నేనెప్పుడూ పని చెయ్యలేదు. ఇంట్లో పనిచేస్తూ కూర్చుంటే నా ఉద్యోగంలో పైకెట్లా వస్తాను. అసలు ఈ పన్లన్నీ చేసుకోవాల్సి వస్తోందనే నేను పెళ్ళికి ఇంత తొందరగా ఒప్పుకున్నాను.

ఉద్యోగమూ చెయ్యక... ఇంట్లో పనీ చెయ్యక... ఆ మహారాణి ఏం చేస్తుందిట? నీకు తెలుసా? పక్కలో టెడ్డీబేర్ లేందే నిద్రపోదు.''

ఆవిడ తిరిగి వసుంధరతో, ''మా అబ్బాయికి ఫోన్ చేశాను వసుంధరగారూ! వాడొకటే గోల - మీ అమ్మాయి కనీసం కాఫీ మేకర్‌లో నీళ్ళు కూడా పొయ్యదట. ఎప్పుడూ ఆన్‌లైన్‌లోనే ఉంటుందట. శుభ్రంగా ఇండియాలోనే ఇచ్చుకుంటే ఇంటి నిండా నౌకర్లుండేవాళ్ళు.''

''అవునండీ. నిక్షేపంగా నెలకి ఇరవై వేలతో ప్రారంభమైన ఉద్యోగం మానుకుని వెళ్ళింది. నాదే ఈ తప్పంతా,'' అంది వసుంధర, కోపం దిగమింగుకుంటూ.

అదే ఇండియాలో ఉంటే అసలేం చేస్తున్నదో ఒకసారి చూసి రావటానికన్నా ఉండేది కదా! ఒక పనిపిల్లని పంపి ఉండేది. ఉండీ ఉండీ ఆ కోపం అంతా తన తల్లి మీదికి తిరిగింది. వసంత పుట్టినప్పుడు పురుడు పొయ్యటానికి వచ్చింది. ''దీంతో ఉద్యోగం ఎట్లా చేసుకుంటావ్? నే తీసుకుపోయి పెంచుతా. నాకు మాత్రం చేసే పనేముందీ ఇంటికాడ. కాలక్షేపంగానూ ఉంటుంది... నీకూ హాయిగా ఉంటుంది. అల్లుడిని కూడా అడుగుతాలే,'' అంది.

ఇంటి దగ్గర ఎవరూ ఉండరు. ఎప్పుడూ పనికి ఒక పిల్ల ఉంటుంది, పసిదాన్ని ఎత్తుకోటానికి కూడా. అమ్మకి శ్రద్ధ ఎక్కువ. కంట్లో వత్తులు వేసుకుని మరీ చూస్తుందని, 'సరే,' నంది.

ఆరునెలల పాటు అమ్మ తన దగ్గరే ఉండిపోయింది. ఆ తరువాత వసంతని తీసుకు వెళ్ళిపోయింది.

పదేళ్ళు వచ్చేదాకా తనే పెంచింది. మంచినీళ్ళు ముంచుకు తాగడం, తాగిన గ్లాసు కింద పెట్టడం కూడా తెలీకుండా పెంచింది అమ్మమ్మ. ఎవరికైనా ఏదైనా చిన్నపని చేసి పెట్టొచ్చు అని కూడా తెలీకుండా చేసింది.

''నువ్వే దాన్ని బాగా చెడగొట్టావు,'' అని ఫోన్‌లో తల్లి మీద బాగా అరిచింది వసుంధర.

''నేను పెంచింది పదేళ్ళు... నువ్వు పెంచింది పదమూడేళ్ళు. నేను పెంచినప్పుడది చిన్నపిల్ల. నువ్వు పెంచినప్పుడు ఊహ వస్తున్న పిల్ల. అయినా నేనెందుకు నీ కూతుర్ని పెంచాను? నాకు లేని చదువూ ఉద్యోగం నీకున్నాయనీ... నువ్వు స్వతంత్రంగా బతకాలనీ... పిల్లకూ ఉద్యోగానికీ నువ్వు న్యాయం చెయ్యలేవనీ. ఆ సంగతి అర్థం చేసుకో ముందు. వంట రాకపోతే వచ్చిన నష్టం ఏంలేదు. ముందు వాళ్ళిద్దరి మధ్య సయోధ్య కుదిరేటట్టు చెయ్... లేకపోతే పోయి అక్కడుండి వండి పెట్టు. మధ్యలో నా మీద అరుస్తావేమిటి?'' అంది ఆవిడ.

“నీకు వంట చేసిపెట్టే పిల్లే కావాలంటే చదువుకున్న అమ్మాయిని ఎందుకు చేసుకున్నావురా?” అంది చివరకు సతీష్ తల్లి విసిగిపోయి.

“అదేంటమ్మా మొదట్నించీ మీరే కదా నాకేం కావాలో, ఎట్లా అయితే నేను సుఖంగా ఉంటానో చెబుతున్నారు. మీరు చెప్పినట్టే వింటున్నానా లేదా? మీరా అమ్మాయిని సెలెక్ట్ చేశారు. నేను సరే అన్నాను. నీకన్నీ తెలుసుకదా అనుకున్నాను,” అన్నాడు సతీష్.

“పూర్వంలాగా ఇప్పుడమ్మాయిల్ని నీకు వంటొచ్చా? ఇంటిపని చేస్తావా? అని అడగడం మర్యాద కాదు. అయినా ఎంతమంది పిల్లలు అమెరికా పోయి పన్లు నేర్చుకోటంలా? ఇదంతా ఎందుకుగానీ, అక్కడ ఇండియన్ రెస్టారెంట్లూ, ఇండియన్ గ్రాసరీ స్టోర్లూ బాగానే ఉన్నాయంట కదా… బయట తినండి కొన్నిరోజులు,” అంది సతీష్ వాళ్ళమ్మ.

“బాగానే ఉంది నీ సలహా. తిండి సరే… ఇల్లు కంపుకొట్టి పోతోంది,” అని విసుక్కుంటూ ఫోన్ పెట్టేశాడు సతీష్.

ఏ ఏ ఏ

“అతన్తో నాకసలు ఫ్రెండ్‌షిప్ కుదరటంలేదే… టిపికల్ ఇండియన్ మిడిల్‌క్లాస్ మేల్,” అంది వసంత అరుణతో ఫోన్‌లో.

“ఎంగేజ్‌మెంటయ్యే దాకా మీకు ఒకరి గురించి ఒకరికేమీ తెలీదయ్యే, సరిఫికెట్ల గురించి తప్ప. మరి ఇలాగే ఉంటుంది. పోనీ కొన్నాళ్ళు ఇండియా పో,” అంది అరుణ.

“అది కూడా అయింది. పెళ్ళికి బోలెడు ఖర్చు పెట్టాట్ట… అప్పుడే టికెట్లు కొనటం తన వల్ల కాదట. చెప్పేశాడు.”

అరుణకి ఏం చెప్పాలో తెలీటంలేదల్లే ఉంది. టెలిఫోన్ ఆ కొస నుంచి నిశ్శబ్దం…

“మంచి ప్రాజెక్టు చేస్తూ, మధ్యలో ఉద్యోగం వదిలేసొచ్చాను. చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉండేది. ఇంకో ఆరునెలలు ఉంటే నేనే టీం లీడర్ అయ్యేదాన్ని. అసలు నన్ను వొట్టి హోమ్ మేకర్ కింద చూస్తాడు. నాకతనితో ఫ్రెండ్‌షిప్ కుదరడం అసంభవం అరుణా! అసలు అర్థం చేసుకునే గుణం లేదు. చిన్న సహాయం కూడా చెయ్యడు… నీకు తెలుసా? వంటమ్మాయి రాకపోతే, అమ్మ ఎక్కడికైనా వెడితే నేనూ నాన్నా బయటే తినేసేవాళ్ళం. హాయిగా సినిమాకి పోయేవాళ్ళం.”

''మనకి మన అమ్మలూ నాన్నలూ శుభ్రంగా ఉండటం... అందంగా హుందాగా కనిపించటం... మంచి ర్యాంకులు తెచ్చుకోవటం నేర్పిస్తారు... పుట్టినరోజు పార్టీలు చేయటం... మంచి తిండి పెట్టడం... 'మంచి' మొగుణ్ణి చూడ్డం... వంటివన్నీ చేస్తారు. మనకు ఆలోచించే అవసరం కలిగేలా చెయ్యటం... స్వతంత్రంగా ఆలోచించగలిగే శక్తిని సమకూర్చడం... సమస్యలెదురైతే అదరక, బెదరక నిలబడే ఆత్మ విశ్వాసాన్నివ్వడం - ఇలాంటివేవీ వాళ్ళ దృష్టిలోకి రానేరావు. మనకి అన్నీ అమర్చినట్టే, మన బదులు వాళ్ళే ఆలోచించి పెడతారు. ఇప్పుడిది మరీ ఎక్కువైపోయింది. నువ్వే కాదు... సతీషూ అంతే. మీకేం కావాలో ఆలోచించుకోవాల్సిన అవసరమే ఇంతదాకా మీకు రాలేదు. అందుకే ఇట్లా ఒడ్డునపడ్డ చేపల్లా గిలగిలలాడుతున్నారు. మీరిద్దరూ వెళ్ళి కౌన్సెలింగ్ తీసుకోండి. ఇక్కడ ఇదిచాలా మామూలు.''

''ఏం కౌన్సెలింగో ఏమిటో... నిజం అరుణా! మా ఇంట్లో నేనెప్పుడూ టీ కప్పు కూడా కడగలేదు. కనీసం సింక్‌లో కూడా పడేసేదాన్ని కాదు. పనమ్మాయి నా చేతిలోంచి అందుకుని పోయేది. ఇక్కడేమో బాత్‌రూంలు కడగలేదని సతీష్ గొడవ! పోనీ తను కడగొచ్చు కదా ఎప్పుడైనా. అవన్నీ తప్పించుకోటానికే పెళ్ళి చేసుకున్నానని సిగ్గు లేకుండా చెప్పేశాడు.''

''చూడు వసంతా! నా మాట విని మీరిద్దరూ కౌన్సెలింగ్ తీసుకోండి. అతను రానంటే నువ్వే వెళ్ళు. లేకపోతే డిప్రెషన్ వస్తుంది నీకు.''

ఏ ఏ ఏ

''పాపని నేను తీసుకుపోతాను. దాన్ని పెంచటం నీవల్ల కాదు. నాకేం కష్టం ఉండదు. వంటమనిషి... పనికి పిల్ల... మీ నాన్నగారూ... నేనూ... ఇందరం ఉన్నాం. నీకు వర్క్ పర్మిట్లు వచ్చాయంటున్నావ్‌గా... ఉద్యోగం చూసుకో. లేకపోతే చదువుకో. మొదట్లో పాపం చాలా స్ట్రెస్ అయింది నీకు. పాపని మేం పెంచుతాం. నువ్వు హాయిగా జాబ్ చేసుకో, లేదంటే చదువుకో. సతీష్ ఇప్పుడు చాలా మారాడు, చూస్తున్నాంగా,'' అంది అమ్మ.

''ఇంకో యువరాణిని తయారుచెయ్యండి,'' అంటున్నాడు సతీష్.

అవతలవైపు సతీష్ తండ్రి కాబోలు ఫోన్‌లో ఉన్నాడు. స్పీకర్ ఆన్‌చేసి ఉన్నట్టుంది, వినబడుతోంది.

''పాపని వసుంధరగారితో పంపరా సతీష్. కొన్నాళ్ళు మేం కూడా చూసుకుంటాంలే... ఈ ఊరేగా. అచ్చంగా ఆవిడ మీదే వదలం,'' అంటున్నాడు.

''ఇటు అయిదుగురు - అటు అయిదుగురు పదిమంది కలిసి పెంచండి. వండర్‌ఫుల్ నాన్నా. ఇప్పుడు కూడా మేం ఏం చెయ్యాలో ఎలా చెయ్యాలో చెప్పటం మానుకోరా? మమ్మల్ని కాస్తయినా

ఆలోచించుకోనివ్వరా? వదిలెయ్యండి నాన్నా. ఇప్పటికైనా మమ్మల్ని కాస్త స్వతంత్రంగా మాదైన వ్యక్తిత్వంతో బతకనివ్వండి. మంచీ చెడూ ఆలోచించాల్సిన అవసరం మాకు రానివ్వండి... ఆలోచించుకునే అవకాశం ఇవ్వండి,'' అని ఫోన్ పెట్టేశాడు.

''ఏంలేదు - ఇద్దరూ పని చేసుకుంటే త్వరగా ఇల్లు కొనుక్కోవచ్చు,'' అంటోంది వసుంధర.

''ఏదో చేస్తాంలే అమ్మా. నువ్వు కూల్‌గా ఉండు. సతీష్ వాళ్ళ నాన్నకి చెప్పింది విన్నావు కదా?'' అని అక్కడి నుంచి వెళ్ళిపోయింది వసంత.

''ఇదేమిటీ?'' ఆశ్చర్యంగా అనుకుంది వసుంధర. ఈ ఎదురుచెప్పడం అదివరకు లేదు మరి.

## అభిమాని - సత్యజిత్ రాయ్, అనువాదం: అసూర్యంపస్య

పదకొండేళ్ళ తరువాత అరూప్ బాబు అనబడు అరూప్ రతన్ సర్కార్ మళ్ళీ పూరీ నగరాన్ని సందర్శిస్తున్నాడు. నగరం లో ఈ పదకొండేళ్ళలో చెప్పుకోదగ్గ మార్పులే జరిగినట్లు గమనించాడు - కొన్ని కొత్త ఇళ్ళు, కొత్త రోడ్లు, కొత్త హొటెళ్ళు - చిన్నవీ, పెద్దవీనూ. కానీ, బీచ్ లోకి అడుగుపెట్టిన మరుక్షణం అతనికి అర్థమైంది ఈ నగరం లో ఎప్పటికీ మారనిది ఒకటుందని.

అరూప్ దిగిన సాగరిక హొటెల్ నుండి సముద్రం కనబడదు. కానీ, రాత్రి వేళల్లో ఆ హొటెల్ అంతా నిద్రావస్థలోకి జారుకున్నాక అలల సవ్వడి చెవిన బడ్డం చాలా తేలిక. నిన్నరాత్రి సముద్రం చేసిన ఈ శబ్దాలే అరూప్ బాబు ని హొటెల్ నుండి బయటపడి బీచ్ కి వచ్చేలా చేసాయి. అతను పూరి కి ఆరోజు ఉదయమే వచ్చాడు కానీ ఏదో షాపింగని తిరగడం తో బీచ్ కి వెళ్ళలేకపోయాడు. ఇప్పుడు తెల్లగా నురగలు గక్కుతున్న అలలని చీకటి కమ్మిన అమావాస్య రాత్రిలో కూడా చూడగలుగుతున్నాడు. అతనికి సముద్రపు నీటిలో ఫాస్ఫరస్ ఉంటుందనీ, అందువల్లే ఆ అలలు చీకట్లో కూడా కనిపిస్తాయని ఎక్కడో చదివిన విషయం గుర్తు వచ్చింది. "ఇలా ప్రకాశిస్తున్న భావగర్భితమైన ఈ అలలు ఎంత అందంగా ఉన్నాయో కదా" అనుకున్నాడు. కలకత్తా లో అతడిని సృజనాత్మకత గల మనిషంటే ఎవరూ ఒప్పుకోరేమో. పర్వాలేదు. అరూప్ బాబు కి తెలుసు - అంతర్గతంగా తనలో ఉన్న కొన్ని సున్నితమైన భావాలు సగటు మనిషి కంటే తాను వేరు అన్న విషయం చెప్తాయి అని. ఈ సున్నితత్వాన్ని రకరకాల ఒత్తిళ్ళతో కూడిన దైనందిన జీవితం పాడుచేయకుండా అతడు జాగ్రత్తపడ్డాడు, అప్పుడప్పుడూ కలకత్తాలో నది ఒడ్డుకో, ఈడెన్ ఉద్యానవనానికో వెళుతూ ఉండటం ద్వారా ఇది సాధ్యమైంది. నదీ తరంగాలు, పచ్చదనం, పూల వనం - ఇవన్నీ అతనికి ఇప్పటికి కూడా ఓ ఆనందాన్ని ఇస్తాయి. ఈ ఆలోచనల్లో అతనుండగా, ఇంతలో ఓ పక్షి కూత అతని మదిని ఎంతో ఆశ్చర్యానికి గురిచేసింది - అది .. కోకిలా? మరింకేదన్నానా? ఏదేమైనా, కాసేపు ఇక్కడ ఇలా ఈ అలలను చూడటం అతనికి పదహారేళ్ళ ఉద్యోగజీవితం కలిగించిన అలసట నుండి కొంతవరకూ ఉపశమనం కలిగించింది.

ఈరోజు సాయంత్రం అతడు మళ్ళీ బీచ్ కి వచ్చాడు. అలల వెంబడి నడుస్తూ నడుస్తూ ఓ చోట ఆగాడు. ఎదురుగా కాషాయ వస్త్రధారి ఒకరు అమితమైన వేగం తో నడిచి వెళ్ళిపోతూ ఉంటే అతని వేగాన్ని అంగిపుచ్చుకోలేక అతని శిష్యగణం అతని వెనుక పరుగెడుతున్నారు. అది అరూప్ బాబు కి ఎందుకో గానీ నవ్వు తెప్పించింది. ఇంతలో అతని వెనుక నుండి ఓ చిన్న పిల్లవాడి గొంతుక వినబడ్డది.
"little boy's dream" పుస్తకం రాసింది మీరే కదూ? - ఆ గొంతుక అరూప్ బాబు ని ప్రశ్నించింది. అరూప్ బాబు వెనక్కి తిరిగాడు. తెల్ల చొక్కా, నీలం నిక్కరూ వేసుకున్న సుమారు ఏడేళ్ళ వయసున్న బాలుడు కనిపించాడు. వాడి మోచేతుల దాకా మట్టి అంటుకుని ఉంది. ఇంతింత కళ్ళతో ఆశ్చర్యంగా తన వైపే

చూస్తున్నాడు. అరూప్ బాబు జవాబిచ్చేలోపలే ఆ అబ్బాయి మళ్ళీ మాట్లాడటం మొదలుపెట్టాడు -
"నేను little boy's dream చదివాను. అది మా నాన్న నాకు పుట్టినరోజు కానుకగా ఇచ్చారు. నేను….
నేను…"

"చెప్పు, పర్వాలేదు. సిగ్గుపడకు." - ఈసారి ఇది ఓ ఆడ గొంతుక, ఆ పిల్లాడిని ప్రోత్సహిస్తున్నట్లు అనిపించింది. వెంటనే ఆ కుర్రాడు అందుకున్నాడు..

"నాకు మీ పుస్తకం చాలా నచ్చింది."

అరూప్ బాబు ఓ సారి ఆవిడ వైపు చూసాడు. దాదాపు ముప్పై ఏళ్ళు ఉంటాయేమో. అందంగానే ఉంది అనుకున్నాడు. ఆమె అరూప్ బాబు వైపు సూటిగా చూస్తూ, నవ్వుతూ నెమ్మదిగా అతన్ని సమీపించింది. అరూప్ బాబు ఆ అబ్బాయి తో -

"లేదబ్బాయ్, నేను ఏ పుస్తకమూ రాయలేదు. నువ్వు పొరబడ్డావు" అన్నాడు.

ఆవిడ ఆ పిల్లవాడి తల్లి అనడం లో సందేహం లేదు. వాళ్ళిద్దరి రూపురేఖల్లో పోలికలు కనిపిస్తున్నాయి.. ముఖ్యంగా చుబుకం దగ్గర.అరూప్ బాబు మాటలు విన్నాక కూడా ఆవిడ చిరునవ్వు చెరగలేదు. నిజానికి, చేరువయ్యేకొద్దీ ఆ చిరునవ్వు మరింత పెద్దదైంది. అతనితో - "మీకు ఇలా జనాలను కలవడం అంటే ఇష్టం లేదని మాకు తెలుసు. మా మరిది ఓ సారి మీకు వాళ్ళ ఫంక్షనుకొకదానికి ముఖ్య అతిథిగా రమ్మని ఉత్తరం రాస్తే మీకు అలాంటి విషయాల మీద అసలు ఆసక్తి లేదు అని జవాబిచ్చారు. కానీ, ఈ సారి మీరు తప్పించుకోలేరు. మాకందరికీ మీ కథలు అంటే ఇష్టం. మీరు పిల్లలకోసం రాసిన కథల్ని పెద్దవాళ్ళం మేము కూడా బాగా ఇష్టపడతాము" అంది. అరూప్ బాబు కి ఓ పట్టాన ఆ little boy's dream రాసిందెవరో తెలీడం లేదు కానీ, ఆ పిల్లవాడికి, వాడి తల్లికీ ఇద్దరికీ ఆ రచయిత అంటే సమానమైన అభిమానం ఉందని మాత్రం తెలుస్తూనే ఉంది. ఇలాంటి వింత పరిస్థితి తనకు కలుగుతుందని ఎవరు కలగన్నారు? వీళ్ళకి వాళ్ళు పొరబడ్డారు అని చెప్పి తీరాలి. కానీ, వాళ్ళను బాధపెట్టకుండా, వాళ్ళ మనసుకు కష్టం కలిగించకుండా చెప్పాలి.

అరూప్ బాబు కి ఉన్న సమస్య ఏమిటంటే అతను మరీ మెతక మనిషి. ఓ సారి వాళ్ళ చాకలి గంగాచరణ్ అతని కొత్త కుర్తా పైన ఓ చిల్లు చేసాడు. మరొకరయ్యుంటే గంగాచరణ్ గూబ గుయ్యిమనిపించేవారేమో. కానీ, దీనంగా చూస్తున్న గంగాచరణ్ మొహం చూడగానే అరూప్ బాబు కరిగిపోయాడు. "చూడు, ఇక నుంచైనా కాస్త జాగ్రత్త గా ఉండు" - అని మాత్రం అనగలిగాడు. ఈ సున్నితమైన మనస్తత్వమే ఇప్పుడు అతని చేత ఆ తల్లీబిడ్డలతో మృదువుగా - "నేనే ఆ రచయిత ను అని మీరు ఎలా చెప్పగలరు?" అనిపించింది. ఈ మాటలతో ఆవిడ ఆశ్చర్యంతో కనుబొమలెగరేసి - "ఈ మధ్యనే కదా మీ ఫొటో పేపర్ లో వచ్చింది? ఓ సాయంత్రం మీకు పిల్లల సాహిత్యానికి చేసిన సేవకు గుర్తింపుగా అకాడెమీ అవార్డు వచ్చిందన్న వార్త రేడియో లో విన్నాము. తరువాతి రోజే మీ ఫొటో పేపర్ లో వచ్చింది. ఇప్పుడు అమలేశ్ మౌలిక్ అన్న పేరు తెలిసిన వాళ్ళు మేము ఇద్దరం మాత్రమే కాదు. చాలా మంది ఉన్నారు.

అమలేశ్ మౌలిక్! అరూప్ బాబు కూడా ఈ పేరు విన్నాడు, కానీ ఫొటో ఎప్పుడూ చూడలేదు. ఒకవేళ తాను ఆ మనిషి లాగా ఉన్నాడా? కానీ, పేపర్లలో వేసే ఫొటోలు అంత స్పష్టంగా కనబడవు లే - అనుకున్నాడు.

"మీరు వస్తున్నారన్న విషయం ఇక్కడ ఇప్పటికే అందరికీ తెలిసిపోయింది." ఆవిడ మాట్లాడుతూనే ఉంది ఇంకా. "మేము మొన్నోరోజు సీ వ్యూ హొటెల్ కి వెళ్ళాము. నిన్నటిదాకా అక్కడ మా వారి స్నేహితులొకరు ఉండేవారు. ఆయనతో ఆ హొటెల్ మేనేజర్ చెప్పాడట మీరు గురువారం వస్తారు అని. మీరు సీ వ్యూ లో ఉంటున్నారా?"

"అ....లేదు..నేను...నేను అక్కడ ఆహారం అంత బాగుండదు అని విన్నాను."

"అది నిజమే. మేము కూడా అనుకున్నాము - మీరెందుకు ఆ హొటెల్ ఎంచుకున్నారా? దానికంటే బాగుండేవి చాలా ఉన్నాయి. ఇంతకీ ఇప్పుడు ఏ హొటెల్ లో ఉందామని నిర్ణయించుకున్నారు?"

"నేను .. సాగరిక లో ఉంటున్నాను."

"ఓహో...అది కొత్త హొటెల్ కదూ? ఎలా ఉంది?"

"నాకైతే పర్వాలేదు అనిపిస్తుంది. అయినా ఇక్కడేమీ రోజులతరబడి ఉండబోవడం లేదు కదా."

"ఎన్ని రోజులు ఉంటారు మీరు ఇక్కడ?"

"ఓ అయిదు రోజులు"

"అయితే మీరోసారి మా హొటెల్ కి రావాలి. మేం ఉండేది పూరీ హొటెల్. మిమ్మల్ని కలవడం కోసం ఎంత మంది ఎదురుచూస్తున్నారో మీరు ఊహించలేరు..ముఖ్యంగా పిల్లలు. అరే...మీ పాదాలు తడిసిపోతున్నాయి...చూసుకోండి."

ఓ పెద్ద అల తన పాదాల వైపు కి ఉరకలేస్తూ రావడం అరూప్ బాబు గమనించలేదు. కానీ, ఒక్క కాళ్ళు మాత్రమే కాదు తడిసింది... అంత గాలిలో కూడా తన శరీరమంతా చెమటతో ముద్దౌతోంది అన్న విషయం గమనించాడు. అయినా, ఆవిడ అన్ని మాట్లాడుతూ ఉంటే అడ్డు చెప్పి అసలు విషయం చెప్పే అవకాశం ఎలా జారవిడుచుకున్నాడు తను? ఇప్పుడిక చాలా ఆలస్యమైపోయింది. ప్రస్తుతానికి ఇక్కడినుండి వెళ్ళిపోయి, కాసేపు ఎక్కడన్నా ఏకాంతంగా కూర్చుని ప్రశాంతంగా ఆలోచించుకోవాలి తన ఈ చర్య కు పర్యవసానం ఏమిటో అన్న విషయాన్ని - అనుకుంటూ ఆవిడ తో ఇలా అన్నాడు :

"నేను...ఇక...బయలుదేరనా?"

"మీరు మళ్ళీ కొత్తది ఏదన్నా రాస్తున్నారు అనుకుంటా?"

"లేదు,లేదు. నేను సెలవు లో ఉన్నాను. రాయడం లేదు."

"ఆహా! సరే అయితే. మళ్ళీ కలుద్దాం. మా వారికి మీ గురించి చెబుతాను. రేపొస్తారా ఈ వైపు మళ్ళీ?"

అరూప్ బాబు ఏదో గొణిగి బయట పడ్డాడు.

అరూప్ బాబు అక్కడికి చేరే సమయానికి సీ వ్యూ హొటెల్ మేనేజర్ వివేక్ రాయ్ అప్పుడే ఓ పెద్ద పాన్ నోట్లోకి వేసుకుంటూ ఉన్నాడు. అరూపబాబు అతనితో -

"అమలేశ్ మౌలిక్ ఇక్కడికి వస్తున్నారా?"

"ఊ"

"ఎప్పుడు...వస్తారని...అనుకుంటున్నారు?"

"మంగళవారం. ఏం?"

ఈరోజు గురువారం. అరూప్ బాబు మంగళవారం దాకా ఆ ఊరిలో ఉంటాడు. మౌలిక్ టెలిగ్రామ్ పంపాడు అంటే అతను చివరి నిముషం లో అతని రాక ను వాయిదా వేసుకున్నాడనే అర్థం. మేనేజర్ కూడా అతను అసలుకైతే ఈరోజు రావాల్సి ఉన్నదని చెప్పాడు. వివేక్ రాయ్ అడిగిన - "ఏం?" కి జవాబు గా తనకి మౌలిక్ తో ఏదో పనుందని, మంగళవారం వచ్చి కలుస్తా అని చెప్పి బయటపడ్డాడు అరూప్ బాబు.

అక్కడి నుండి సరాసరి మార్కెట్ కి వెళ్ళి ఓ పుస్తకాల షాపుని వెదుక్కున్నాడు. అక్కడ అమలేశ్ మౌలిక్ రాసిన నాలుగు పుస్తకాలను కొన్నాడు. "లిటిల్ బాయ్స్ డ్రీమ్" మాత్రం కనబడలేదు. కొన్న నాల్గింటిలో రెండు నవల్లు, మిగితా రెండు చిన్న కథల సంకలనాలు.

సాయంత్రం ఆరున్నర అవుతూ ఉండగా అరూప్ బాబు తన హొటెల్ చేరుకున్నాడు. హొటెల్ ప్రవేశ ద్వారం వద్ద ఓ హాలు ఉంది. హాలుకి ఎడమవైపు మేనేజరు కుడివైపు ఓ బెంచి, కొన్ని కుర్చీలు వేసి ఉన్నాయి. వాటిపై ఇద్దరు పెద్దవాళ్ళు, పది సంవత్సరాలు దాటని ముగ్గురు పిల్లలూ కూర్చుని ఉన్నారు. పిల్లల్లో ఇద్దరు అబ్బాయిలు, ఒక అమ్మాయి. అరూప్ బాబు రాగానే ఆ పెద్దవాళ్ళిద్దరూ లేచి చేతులు జోడించి నమస్కారం చెప్పారు. వాళ్ళ పిల్లలని చూసి సైగ చేయగానే ఆ ముగ్గురు పిల్లలూ సిగ్గుపడుతూ అరూప్ బాబు ను సమీపించి అతను నిలువరించేలోపే అతని కాళ్ళకు నమస్కారం చేసారు.

"మేము పూరి హొటెల్ నుండి వస్తున్నాం" - ఆ పెద్దవాళ్ళలో ఒకాయన అన్నాడు. "నా పేరు సుహ్రిద్ సేన్. ఇతను గంగూలీ." - పరిచయం చేసుకున్నాడు అతను. "మిమ్మల్ని కలిసానని, మీరిక్కడ ఉంటున్నారని మాకు మిసెస్ ఘోష్ చెప్పారు.." అన్నాడు మళ్ళీ.

"ఇంకా నయం, ఆ పుస్తకాల షాపు వాడు ఓ కవర్ లో పెట్టిచ్చాడు పుస్తకాలను. లేకుంటే తన పుస్తకాలను తానే కొనుక్కుంటున్న రచయిత గురించి వీళ్ళు ఏమనుకునేవాళ్ళో!" అనుకున్నాడు అరూప్ బాబు.

అతను వాళ్ళన్న ప్రతి మాటకీ తలూపడం మొదలుపెట్టాడు, ఇక తన పొరపాటు ని కప్పిపుచ్చే మార్గం లేదని అర్థమై. "చూడండి, ఇది మరీ విడ్డూరంగా ఉంది. ఆ అమలేశ్ మౌలిక్ ఫొటో నేను చూడలేదు. కానీ, బహుశా అతను కూడా కాస్త నాలాగే ఉంటాడేమో. అతనిక్కూడా సన్నని మీసాలు, రింగుల జుట్టూ ఉన్నాయేమో. అతనూ కళ్ళజోడు వాడతాడు ఏమో. అతను కూడా పూరీ కి వద్దామనుకున్న విషయం నిజమే కావొచ్చు. కానీ, నేనా మనిషి ని కాను. నేను పిల్లల కోసం కథలు రాయను...అసలు నేను

రాయనే రాయను. నేను ఓ ఇన్సూరన్స్ కంపెనీ ఉద్యోగిని. ఏదో సెలవులు గడుపుదాం అని ఇక్కడికి వచ్చాను. నన్ను ఒంటరిగా వదిలెయ్యండి. ఆ అమలేశ్ మౌలిక్ మంగళవారం వస్తాడు. కావాలంటే సీ వ్యూ కి వెళ్ళి ధృవపరుచుకోండి ఈ విషయం." - అని అరూప్ బాబు ఓ సారి చెబితే చాలు. కానీ,ఈ తరహా ఉపన్యాసం పనికొస్తుందా? వీళ్ళు తానే అమలేశ్ మౌలిక్ అన్న పూర్తి నమ్మకంతో ఉన్నారు. తాను స్వయంగా చెప్పినప్పుడే నమ్మలేదు నిన్న. ఇప్పుడు సీవ్యూ లో ఉన్న ఆ టెలిగ్రామ్ మాత్రం నమ్మించగలదా వీళ్ళని? వాళ్ళు అది కూడా వాళ్ళని పంపేయడానికి తాను ఆడిన నాటకం అనుకోవచ్చు. అసలీ సాగరిక లో తాను మారుపేరు తో దిగి వాళ్ళని దారి మళ్ళించడానికి సీవ్యూ కి టెలిగ్రామ్ పంపానని అనుకున్నా ఆశ్చర్యం లేదు. పైగా, ఈ పిల్లలు ఉన్నారు. వాళ్ళ మొహాలు ఒక్క సారి చూడగానే అరూప్ బాబు ఈ తతంగమంతా పొరపాటు అని చెప్పబోయిన వాడల్లా ఆగిపోయాడు. వాళ్ళు ముగ్గురూ ఎంతో ఆరాధనా భావం తో చూస్తున్నారు తనని. ఇప్పుడిలా చెబితే వాళ్ళ ఉత్సాహమంతా నీరుగారిపోతుంది.

"బాబున్, నువ్వు అమలేశ్ బాబు ని ఏమన్నా అడగాలనుకుంటే అడుగు" - సుహ్రిద్ సేన్ ఆ పిల్లల్లో పెద్దబ్బాయిని చూస్తూ అన్నాడు.

ఇక వెనుదిరిగే మార్గం లేదు. ఆ బాబున్ అనే కుర్రాడు తల ఒక వైపు కి ఆన్చి తన వైపే చూస్తున్నాడు చేతులు కట్టుకుని - ప్రశ్న అడగడానికి రెడీగా.

"ఆ చిన్న పిల్లవాడిని నిద్రపుచ్చిన ముసలాయన …ఆయనకి మ్యాజిక్ తెలుసా?"

ఈ కీలకమైన క్షణం లో తన బుర్ర మునుపటి కంటే బాగా పనిచేస్తోందని గ్రహించాడు అరూప్ బాబు. కాస్త వంగి బాబున్ చెవిలో - "ఊ, నువ్వేమనుకుంటున్నావ్?" అని అడిగాడు.

"అతనికి మ్యాజిక్ తెలుసు అనుకుంటున్నాను." - ఇది విన్న తక్కిన ఇద్దరి పిల్లలూ - "అవును, అవును - అతనికి మ్యాజిక్ తెలుసు. మేమందరం తెలుసని అనుకుంటున్నాం" అన్నారు.

"నిజం" అరూప్ బాబు పైకి లేస్తూ అన్నాడు - "మీరు ఏది నిజం అనుకుంటే అదే నిజం. నేను ఏది రాయాల్సి ఉందో అదే రాసాను. దానికి అర్థమేమిటో తెలుసుకోవాల్సింది మీరు. మీరు ఏది సరి అయినది అనుకుంటున్నారో అదే నిజం. మిగితావన్నీ మనకనవసరం." అన్నాడు. పిల్లలు ముగ్గురికీ ఈ జవాబు నచ్చినట్లు అనిపించింది. హాలు నుండి వెళ్ళిపోయేముందు సుహ్రిద్ సేన్ అరూప్ బాబు ని తరువాతి రాత్రి భోజనానికి ఆహ్వానించాడు. ఆ హొటెల్లో ఎనిమిది బెంగాలీ కుటుంబాలు ఉంటున్నాయి. ఈ గుంపు లో అమరేశ్ మౌలిక్ అభిమానులు అయిన పిల్లలు సుమారుగా ఉన్నారు. తాను తాత్కాలికంగా అయినా అమరేశ్ మౌలిక్ గా నటించక తప్పదని అర్థమైన అరూప్ బాబు దీనికి అభ్యంతరం చెప్పలేదు. ఇప్పుడిక పర్యవసానాల గురించి దిగులు పడి ప్రయోజనం లేదు. కానీ, అరూప్ బాబు ఒక్క విషయం మీద మాత్రం పట్టుదలగా ఉండాలి అనుకున్నాడు. అందుకని -

"చూడండి, నాకు ఈ హంగామా అంతగా ఇష్టం లేదు. జనం తో కలవడం నాకు అలవాటు లేదు. కనుక, దయచేసి ఈ విషయానికి ప్రచారం కల్పించవద్దని నా మనవి" అన్నాడు సేన్ తో.

రేపటి రాత్రి తర్వాత అతన్ని ఎవరూ ఇబ్బంది పెట్టరని సేన్ హామీ ఇచ్చాడు. మిగితా వారికి కూడా అతని ని(మౌలిక్ గా చెలామణి అవుతున్న అరూప్ బాబు ని) ఒంటరిగా వదిలెయ్యమని చెప్తానన్నాడు.

తరువాత, అరూప్ బాబు భోజనం త్వరగా చేసేసి హబూస్ ట్రిక్స్ అన్న మౌలిక్ పుస్తకం చేతుల్లోకి తీసుకుని నిద్రకుపక్రమించాడు. మిగితా మూడు పుస్తకాలు - తుతుల్స్ అడ్వెంచర్, చెక్‌మేట్, స్పార్క్లర్స్. ఈ చివరి రెండూ చిన్న కథల సంకలనాలు. అరూప్ బాబు సాహిత్యాన్ని మధించిన మేధావేమీ కాదు. కానీ, తన స్కూలు రోజుల్లో ఎందరో భారతీయ, విదేశీ రచయిత లు రాసిన పిల్లల సాహిత్యం బాగానే చదివాడు. అవి చదివి దాదాపు ముప్పై తొమ్మిదేళ్ళు అవుతున్నా కూడా తనకు ఇంకా అప్పటి కథలు గుర్తు ఉన్నాయన్న విషయం తలుచుకుని అతనికి ఆశ్చర్యం కలిగింది. అంతే కాదు, అమలేశ్ మౌలిక్ కథల్లో చాలా వాటి వస్తువుకో, కథనానికో తాను స్కూలు కుర్రాడిగా చదివిన కథలతో పోలికలు ఉన్నట్లు గమనించాడు. ఈ నాలుగు పుస్తకాలు కలిపి ప్రింటులో ఓ 125 పేజీలు ఉండి ఉండొచ్చు. అరూప్ బాబు చివరి పుస్తకం పూర్తిచేసి లైటు తీసేసే సమయానికి ఆ హొటెల్ మొత్తం నిశబ్దంగా ఉంది. కొంత దూరం లో సముద్రం చేస్తున్న శబ్దాలు మాత్రం వినిపిస్తున్నాయి. "ఇప్పుడు టైమెంతయింది?" అరూప్ బాబు వాచీ అతని దిండు పక్కన పడి ఉండింది. అతను దాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు. అది ఒకప్పుడు తన తండ్రిది. దానికి రేడియం డయల్ ఉన్నందువల్ల ఆ చీకట్లో నురగల అల లా మెరిసింది. అప్పుడు సమయం అర్ధరాత్రి పన్నెండు గంటలా నలభై అయిదు నిముషాలు.

అమలేశ్ మౌలిక్ పిల్లల సాహిత్యం లో చాలా పేరున్న రచయిత. ఆ భాష సరళంగానూ, శైలి అనూహ్యంగా నూ ఉంది అన్న విషయం ఒప్పుకోవాల్సిందే. అతని పుస్తకాలు ఏకబిగిన చదవకుండా ఆగడం కష్టం. కానీ, వాటిలో కొత్తదనం తక్కువనే చెప్పాలి. ఇలాంటి కథలు స్నేహితుల దగ్గర వినే ఉంటారు. మనుష్యులకు రకరకాల అనుభవాలు ఎదురౌతూ ఉంటాయి. వింతగా అనిపించేవి, చాలా ఆసక్తికరమైన సంఘటనలు ఇలాంటివి ఎన్నో మనకే జరగొచ్చు కూడా. రచయిత చేయాల్సిందల్లా ఇలాంటి అనుభవాలను తీసుకుని దానికి కాస్త సృజనాత్మకత జోడించడమే. ఇంకోళ్ళ ఆలోచనలను అరువు తెచ్చుకోవాల్సిన అవసరం ఏముంది? అరూప్ బాబు కి మౌలిక్ మీద ఉన్న గౌరవం కాస్త తగ్గింది. కానీ, అదే సమయం లో కాస్త ప్రశాంతంగా అనిపించింది. ఇప్పుడు ఈ ప్రఖ్యాత రచయిత గా నటించడం కాస్త తేలిక. రాత్రి పూరీ హొటెల్లో డిన్నర్ తరువాత మౌలిక్ పట్ల అతని అభిమానులకున్న గౌరవం మరింత ఎక్కువైంది. అరూప్ బాబు మధ్య దొరికిన సమయం లో The little boy's dream ప్రతి ఒకటి సంపాదించగలిగాడు, వేరే షాపు నుండి. కనుక ఆ పదమూడు పిల్లలు అడిగే సవాలక్ష ప్రశ్నలకు జవాబివ్వడం అతనికి పెద్ద కష్టంగా అనిపించలేదు. పార్టీ ముగిసే సరికి పిల్లలంతా అరూప్ బాబు ని హనీలిక్ బాబు అని పిలవడం మొదలు పెట్టాడు. అరూప్ బాబు 'మౌ' అన్న బెంగాలీ పదానికి హనీ అన్నది ఇంగ్లీషు అర్థం అని చెప్పడం దీనికి కారణం. ఈ కొత్త నామధేయం విన్న డాక్టర్ దాస్‌గుప్తా అన్న అతిథి అరూప్ బాబు తో - "మీరు తేనె ని

సృష్టించారు, ఈ పిల్లలందరూ దాని రుచి చూస్తున్నారు'' అన్నాడు. దానికి ఆయన భార్య సురంగమా దేవి - ''కేవలం పిల్లలు మాత్రమేనా? పెద్దలని మరిచిపోకండి'' అని జోడించింది.

ఈ పార్టీ తరువాత పిల్లలు అరూప్ బాబు ని కథ చెప్పమని అడిగారు. అరూప్ బాబు జవాబు గా తనకి అలా ఉన్నపళంగా కథలు చెప్పడం రాదనీ, కానీ ఓ చిన్నప్పటి సంఘటన గురించి చెప్తాను అన్నాడు.
అరూప్ బాబు కుటుంబం చిన్నప్పుడు బంచారాం అక్రూర్ దత్తా వీథి లో ఉండేవారు. అతనికి సుమారు అయిదు సంవత్సరాల వయసు ఉన్నప్పుడు వాళ్ళింట్లో ఓ ఖరీదైన గడియారం కనిపించకుండా పోయింది. అతడి తండ్రి ఆ ఊళ్ళోని ఓ మంత్ర విద్య తెలిసిన వాడిగా పేరుపడ్డ పండితుణ్ణి ఇంటికి తీసుకొచ్చాడు. ఆ పండితుడు ''ఆ దొంగని నేను ఇట్టే పట్టేస్తాను'' అన్నాడు. తరువాత ఓ పెద్ద కత్తెర తీసుకుని దాన్ని పటకారు లా పట్టుకుని, ఓ వెదురు బుట్ట తీసుకుని వచ్చాడు. ఏవో మంత్రాలు జపించి, కాస్త బియ్యాన్ని ఆ బుట్టపై చల్లి, మొత్తానికి ఆ దొంగ మరెవరో కాదు... ఇంట్లో కొత్తగా చేరిన పనివాడు నటవర్ అని తేల్చాడు. అరూప్ బాబు మామ ఆ నటవర్ ను జుట్టు పట్టి లాక్కొచ్చి చితకబాదుతూ ఉన్నప్పుడు గడియారం మంచం పై కప్పిన దుప్పటి లోంచి జారి నేల మీద పడ్డది.

- ఈ కథ ముగియగానే పిల్లలందరూ చప్పట్లు కొట్టారు. అరూప్ బాబు ఇక వెళదామని బయలుదేరాడు కానీ, ''వద్దొద్దు. వెళ్ళకండి. కాసేపు ఉండండి'' అంటూ ఆ పిల్లలందరూ అడగడంతో ఆగాల్సి వచ్చింది. సుమారు అరడజను మంది పిల్లలు వెంటనే అక్కడి నుండి వెళ్ళి వాళ్ళు కొన్న అమలేశ్ మౌలిక్ రాసిన ఏడు పుస్తకాలతో తిరిగొచ్చారు. ''ఈ పుస్తకాలపై మాకోసం సంతకం చేసి పెట్టరూ?'' అని అడిగారు. అరూప్ బాబు వారితో - ''నాకు ఇలా పుస్తకాల పై సంతకం చేసే అలవాటు ఎప్పుడూ లేదు. ఓ పని చేస్తా... ఇవి తీసుకెళ్ళి ఒక్కో పుస్తకం పై ఒక్కో బొమ్మ వేసి ఇస్తాను. ఎల్లుండి సాయంత్రం నాలుగున్నరకి వచ్చి ఇవి తీసుకెళ్ళండి.'' అన్నాడు. పిల్లలు మళ్ళీ చప్పట్లు కొట్టారు. ''అవునవును, బొమ్మ అయితే సంతకం కంటే ఎక్కువ'' అన్నారు.

అరూప్ బాబు స్కూల్లో చిత్రలేఖనం లో ఓ సారి బహుమతి గెలుచుకున్నాడు. కానీ, అప్పట్నుంచి ఎప్పుడూ మళ్ళీ బొమ్మలు గీయలేదు. అయినా కూడా ప్రయత్నిస్తే ఈ పుస్తకాల పై చిన్న చిన్న బొమ్మలు గీసి ఇవ్వడం అసాధ్యమేమీ కాదు కదా! తరువాతి రోజు శనివారం. అరూప్ బాబు ఉదయాన్నే ఈ పుస్తకాలు, పెన్నూ తీసుకుని బయలుదేరాడు. నూలియా కాలనీ వద్ద బొమ్మలు గీయడానికి బోలెడు దృశ్యాలు ఉన్నాయని తెలుసుకున్నాడు. దాదాపు గంట పట్టింది అతని పని పూర్తయ్యే సరికి. మొదటి పుస్తకం లో ఎండ్రకాయ బొమ్మ గీసాడు. రెండో దానిలో ఇసుక పై పక్కపక్కనే పడున్న మూడు గవ్వల బొమ్మ, తరువాత ఓ కాకుల గుంపూ, ఓ చేపలు పట్టే పడవ, ఒక నూలియా గుడిసె, ఒక నూలియా పిల్లవాడు, ఇక చివరగా పదునైన చివర్లు ఉన్న ఓ టోపీ వేసుకుని ఉన్న నూలియా మనిషి చేపల వల తయారు చేస్తున్న దృశ్యం గీసాడు. ఆ ఏడుగురు పిల్లలూ చెప్పినట్లు గానే నాలుగున్నరకే వచ్చేసారు

ఆదివారం నాడు. ఈ బొమ్మలు వేసిన పుస్తకాలు తీసుకుని ఆనందంగా నవ్వుతూ, తుళ్ళుతూ వెళ్ళిపోయారు. ఆరోజు రాత్రి నిద్రకుపక్రమిస్తూ అరూప్ బాబు తన మదిలో కంగారు, అందోళన వంటి భావాల స్థానం లో ఓ విధమైన ఆనందం కలగడం గమనించాడు. అతను ఇప్పటిదాకా ఎవరితోనూ "నేను అమలేశ్ మౌలిక్ ని" అని ఎవరితో చెప్పలేదన్నది నిజమే. కానీ, గత మూడు రోజులుగా అతను చేసినదంతా ఓ పెద్ద మోసం కిందే లెక్క. ఎల్లుండి మంగళవారం అసలు మౌలిక్ రాబోతున్నాడు. ఇప్పటి దాకా ఈ పిల్లల దగ్గర్నుంచీ, వాళ్ళ తల్లిదండ్రుల దగ్గర్నుంచీ తాను పొందిన అభిమానం ఆదరణ అంతా అసలుకి అతని చెందాల్సినవి. మౌలిక్ బాగా రాస్తాడా లేదా అన్నది కాదు ప్రశ్న. అతను వీళ్ళ దృష్టి లో ఓ హీరో అన్న విషయం తెలుస్తూనే ఉంది. ఒకవేళ అతను వచ్చి, సీవ్యూ మేనేజర్ అతని రాక గురించి అందరికీ చెప్పడం మొదలుపెడితే ఏమౌతుంది? ఈ ఆలోచనే అరూప్ బాబు కి చాలా ఇబ్బందిగా అనిపించింది.

మరి...ఓ రోజు ముందుగా వెళ్ళిపోతేనో? లేదంటే మంగళవారం అంతా ఏం చేయాలి? ఎక్కడ దాక్కోవాలి? జనాలకి నిజం తెలిస్తే తనను చితగ్గొట్టరూ? ఇక మౌలిక్ గారు ఏమంటారో! ఆయన కూడా చెయ్యెత్తవచ్చు. రచయితలందరూ శాంతికాముకులనీ, అహింసావాదులని ఎవరు చెప్పగలరు? ఇలాంటి పనులకి జైలుపాలు అయ్యే అవకాశం ఉందా? ఉందేమో. ఏది ఏమైనా తాను చేసింది తప్పనడం లో ఎలాంటి సందేహం లేదు. అరూప్ బాబు లేచి నిద్రలేమి భయం తో ఓ నిద్ర మాత్ర మింగాడు. చివరికి, ఏమైనా మంగళవారం రాత్రి ట్రైన్ కే వెళదాం అని నిశ్చయించుకున్నాడు. అసలు మౌలిక్ ఎలా ఉంటాడో చూడాలన్న తాపత్రేయం భయాన్ని మించిపోయింది. ఎలాగోలా మౌలిక్ ఫొటో పడ్డ పేపర్ ను సంపాదించాడు. తాను అనుకున్నట్లే మౌలిక్ కు సన్నని మీసం, రింగుల జుట్టు, సన్న ఫ్రేముల కళ్ళజోడు ఉన్నాయి. కానీ, ఇక ఎంతవరకూ ఈ పోలికలు ఉన్నాయో తెలుసుకోవాలంటే మనిషి ని చూడాల్సిందే. ఆ పేపర్ లో ఉన్న బొమ్మ స్పష్టంగా లేదు. అరూప్ బాబు స్టేషన్ కి వెళ్ళాలని నిశ్చయించుకున్నాడు. కేవలం మౌలిక్ ని చూట్టానికే కాదు..వీలైతే మాట్లాడ్డానికి. "మీరు అమలేశ్ మౌలిక్ కదూ? మీ ఫొటో చూసాను పేపర్లో ఆ మధ్య. మీ కథలను చదవడం నాకు ఇష్టం..." ఇలా ఏదో మాట్లాడేసి తరవాత తన సామాన్లంతా స్టేషన్ లో వదిలి తాను ఇంత వరకు చూడని కోణార్క్ కి వెళ్ళిపోయి అక్కడ సూర్య భగవానుని ఆలయం చూసుకుని తరువాత కలకత్తా రైలు సమయానికి స్టేషన్ చేరుకుందాం అనుకున్నాడు. అంతకంటే దాక్కోడానికి మార్గం లేదు మరి!

మంగళవారం నాడు పూరీ ఎక్స్ప్రెస్ ఇరవై నిముషాలు ఆలస్యంగా వచ్చింది. అరూప్ బాబు ఓ స్థంభం వెనక నిలబడి ట్రైన్ లోని ఫస్ట్ క్లాసు బోగీల్లోంచి దిగుతున్న ప్రయాణికుల పై ఓ కన్నేసి ఉంచాడు. షార్ట్స్ వేసుకున్న ఓ విదేశీయుడు దిగాడు మొదట. పక్క వైపు తలుపు దగ్గర్నుంచి ఓ ముసలావిడ, ఆవిడకి సాయం చేస్తూ ఓ తెల్ల ప్యాంటు వేసుకున్న యువకుడూ దిగారు. వీళ్ళ తరువాత ఓ ముసలాయన,

తరువాత - అవును, సందేహం లేదు... ఇతనే అమలేశ్ మౌలిక్. తామిద్దరి మధ్య పోలికలు బాగానే ఉన్నాయి. కానీ, అరూప్ బాబు వెళ్ళి అతని పక్కన నిలబడితే వీళ్ళిద్దరూ కవలలు అనుకునేంత ప్రమాదమైతే లేదు. మౌలిక్ అరూప్ బాబు కంటే పొట్టిగానూ, రంగు కూడా తక్కువగానూ ఉన్నాడు. కాస్త పెద్దవాడిలా కూడా అనిపించాడు - చెవుల వద్ద జుట్టు కాస్త తెల్లబడింది. అరూప్ బాబు ఇంకా అంత పెద్దవాడు కాలేదు. అతను తన సూట్‌కేసు ట్రైన్ నుంచి తీసుకుని కూలీ కోసం అరిచాడు. కూలీ, అరూప్ బాబు ఇద్దరూ ఒకే సారి అతని వద్దకు వెళ్ళారు.

"మిస్టర్ మౌలిక్ అనుకుంటా?"

- అతను ఆశ్చర్యంగా చూసాడు. తరువాత అరూప్ బాబు ని చూస్తూ తల ఊపాడు. "అవును" అన్నాడు పొడిగా.

కూలీ సూట్‌కేసు తీసుకుని తన తలపై పెట్టుకున్నాడు. అరూప్ బాబు వద్ద ఓ బ్యాగు, భుజానికి వ్రేళ్ళాడుతూ ఓ ఫ్లాస్కు ఉన్నాయి. ముగ్గురూ బయటకు వెళ్ళే ద్వారం వద్దకు నడవడం మొదలుపెట్టారు.

అరూప్ బాబు అతనితో - "మీ పుస్తకాలు చదివాను. మీరు అకడమీ అవార్డు గెలిచిన విషయం పేపర్లో చదివాను. మీ ఫొటో కూడా చూసాను" అన్నాడు.

"హుమ్..."

"మీరు సీవ్యూ హొటెల్ లో బుక్ చేసుకున్నారు కదూ?"

ఈ సారి అమలేశ్ మౌలిక్ అరూప్ బాబు వంక అనుమానాస్పదంగా చూసాడు. అతనేమి ఆలోచిస్తున్నాడు అన్న విషయం ఊహించడం పెద్ద కష్టమేమీ కాదు.

"సీవ్యూ మేనేజర్ మీ అభిమాని. అతనే ఈ విషయం అందరికీ చెప్పాడు" - అరూప్ బాబు వివరించాడు.

"ఓహ్!"

"చాలా మంది పిల్లలు మీకోసం ఎదురుచూస్తున్నారు."

"హుమ్"

ఈ మనిషేమిటి ఇంత తక్కువ మాట్లాడుతున్నాడు? ఇప్పుడు నడక వేగం కూడా తగ్గింది.. ఏమాలోచిస్తున్నాడో?

ఇంతలో అమలేశ్ మౌలిక ఆగాడు. అరూప్ బాబు వైపు కి తిరిగి - "నేను వస్తున్నా అని చాలామందికి తెలిసిపోయిందా?" అని అడిగాడు.

"అవును. నాకర్థమయింది అదే. ఏం? మీకేమైనా ఇబ్బందా?"

"కాదు...కానీ నాకు ఒ...ఒ..ఒం..."

"ఒంటరిగా ఉండటం ఇష్టమా?"

"అవును"

ఇతనికి నత్తి ఉంది అన్న విషయం అర్థమౌతూనే ఉంది. ఇంగ్లాండు రాజు ఎనిమిదవ ఎడ్వర్డ్ గద్దె దిగాలని నిశ్చయించుకున్నాక అతని తమ్ముడు జార్జ్ కి దిగులు పట్టుకుంది తను రాజు కావడం గురించి. ఎందుకంటే తనకేమో నత్తి, రాజన్నాక ఉపన్యాసాలు ఇవ్వాల్సి వస్తుంది అని! అరూప్ బాబు కి ఆ విషయం గుర్తు వచ్చింది. కూలీ సామాన్లు తీసుకుని గేటు వద్ద ఎదురుచూస్తున్నాడు. వీళ్ళిద్దరూ వడివడిగా అక్కడికి నడిచారు.

"కి..కి..కీర్తి కి ము..ము..మూల్యం ఇదే."

అరూప్ బాబు ఇలా నత్తి తో మాట్లాడే తమ హీరో ని చూసిన ఆ పిల్లల పరిస్థితి ని ఊహించుకున్నాడు. అతని ఊహ లో కనబడ్డ విషయం అతనికి నచ్చలేదు.

"మీరు ఒక పని చేయవచ్చు" - స్టేషన్ బయటకు వస్తూ అమలేశ్ తో అన్నాడు.

"ఏమిటీ?"

"మీ సెలవంతా అభిమానుల వల్ల పాడుకావడం నాకు నచ్చలేదు."

"నాక్కూడా"

"అప్పుడు సీవ్యూ కి వెళ్ళకండి."

"ఎ..ఏమిటీ?"

"అక్కడ భోజనం అస్సలు బాగుండదు. నేను సాగరిక లో ఉన్నాను. నా రూమ్ ఖాళీగానే ఉంది. మీరు అక్కడికి వెళ్ళమని నా సలహా"

"ఓహ్!"

"ఇంకా..మీ అసలు పేరు ఉపయోగించకండి. మీరు ఆ మీసాలు పూర్తిగా తీసేస్తే మరీ మంచిది."

"మీ..మీస్.."

"వెంటనే. ఇక్కడే వెయిటింగ్ రూమ్ కి వెళ్ళి రావొచ్చు దీని కోసం. ఓ పది నిముషాల కంటే పట్టదు అనుకుంటాను. ఈ పని చేసారంటే మిమ్మల్ని ఎవరూ గుర్తు పట్టరు. ఏకాంతం లో గడుపుదామని మీరు ఎంతగానో ప్లాన్ చేసుకున్న మీ సెలవులకు ఎవరూ అంతరాయం కలిగించరు. నేను కలకత్తా నుండి కావాలంటే టెలిగ్రాం పంపుతాను సీవ్యూ వాళ్ళకి - మీరు మీ పర్యటన విరమించుకున్నారని."

మౌలిక్ నుదుటి పై దిగులు కి చిహ్నంగా కనబడ్డ గీతలు పోవడానికి ఇరవై సెకన్లు పట్టింది. కళ్ళ దగ్గర, నోటి దగ్గరా కొత్త గీతలు ఏర్పడ్డాయి. అతను నవ్వుతున్నాడిప్పుడు.

"మీమీ..మీకు ఎలా కృ..కృ…తజ్ఞతలు చెప్పాలో..అర్ అర్థం…కావడం లేదు."

"పర్లేదు. కానీ, దయచేసి మీరు ఈ పుస్తకాల పై సంతకాలు చేస్తారా నా కోసం? ఆ వేప చెట్టు కింద నిలబడదాం రండి, అక్కడైతే మనల్ని ఎవరూ కనిపెట్టలేరు."

- ఆ చెట్టు వెనక నిలబడి అమలేశ్ తన ఎర్ర పార్కర్ పెన్ను ని జేబులోంచి తీస్తూ అరూప్ బాబు వైపు అభినందనాపూర్వకంగా చూసాడు. అవార్డు వచ్చిన రోజు నుండి ఎంతో సాధన చేసి తన సంతకం సరిగ్గా

చేయడం నేర్చుకున్నాడు. అయిదు పుస్తకాలపై అయిదు సంతకాలు. తన నాలుక కి నత్తి అయినా కూడా తన కలానిది కాదు అని అతనికి తెలుసు.

------ ------ ముగింపు -----------------